
ఓం

# స్థితప్రజ్ఞుడు - భక్తుడు




రచయిత :

పాణ్యాం రామనాథశాస్త్రి

కోవెలకుంట్ల.

ఓం

# స్థితప్రజ్ఞుడు - భక్తుడు




రచయిత :

పాణ్యాం రామనాథశాస్త్రి

కోవెలకుంట్ల.

ప్రథమ ముద్రణ :— 1995 నవంబర్

ప్రతులు :— 1000

వెల : రూ. 25-00

సర్వహక్కులు:— రచయితవి

I VENKATESWARA
...NTRAL LIBRA...
RESEAR...
Acc. No. 54067
Date.
TIRUPATI

ప్రతులకు:
పాణ్యం రామనాథశాస్త్రి B.A., BL.,
అడ్వొకేట్
కోవెలకుంట్ల - 518 134
కర్నూలు జిల్లా.

ముద్రణ :
గాయత్రి ప్రింటర్స్,
టి. బి. రోడ్డు, ప్రొద్దుటూరు.

# అంకితము

నాకు ఆధ్యాత్మిక ప్రగతికి ఎంతో ప్రోత్సాహమిచ్చిన

పూజ్యపాదులు

శ్రీ శంకరానందస్వామిగారికి

వారి అనుంగు శిష్యులు

శ్రీ రామకృష్ణానందస్వామిగారికి

ఈ చిన్ని హొత్తాన్ని భక్తిపూర్వకంగా
అంకితమిస్తున్నాము.

శ్రీ పాణ్యాం రామనాథశాస్త్రి

శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారి
ఆర్థిక సహాయంతో
ఈ గ్రంథము ముద్రించబడినది.

## రచయితను గురించి

జననము : 12-12-1918 కోవెలకుంట్ల, కర్నూలు జిల్లా.

జననీ జనకులు : శ్రీమతి సావిత్రమ్మ, పాణ్యాం రామయ్యగారు

1941-76 వరకు న్యాయవాదవృత్తిని అవలంభించిరి.

1944 లో దివ్యజ్ఞాన సమాజ సభ్యులైరి.

1954 నుండి 1990 వరకు రాయలసీమ థియసాఫికల్ ఫెడరేషన్ కార్యదర్శిగ - అధ్యక్షులుగ వ్యవహరించిరి.

1981 నుండి 1987 వరకు దివ్యజ్ఞాన దీపికకు సంపాదకులుగ పని చేసిరి.

# తొలి పలుకులు

భగవద్గీత ఒక అగాధమైన జ్ఞాన ఖని. త్రవ్వేకొద్ది ఈ జ్ఞాన ఖనినుండి అమూల్యమైన జ్ఞానరత్నాలు లభిస్తాయి. ఈ జ్ఞాన రత్నాలు సాధకునికి అద్భుతమైన జ్ఞాన దీప్తిని, ఆనందాన్ని లభింపచేస్తాయి. ఈ వెలుగులో సాధకునికి మార్గం వ్యక్తమవుతుంది. అతను శీఘ్రంగా తన లక్ష్యాన్ని పొందగలుగుతాడు,

భగవద్గీతలో ప్రతి అధ్యాయం 'యోగము' అని ప్రస్తావించబడింది. తొలుత భగవంతునినుండి వియోగము చెందిన జీవుడు, మరల భగవంతునితో ఒక్కటవుతాడు. ఇలాంటి సంయోగాలను సాంఖ్య, కర్మ, జ్ఞాన, ధ్యాన, రాజయోగాలని పేర్లతో యోగీశ్వరుడైన కృష్ణుడు అర్జునునకు బోధిస్తాడు. ఆ యోగసాధకుల లక్షణాలు ఆయా అధ్యాయాల్లో చక్కగా వివరించబడ్డాయి. అందరు, అన్నియోగాలు అభ్యసించినవారు చివరకు స్థితప్రజ్ఞులుగా రూపొందుతారు.

స్థితప్రజ్ఞలక్షణాలలో సమాప్తమయ్యే సాంఖ్యయోగాన్ని, బ్రహ్మీభూత అళ్లగడ్డ శంకరానందస్వాములు 1958 వ సంవత్సరము జనవరి నెలలో కొవెలకుంట్ల బీదవిద్యార్థి శరణాలయంలో జరిగిన జ్ఞాన సప్తాహంలో ప్రవచించారు. శంకరానందులు హిందీలో ప్రసంగిస్తే, వారి శిష్యులు శ్రీ రామకృష్ణానందస్వాములు తెలుగులో అనువదించేవారు. మూలాన్ని మించి అనువాదం అద్భుతంగా వుండేది.

నేను అపుడపుడే ఆధ్యాత్మిక రంగంలో ప్రవేశించాను. స్వామిగార్లు నా అతిథులు. ఇందుచే వారికి నేను మరింత సన్నిహితుడైనాను. ఉపన్యాసాన్ని శ్రద్ధతో విని నోట్సు రాసుకొని, ఇంటిలో దాన్ని మరల పూర్తిగా వ్రాసి రామకృష్ణానందులవారికి చదివి వినిపించి, వారి అంగీకారాన్ని పొందేవాణ్ణి. ఇట్లాగా స్థితప్రజ్ఞ లక్షణాలను వ్రాయగల్గాను.

35 సంవత్సరాల తరువాత పాత కాగితాలను సర్దుతూవుంటే స్థితప్రజ్ఞ లక్షణాలు వ్రాసిన కాగితాలు కనిపించాయి. ఆ కాగితాలను మరలా చదివాను.

మిత్రులకు చదివి వినిపించాను. అచ్చువేస్తే బాగుంటుందని వారు సలహా ఇచ్చారు. ఈ విధంగా ఈ రచన వెలుగులోనికి వచ్చింది.

శ్రీ రామకృష్ణానందస్వాములు బ్రహ్మీభూతులైనారు. వారు అధ్యక్షులుగా వుండే ఆళ్లగడ్డ శంకరానందాశ్రమ కార్యవర్గంలో నేను సభ్యుడుగా వుంటున్నాను. ఒక కార్యవర్గసమావేశానికి వెళ్లిన సందర్భములో స్వామి యోగానందగారు శ్రీ రామకృష్ణానందస్వామి రచించిన "గీతాప్రోక్త భక్తుని లక్షణాలు" అనే గ్రంథాన్ని నాకు సమీక్షకొరకు ఇచ్చారు ఈ గ్రంథం స్వామివారి మరణానంతరం వెలువడింది. దాన్ని శ్రద్ధతో చదివి సమీక్ష వ్రాసినాను. ఈ గ్రంథములో వివరించిన భక్తుల లక్షణాలకు సంక్షిప్తంగా వ్రాస్తే బాగుంటుందని అనిపించింది. ఈ విధంగా "భక్తుడు" అనే రచన వెలికి వచ్చింది. కథలు చెప్పి శ్రోతల హృదయాలలో బోధనలు హత్తుకొని పోయేటట్లు చేయుట, రామకృష్ణానందస్వామి వారి ప్రత్యేకత. వారు రచించిన గ్రంథములో ఒక్కొక్క లక్షణానికి ఎన్నో కథలు వివరించారు. నేను ఆ కథలలో ముఖ్యమైనవాటిని సేకరించి, అక్కడక్కడ స్వీయానుభవాలను కథలను జోడించి రచన గావించాను.

తొండ ముదిరి వూసరవిల్లి అయినట్లు భక్తుడు నెమ్మది నెమ్మదిగా స్థితప్రజ్ఞస్థితిని పొందగలుగుతాడు. స్థితప్రజ్ఞుని లక్షణాలన్నీ భక్తునిలో పూర్ణంగా సరిపోస్తాయి. ఈ లక్షణాలన్నీ ద్వాదశోధ్యాయములోని చివరి ఎనిమిది శ్లోకాల్లో వివరించబడినాయి. ఏడు శ్లోకాల్లో భక్తుని లక్షణాలు ఎనిమిదవది, చివరిది అయిన శ్లోకంలో ఫలశ్రుతి వర్ణించబడింది. ఏడు శ్లోకాల్లో వివరించిన భక్తుని లక్షణాలను శ్రీ కృష్ణ భగవానుడు 'ధర్మ్యామృతం' అని వర్ణించినాడు. భక్తుడు శ్రద్ధావంతుడై "అసూయ లేనివాడై జీవితంలో ఏడు శ్లోకాల్లో వివరించిన సద్గుణాలను ఆచరణలో పెట్టినపుడు భగవంతునికి ప్రియతముడవుతాడు" అని భక్తజనపారిజాతుడైన భగవాన్ విష్ణువు ఉద్ఘాటించినాడు. అమృతము సేవించి దేవతలు అమర్త్యులైరి. కాని భక్తుడు ధర్మ్యామృతాన్ని సేవించి జన్మరాహిత్యాన్నిగాక విముక్తిని పొందుతాడు సృష్టిలోని అన్ని జీవరాసుల్లో మానవుడొక్కడే విముక్తి పొందును. దేవతలకు ఈ భాగ్యము లేదు. వారు కేవలము భోగజీవులే ఈ కారణంచేత భక్తుడు ధర్మ్యామృతాన్ని సేవించి ఆచరణలో పెట్టి భగవంతునికి ప్రియాతిప్రియుడవుతాడు. దేవున్ని ప్రేమించబడేవారి సంఖ్య అతిస్వల్పము,

దైవప్రీతికరములైన గుణాలను నిత్యజీవితంలో అనుష్ఠించి, భగవంతునికి ప్రీతిపాత్రులై దైవసాన్నిధ్యాన్ని పలువురు భక్తులు పొందిరి. కాని, అంతకన్న ఉత్తమకోవకు చెందిన రంతి దేవునివంటి భక్తులు తమకు మోక్షము అవసరము లేదు. స్వర్గము వద్దు, జన్మరాహిత్యము వలదు. తాము జన్మజన్మల నెత్తుచు, ఆర్తులైన దుఃఖితుల దుఃఖాన్ని బాపుటనే కోరుదురు.

"నత్వహంకారమయే రాజ్యం, న స్వర్గం, నాపునర్భవం
కామయే దుఃఖతప్తానాం, ప్రాణినాం, ఆర్తినాశనం"

మానవసేవయే మాధవసేవ అనేదే అట్లాంటి ఉత్తమ భక్తుల లక్ష్యము. ఇట్లాంటి సేవాభావంతో ముక్తిని పొందికూడా, అనేక జన్మలనెత్తి బోధిసత్త్వుడు పివరగా సిద్ధార్థుడుగా శాక్యవంశంలో జన్మించి బుద్ధత్వము నొందినాడు.

భగవంతుని కీర్తించుట, ధ్యానించుట కేవలం ఆడంబరంతో కూడిన పూజలు కారాదు. దీనుల దుఃఖితుల దుఃఖాన్ని పోగొట్టుటకు చేయు కృషియే నిజమైన మాధవ సేవ. అటువంటి క్రియాశీలుడే భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రుడు.

అంతర్వాణి అనే గ్రంథంలో సాధకులు అనుసరించవలసిన పద్ధతిని బోధించారు మేడమ్ బ్లావట్స్కి.

Let thy soul lend its ears to every cry of Pain
Let not the fierce Sun dry one tears of Pain
Before thyself has wiped from the sufferers eye

బాధలలో క్రుంగిపోతూంటే ఆర్తుల రోదనలు వినగల్గాలి. అసహాయులైన దీనుల కన్నీరు సూర్య తాపానికి ఆరిపోకముందే నీవు వారి కన్నీరు తుడువ కల్గాలి.

మానవుడు దుఃఖార్తిహరుడు కావాలని సందేశిస్తాడు కృష్ణపరమాత్మ. ఇట్లాంటి "తనయందు అఖిలభూతములందు ఒక భంగి సమహితత్వాన్ని పొంది" దుఃఖార్తిహరులై జీవించు మానవోత్తములే భగవంతునికి ప్రియాతిప్రియులు.

ఈ చిన్ని పుస్తకము ఏ ఒక్కరిలోనైన, భక్తిభావాన్ని ప్రోత్సహించ గల్గితే ధన్యున్ని.

ఈ గ్రంథముద్రణలో నాకు ఎంతో సాయపడిన ఓరియంటల్ కళాశాల ప్రిన్సిపాల్, శ్రీ నరాల రామారెడ్డిగార్కి, శ్రీనివాసులుగార్కి, ఇతర అధ్యాపకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ గ్రంథముద్రణకు 500/- రూ. విరాళమిచ్చిన శ్రీ యుతులు కల్లూరు రాధాకృష్ణయ్యగార్కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ గ్రంథాన్ని చక్కగా ముద్రించిన గాయత్రి ప్రింటర్స్ యజమాని నిరసింహారెడ్డిగార్కి నా కృతజ్ఞతలు.

పాణ్యం రామనాథశాస్త్రి

||ఓం||

శ్రీ రామకృష్ణానంద గురుభ్యోన్నమః

# నీ రా ం జ న ము

భగవద్గీత వంటి అతి సరళమైన పవిత్ర గ్రంథము మరొకటి లేదు. దీనికి టీక టిప్పణి వ్యాఖ్యలు ఎందరో మహానుభావులు వ్రాసివున్నారు. వ్రాస్తున్నారు. గీతను కొందరు జ్ఞానయోగమని, మరికొందరు కర్మయోగమని అభిప్రాయపడుతున్నారు. ఈ యోగాలన్నీ వివిధమార్గాలు. వీటన్నిటిలక్ష్యము దుఃఖ నివృత్తి ఆనందప్రాప్తి.

గీతయొక్క సారం త్యాగం. గీతను తిప్పి చదివితే త్యాగీ అగును. నీవు త్యాగివి కమ్మని భావన. కనుక ప్రతి మానవుడు తుదకు త్యాగి కావాలసిందే. త్యాగము చేతనే అమృతత్వము లభిస్తుందని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి.


భగవద్గీత మూడు షట్కములుగ విభజించబడింది. మొదటి షట్కములో స్థితప్రజ్ఞలక్షణాలు, రెండవ షట్కములో భక్తుని లక్షణాలు, మూడవ షట్కములో గుణాతీతుని లక్షణాలు చెప్పబడినాయి. బ్రాహ్మీభూత శ్రీ శ్రీ రామకృష్ణానంద స్వాములు స్థితప్రజ్ఞలక్షణములను గురించి భక్తుని లక్షణాల గురించి రెండు గ్రంథాలు వ్రాసినారు. ఈ గ్రథాలు అళ్లగడ్డ శంకరానందాశ్రమనుండి వెలువడినవి. గుణాతీత లక్షణాలగురించి శ్రీరామకృష్టానంద స్వాములు కొంతవరకు రచన గావించి పరమపదించారు. శ్రీరామనాథశాస్త్రి గారు భక్తుల లక్షణాలను ఈ గ్రంథమును ఆధారంగా చేసుకొని సంక్షిప్తంగా వ్రాసినారు. శ్రీ శంకరానంద స్వామివారి ఉపన్యాసములను విని, దాదాపు 25 సంవత్సరాల క్రితం నోట్సు వ్రాసుకొని దాన్ని సంస్కరించి 'స్థితప్రజ్ఞుడు' అను పేరుతో స్థితప్రజ్ఞ లక్షణాలను రచించారు. సినిమా, టి. వి. ప్రభావం ప్రబలంగావున్న ఈ రోజుల్లో గ్రంథాలు చదివే ఓపిక లేని చదువరులకు సులభంగా ఆధ్యాత్మిక విషయాలు తెలుసుకొనేందుకు, శ్రీ శాస్త్రిగారు సరళమైన భాషలో సంక్షిప్తంగా స్థితప్రజ్ఞలక్షణాలు ఒకే గ్రంథంలో పొందుపరచి మనకందరకు అందించినారు.

శ్రీ శాస్త్రిగారు కొంతకాలం న్యాయవాదిగా పనిచేసినారు. విశ్వజ్ఞాన సమాజానికి ఎనలేని సేవ చేసినారు. శ్రీ యల్లమరాజు సుబ్బయ్య స్మారక గ్రంథాలయాన్ని స్థాపించారు. ఓరియంటల్ సంస్కృత పాఠశాలను స్థాపించి నిర్వహిస్తున్నారు. అనేక గ్రంథాలను రచించి ఆంధ్రదేశానికి ఎనలేని సేవ చేశారు. వీరివలననే కోవెలకుంట్ల పట్టణంలో ఆధ్యాత్మిక మార్గము ఏర్పడినదని శ్రీరామకృష్ణానందస్వాములు అప్పుడప్పుడు అంటూండేవారు.

వీరు 75 సంవత్సరాల యువకులు వీరికి భక్తి, జ్ఞాన వైరాగ్యాలను సదురునాథుడు ప్రసాదించుగాక.

శంకరానందాశ్రమం,
ఆళ్లగడ్డ.
8-11-95

—ం
స్వామి మహేశ్వరానంద



# అభిప్రాయం

శ్రీ ప్రణవానందస్వామి

సూర్యచంద్రులవంటివారు స్థితప్రజ్ఞ భక్తులు. పరమార్థ దర్శన అమృత రసపానముచే ఆత్మనేవాత్మ నాతుష్టుడు, స్థితప్రజ్ఞుడు. సూర్యుడు స్వయం ప్రకాశి. చంద్రుడు సూర్యప్రకాశమున వెల్గొందుచున్నాడు. అట్లే భక్తుడు దైవదర్శన, దైవానుగ్రహ, దైవవిశ్వాసముచే నిత్యతృప్తుడు. అట్టి స్థితప్రజ్ఞభక్తులను ఒకే వేదికపై దర్శింపజేసిన తత్త్వనిధులు. బహు గ్రంథ కర్తలు, దివ్యజ్ఞాన సమాజీయులు. బ్రహ్మశ్రీ పాణ్యం రామనాథశాస్త్రిగారి కృషి సఫలము, సంస్తుత్యము, ప్రశంసనీయము.

రేపు పట్టాభిషేకము కాదు రేపు వనవాసమనినా సమతుల్యము చెడని శ్రీరాముడు స్థితప్రజ్ఞుడు. సంధ్యాసమయమున పూజించి అలంకరించిన బంగారు మురుగులు ఏమయ్యాయని ప్రశ్నిస్తే "ఉన్నవాడిస్తే లేనివాడు తీసుకొని వెళ్లాడని" నవ్విన భగవాన్ రమణ మహర్షి చేళ్లగుర్రికి ఎరిదాతలు, స్థితప్రజ్ఞులు. పాలను పెరుగును, నెయ్యిని అమ్మడానికి వెళ్ళి, కృష్ణా!గోవిందా! మాధవా! అని కేకలిడిన గోపికలు మహా భక్తులు. శ్రీకృష్ణుని ముఖార విందాన్ని చూస్తూ మైమరచి గుజ్జునివ్వక అరటి తొక్కలనిచ్చిన విదురుడు మహాభక్తుడు.

అధ్యాత్మిక శాస్త్రే యానితాన్యేవ సాధనాని ఉపదిశ్యంతే" భగవద్గీతా తత్త్వశాస్త్రమున ద్వితీయాధ్యాయమందలి స్థితప్రజ్ఞ లక్షణములు, భక్తి యోగమునందలి అద్వేష్టాది లక్షణములు, క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగమునందలి అమానిత్వాది గుణములు, షోడశోధ్యాయమునందలి అభయాది దైవగుణ సంపత్తి అదిగాగల కృతార్థుల లక్షణములను సాధించి ధన్యులగుదురు గాక, అను దయార్ద్ర దృష్టిచే శ్రీకృష్ణభగవానుడు సాధకుల ఉపయోగార్థము వివరించి యున్నాడు.

అపరకృష్ణార్జునులనదగిన ప్రాత స్మరణీయులు ఆళ్లగడ్డ శంకరానంద స్వాములు శ్రీ గండి రామకృష్ణానందస్వాములవారి గీతోపన్యాసములచే

ప్రభావితులై బ్రహ్మశ్రీ పాణ్యం రామనాథశాస్త్రిగారు "స్థితప్రజ్ఞుడు, భక్తుడు" అను ఈ గ్రంథమును సరళశైలిలో బహుసుందరముగ, సర్వజనామోదముగా రచించినారనుట, అతిశయోక్తి కాదు. రచనాశైలి ఆ మహాత్ముల పోకడలోనే సాగినది. గండిస్వాములవారి స్థితప్రజ్ఞ వైభవము, గీతోక్త భక్త లక్షణాలను మేళవించి ఒక శిల్పమును మలచినారు శాస్త్రిగారు,

పాఠకులీ గ్రంథమును పఠించి భక్తులై జ్ఞానమును పొంది స్థితప్రజ్ఞులై బ్రహ్మనిష్ఠను పొందుదురుగాక. ఇలాంటి ఆధ్యాత్మ గ్రంథములను ఇంకను అనేకములుగా పాఠకలోకమునకు అందింప శ్రీ శాస్త్రిగారికి ఆయురారోగ్యములను సద్గురు పరమాత్మ ప్రసాదించుగాక!

కార్తీక పౌర్ణమి
నయనాలప్ప క్షేత్రం
6-11-95

ఇతి శివమ్
శ్రీ గురు కరకమల సంజాతః
శ్రీ ప్రణవానందస్వామి



ఓం

# స్థితప్రజ్ఞుడు

భగవద్గీత సాంఖ్యయోగములో 54వ శ్లోకంనుంచి 72వ శ్లోకాల్లో అవతారమూర్తియైన కృష్ణభగవానుడు అర్జునునకు చేసినబోధ మొత్తము గీతకు తలమానికమువంటిది. యుద్ధసన్నద్ధుడై తనవారిని చంపనొల్లక వెనుకకు మరలుతానని విషణ్ణహృదయుడైన అర్జునుని ఉత్సాహపరచి జ్ఞానోదయం కావించే ప్రక్రియలో, స్వామి అర్జునునికి స్థితప్రజ్ఞ లక్షణాలు బోధించాడు. భగవద్గీత అనే కామధేనువుకు పార్థుడు వత్సము, మనమంతా భోక్తలము మానవజాతిని ముందిడుకొని పార్థుడు స్థితప్రజ్ఞుడెట్లుమాట్లాడుతాడు, సమాధి అంటే యేమి, స్థితప్రజ్ఞుడు ఎట్లా వ్యవహరిస్తాడు అని కృష్ణస్వామిని ప్రశ్నిసాడు.

ప్రతి ఒక్కరు స్థితప్రజ్ఞుడు కావాలి అనేదే గీతయొక్క ఆశయం. కనుక ఈ విషయాన్ని చక్కగా అవగతం చేసుకోవడం ప్రతిఒక్కరికి అవసరం.

'స్థితప్రజ్ఞుడు' అనే పదం గీత బోధించటానికి ముందు ఏ గ్రంథములో వుపయోగించి వుండలేదు. జ్ఞానమును గురించి ఉపనిషదాదులు చక్కగా వివరించినవి. కాని జ్ఞాని ఎట్లావుంటాడు అని, ఆతనిస్థితి ఎట్లాంటిది అని వర్ణించి యుండలేదు. స్థితప్రజ్ఞుని రూపొందించుటే గీతాచార్యుని ముఖ్యాశయము. పుస్తకజ్ఞానము మస్తక జ్ఞానంగామారి అది ఆచరణాత్మకంకావాలి. అప్పుడే జ్ఞానము సంపూర్ణత నొందుతుంది. జీవితంలో ప్రతి నిమిషము ప్రతి చర్యలో జ్ఞానము తొణికిసలాడాలి.

అర్జునుడు మహావీరుడు పశుపతితోపోరి పాశుపతాస్త్రాన్ని సంపాదించిన శూరుడు, కాని యుద్ధసన్నద్ధుడై రెండుసేనల మధ్యరథాన్ని నిలిపి, బంధువులు మిత్రులు గురువులు కనబడగా మమకారము కన్నులకు కప్పి అర్జునుడు ప్రజ్ఞావాదములాడెను. చంపేవాడు తానసే అహంకారము, చంపబడేవారు తనవారు అనే మమకారముతో మోహసమ్మూఢచేతస్కుడై ధర్మపన్నాలు

పలికాడు. ఇందరినిచంపి రక్తాన్నాన్ని భుజించుటకంటే భిక్షాన్నము మేలని భావించాడు. మూర్తీభవించిన జ్ఞానము కృష్ణుడు. అజ్ఞానాంధకారములోపడి విలపిస్తూ ధర్మప్రవచనాలు పలుకుతూన్న అర్జునుని మోహాన్ని నిర్మూలించి తనంతవాడిని గావించాలని కృతనిశ్చయుడై అర్జునునకు గీతను బోధించెను. మోహ నిద్రాపరవశుడైన అర్జునుని సందేహాలుతీర్చి గీతాసందేశముతో అతనికి జ్ఞానప్రకాశాన్ని పొందింపజేసెను. శ్రీకృష్ణుని జ్ఞాన శంఖారావంతో మేల్కొని "నష్టో మోహః స్మృతిర్లబ్ధా" అని స్వధర్మాచరణానికి సన్నద్ధుడయ్యాడు లోక గురుడు కృష్ణుడు. తన ప్రియశిష్యుని తనంతవాన్ని చేయగల్గినాడు. మానవుడు మాధవుడుగా, నరుడు నారాయణుడు అగుటే గీతాబోధయొక్క తాత్పర్యము.

అవిరియొక్క ఘనీభావము మంచుగడ్డ. మస్తకజ్ఞానం అవిరివంటిది. దానికి రూపములేదు. అవిరివలెనున్న మస్తకజ్ఞానము ఘనీభవించి స్థితప్రజ్ఞుడుగా రూపొందింది. మానవుని ఉదాత్తభావాలు ఎంతవరకు ఎగురగలవో అంతవరకు భగవద్గీత మానవుని తన రెక్కలపై తీసుకవెళ్ళింది. మానవుడు తన ఊహలను అనుసరించి పశువో, మానవుడో, పశుపతియో కాగలడు. గీత ద్విపాద పశువైన మానవున్ని మాధవునిగా మార్చగలిగింది. పరశువేది సంపర్కముచే లోహము బంగారమైనట్లు గీతాజ్ఞానము మానవుని దివ్యమానవునిగా రూపొందించింది. ఈ దివ్యమానవుడే స్థితప్రజ్ఞుడు. గీతాజ్ఞాన అభ్యాసం ఒక కళాశాలవంటిది. ఈ ఆధ్యాత్మిక కళాశాలలో విద్యనభ్యసించే మానవుడు స్థితప్రజ్ఞుడుగ పట్టభద్రుడవుతాడు సామాన్య మానవుడు కర్మలచే బంధింపబడుతాడు కాని స్థితప్రజ్ఞుని కర్మలు అతనికెట్టి బంధాలను కలిగించవు. అతని కర్మలు సామాన్య కర్మలుకావు. అవి అకర్మలు. అతనికర్మ కర్మకాదు. అది యోగము. అతను ఏ కర్మనైన చేయవచ్చు. ఎట్లాంటికర్మ చేసినాడు అనికాదు ప్రశ్న, కర్మను ఎట్లా చేసినాడని. కర్మ సహజకర్మ అయితే అది బంధించదు. ధర్మవ్యాధుడు హీనకర్మగా భావించబడే మాంస విక్రయాన్ని చేశాడు. తులాధారుడు తక్కెడబట్టి వ్యాపారము చేశాడు రైభ్యుడు సామాన్యమైన రైతుపని చేశాడు. అతనిదేహంపై పుండ్లు దుర్వాసన కొట్టుతూ పుండేవి. కాని వారుచేసిన కర్మలు ధర్మయుక్తమైనవి. ఫలాపేక్ష రహితమైనవి. కనుక వారు చేసిన కర్మలు అకర్మలై భాసించాయి. బంధాన్నిగాక ముక్తి నొసంగాయి. స్థితప్రజ్ఞుడైన కృష్ణభగవానుని ముందిడుకొని స్థితప్రజ్ఞ

డెట్లావుంటాడు? అతను ఎట్లా మాట్లాడుతాడు? ఎట్లా వ్యవహరిస్తాడు అని అర్జునుడు ప్రశ్నించుట ఒకింత హాస్యస్వరంగా వుండొచ్చు. కాని అర్జునుని ప్రశ్న తనదిమాత్రమేకాదు. మొత్తము మానవజాతి ప్రతినిధిగా ఆతను మాధ వున్ని ప్రశ్నిస్తున్నాడు. ఈ ప్రశ్న వేయకుండిన మనకు స్థితప్రజ్ఞు డెట్లాంటి వాడో తెలిసివుండేదికాదు. కనుక మనము మన ప్రతినిధియగు అర్జుననకు సదా కృతజ్ఞులమై వుండాలి.

శ్లో॥ స్థితప్రజ్ఞస్య కాభాషా సమాధిస్థస్య కేశవ।
స్థితధీః కిం ప్రభాషేత? కిమాసీత వ్రజేత కిమ్॥

కేశవా! ఈ స్థితప్రజ్ఞుడు ఎట్టి సమాధి నిష్ఠలో వుండును? లోకమునకు సంబంధము లేకుండ నిర్వికల్ప సమాధిలో నుండునా? లేక మనవలె వ్యవహరించునా? మనవలె తిని తిరుగుచుండునా లేక విలక్షణముగా నుండునా? ఏ యే లక్షణాలనుబట్టి మనము స్థితప్రజ్ఞుని గుర్తించగలము?

ఈ ప్రశ్నలో పార్థుడు స్వామిని 'కేశవా' అని సంబోధించినాడు. 'కేశవ' అనే పదము త్రిమూర్తి తత్వాన్ని విదితం చేస్తూంది. ఇది ఆ పదము యొక్క లాక్షణికార్థము. 'క' అనగా బ్రహ్మ, 'అ' అనగా విష్ణువు, 'ఈశ' అనగా మహేశ్వరుడు (క+అ+ఈశ) రజోగుణ ప్రభావముచే బ్రహ్మయై విశ్వాన్ని సృష్టించినాడు. సాత్వికగుణలక్షణుడై విశ్వాన్ని పోషించినాడు. తమోగుణ ప్రధానునిగా పరమేశ్వరుడై విశ్వాన్ని లయించినాడు. ఈ మూడు ప్రకృతులు పరమాత్ముని ముమ్మూర్తుల ప్రభావము పరమాత్మ ఒక్కడే. సృష్టికార్యాన్ని నిర్వహించేటపుడు బ్రహ్మగా, పోషించేటపుడు విష్ణువుగా, లయించేటపుడు ఈశ్వరునిగా పిలువబడుచున్నాడు. ఒకేవ్యక్తి భార్యకు భర్తగా, కుమారునికి తండ్రిగా, నౌకరుకు యజమానిగా వేరు వేరు పేర్లతో వ్యవహరించబడుతున్నా ఒకేవ్యక్తి అయినట్లు ముమ్మూర్తులుగా వివిధ వ్యాపారాలను చేస్తూన్నా పరమాత్మ ఒక్కడే. 'కేశవ' అనే పదము త్రిమూర్తిత్వానికి చిహ్నము. కేశవా! అన్నపుడు సృష్టి స్థితి లయములకు కారణుడగు ఓ పరమ పురుషా! అనే భావముతో అర్జునుడు సంబోధించినాడు.

ఈ శ్లోకములో సమాధి అనే పదము వివిధములైన వ్యాఖ్యానాలకు, సంశయాలకు గురి అయింది. ఈ విషయాన్ని గురించి యోచిద్దాం. 'సమాధి'

రేండు విధాలు. ఒకటి 'జ్ఞాన సమాధి', రెండవది 'ధ్యానసమాధి'. ధ్యాన సమాధిలో నున్నపుడు సాధకుడు బహిః ప్రజ్ఞారహితుడై వుంటాడు. అతను కదలడు, మెదలడు, మాటలాడడు. ధ్యానము ముగించినంతనే అతను మాట లాడును. కనుక ఈ శ్లోకములో సమాధి ధ్యానసమాధికాదు. కొందరు అర్జునుని ప్రశ్నను "సమాధి తరువాత సాధకుడు ఎట్లుండును, ఎటుల మాట్లా డును" అని అన్వయము చేస్తున్నారు. కాని అర్జునుని ప్రశ్న అదికాదు. ధ్యాన సమాధిలో చిత్తవృత్తులు నిరోధించబడినాయి. ఎంతవరకు ఈ నిరోధ ముండునో అంతవరకు సాధకుడు బహిఃప్రజ్ఞ లేకుండును. కాని అర్జునుని ప్రశ్న జ్ఞాన సమాధిని గురించి. జ్ఞానసమాధి సహజస్థితి. అది సాధకునిలో అన్ని వేళల నెలకొని యుండును. ఈ అధ్యాయము చివరి శ్లోకములో "ఏషా బ్రాహ్మీ స్థితిః" అని చెప్పబడిందేకాని "బ్రహ్మీ వృత్తి" అని చెప్పబడలేదు. హఠయోగముచే మరేవిధమైన యోగముచేగాని పొందిన సమాధి ప్రాణమును నిరోధించినంతవరకు మాత్రమే వుంటుంది. కాని అర్జునుని ప్రశ్న సహజంగా జ్ఞాన సమాధిని సాధించినవ్యక్తి జీవితంలో ప్రతి నిమిషము ఎట్లావుంటాడు అని. ఇందుకు నిదర్శనము ఛాంగదేవ జ్ఞానదేవుల జీవితములోని ఉదంతం. ఛాంగదేవుడు హఠయోగంచేత 1400 సంవత్సరాలు జీవించెను. జ్ఞానదేవుని సందర్శించాలని చాంగదేవుడు తలచాడు. తన రాకను తెలియ జేయుటకై ఒక పత్రమును పంపాలనుకున్నాడు. జ్ఞానదేవుడు తనకన్న వయసులో చిన్నవాడు. కనుక అతన్ని ఆశీర్వదిస్తూవ్రాయాలా అనే సందేహం కలిగింది. కాని అతడు జ్ఞానంలో తనకన్న మిన్న కాబట్టి నమస్కారాలు తెలుపుతూ జాబు ప్రారంభించాలా అని సందేహంతో ఏమీ వ్రాయక ఖాళీ తాళపత్రాన్ని జ్ఞానదేవునకు పంపాడు. జ్ఞానదేవుడు అతని అన్న నివృత్తి నాధుడు, చెల్లి ముక్తాబాయి వేదాంతచర్చగావిస్తూండే సమయంలో చాంగదేవుడు పంపిన తాళపత్రం అందింది. జ్ఞానదేవుడు దాన్ని చూచి చెల్లెలు ముక్తాబాయికి అందించాడు. దాన్ని చూచి ముక్తాబాయి "చాంగదేవుని హృదయము శూన్యము" అని వ్యాఖ్యానించింది. నివృత్తినాధుడుచూచి ఈతని హృదయము స్వచ్ఛ మయింది, ఉపదేశార్హమైనది అని వ్యాఖ్యానించాడు. ఎంత సాధించినా, ఎన్ని సంవత్సరాలు జీవించినా ధ్యానసమాధిలోనున్న వ్యక్తి వాసనలనుండి విము క్తుడు కాలేకపోయినాడు. కనుక ఈ శ్లోకములోని 'సమాధి' జ్ఞానసమాధిగా

గు_ర్తించాలి. ఇది వృత్తిసమాధికాదు. ఇక రాబోయే నాల్గు శ్లోకాలు స్థితప్రజ్ఞుని లక్షణాలను వర్ణిస్తాయి.

శ్లో॥ ప్రజహాతి యదాకామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।
ఆత్మన్యే వాత్మనాతుష్టః స్థితప్రజ్ఞ స్తదోచ్యతే ॥ 55

దండాన్వయము :—

1. యదా సర్వాగతాన్ కామాన్ ప్రజహాతి
2. ఆత్మనా ఆత్మన్యేవ తుష్టః
3. తదా స్థితప్రజ్ఞ ఉచ్యతే

తాత్పర్యము:- ఎవడు మనసునందు సమస్తములైన కామనలను బాగా (పూర్తిగా) నిర్మూలించునో, ఎవడు అట్టి స్థితిలో ఆత్మానందమును సహజస్థితి యందుండి అనుభవించునో, ఆతను స్థితప్రజ్ఞుడు అని అనవచ్చును.

ఇచ్చట సర్వాన్ కామాన్ ప్రజహాతి, అని ప్రజహాతి అనేపదం ఉపయోగించ బడింది. జహాతి అంటే త్యజించుట, ప్రజహాతి అంటే సంపూర్తిగ సమూలంగా నిర్మూలించుట అని అర్థము. ముండ్లకంపను పైపైన కొట్టివేస్తే, తాత్కాలికంగా కంప వుండదు. కాని మరికొన్నాళ్ళకు అది మరల చిగురించవచ్చును. "ప్రజహాతి" అనగా సమూలంగా, వేళ్ళతోకూడ పీకిపారేయుట. అప్పుడు ఆ ముండ్లకంప మరల చిగురించదు. కనుక కామనలను సమూలంగా నిర్మూలించినవాడు స్థితప్రజ్ఞుడు. గింజలను వేయించిన అవి మరల మొలకెత్తవు. కనుక మనసులోనున్న సమస్తములైన కామనలను నిశ్శేషము సమూలంగా నిర్మూలించినవాడు స్థితప్రజ్ఞుడు. ఇది స్థితప్రజ్ఞుని మొదటి లక్షణము.

రెండవలక్షణము: "ఆత్మన్యేవ ఆత్మనా తుష్టః" తనలో తానే సంతోషంతో నుండువాడు.

సాధకుడు రెండువిధములైన సాధనలు చేయాలి. మొదటిది విధ్వంసన క్రియ, రెండవది విధాయక క్రియ. రైతు పొలంలో ముందుగా సేద్యంచేసి పొలములో యుండే గడ్డి గాద కలుపు నిర్మూలనంచేసి క్షేత్రాన్ని బాగుగా చదునుచేసి వుంచుతాడు. ఈ క్రియకు విధ్వంసన క్రియ అని పేరు. తదుపరి క్షేత్రమందు విత్తనము వేయును, ఈ విత్తనములనుకూడ బాగా పరీక్షించి

మంచి విత్తనములను శుద్ధిచేసి విత్తనము వేయును. ఇది విధాయక క్రియ. ఈ రెండు క్రియలు సక్రమంగా జరిగినపుడే సత్ఫలము లభిస్తుంది. అట్లాగే ఆధ్యాత్మిక సాధనలో ముందుగా వుండకూడని కలుపు మొక్కలవంటి కామనలను సమూలంగా నశింపచేయాలి. హృదయము అనే క్షేత్రము పరిశుద్ధంగా వుండాలి. సాధనకు అభ్యంతరం కలిగించే యెట్టి కామనలు వుండరాదు. ఈ విషయాన్ని వినోభాజీ ఒక దృష్టితో వివరించాడు. గుడ్డ దారాలతో చేయబడింది. మనసుకూడ కామనలతో నిండివుంది. గుడ్డలోపల దారాలన్నీ తీసివేస్తే గుడ్డలేదు. ఇదే మనోలయము. ఇట్లాంటి మనసులో ఆత్మ ప్రతిబింబిస్తుంది. ఆత్మ దర్శనమవుతుంది. ఆత్మ దర్శనంతో సాధకుడు ఆత్మానందాన్ని పొందును. ఇది వర్ణనాతీతము. 'ఆత్మన్యేవాత్మనాతుష్టః' అనే విధాయక క్రియ. స్థితప్రజ్ఞుని ఆనందము బైటినుండి చేకూరేదికాదు. అది లోపలనుండి వూరేది. బాహ్యమైన విషయానందానికి ఎన్నో సహాయ సామగ్రులు కావాలి. కాని ఆత్మానందానికి ఒక శుద్ధమైన బుద్ధిచాలు. (బుద్ధి గ్రాహ్యం అతీంద్రియం, గీత 6 అ. 21వ శ్లో).

కోరికలే లేకుండా జీవించేదెట్లా అని సందేహము. ముందుగ మంచి కోరికలతో చెడ్డ కోరికలను మనసులో లేకుండ చేయాలి. కాలిలో ముల్లు గుచ్చుకుంది. అక్కడ కంపచెట్టులోని పెద్దముల్లు తీసికొని దాని సహాయముతో గుచ్చుకున్న ముల్లును తీసివేస్తాము. ఏ కోరికలైన ముల్లువంటివే. కాని మంచికోరికలు అనే ముల్లుతో చెడ్డకోరికలు అనే బాధాకరమైన కోర్కెలను మనసునుండి తీసిపారేయాలి. మంచికోర్కెలు అంటే ధర్మానికి విరుద్ధం కాని కోర్కెలు. కొంతకాలమైన తరువాత కాలిలో ఇరుక్కొనిన ముల్లును తీసి పారవేయునట్లు తోడ్పడిన ముల్లును పారవేస్తాము కదా? అట్లాగే మంచికోర్కెలతో చెడ్డకోర్కెలను నిర్మూలించి మంచికోర్కెలనుకూడ మనసులో నుండి లాగిపారవేయాలి. మోక్షకాంక్షకూడ కోర్కెయే. ఆ కాంక్షకూడ ఉండరాదు. అట్లాగే కోర్కెలన్నింటిని నిర్మూలించిన మనసు బుద్ధివికాసాన్ని పొందుతుంది. అపుడు సాధకుడు తనలోతానే ఆనందాన్ని పొందుతూ ఆత్మారాముడై వుంటాడు.

మనసులోనున్న మాలిన్యము సంపూర్ణంగా క్షాళనముకాగా సాధకునకు స్వస్వరూప అనుసంధానము కల్గును. స్వచ్ఛమగు తటాకంలో ప్రకృతి

స్వచ్ఛంగా ప్రతిఫలించినట్లు మల విక్షేపరహితమైన, ప్రశాంతమైన మనసులో బుద్ధి ప్రకాశములో ఆత్మ సాక్షాత్కారమగును. ఇది ఎట్లావుంటుందో కొంత వూహిద్దాము. ఒక దరిద్రుడు తానెవరో తెలియక భిక్షచేస్తూ తిరుగుతూ వుంటాడు. తాను ఒక మహారాజు కొడుకునని తెలుస్తుంది. అపుడు అతను ప్రయత్నముచేసి తన రాజ్యాన్ని చేరి తాను రాజని గుర్తింపబడినపుడు అతను పొందే మనస్థితి ఆత్మానందమని భావించవచ్చును. ఇటువంటి ఆత్మానందాన్ని స్థితప్రజ్ఞుడు అనుభవిస్తుంటాడు.

ఎటువంటి కోరికలు, ఉద్దేశాలులేని అతని కర్మలు సహజకర్మలుగా రాణిస్తాయి. కర్మఫలము అతన్ని అంటదు. శ్రీకృష్ణుడు ఆవుల గాచెను, వెన్న దొంగిలించెను, గోపికల వస్త్రములను అపహరించెను, కంసుని చంపెను. కాని ఆ కర్మఫల మాతనిని అంటలేదు. అతను ఎప్పుడు చిదానంద స్వరూపుడే. భ్రాంతి, భ్రమ, అవిద్య, అజ్ఞానము పోయిన తరువాత మిగిలింది ఆనందమే గదా! ఆనందము ఎక్కడనున్నది? అనుభవించు భోగ్యవస్తువులలో నున్నదా? లేదు, అది తనలోనే వున్నది. ఆనందము, తుష్టి, తృప్తి బయటలేవు. అంతరంగములో వున్నాయి. బయటినుండి చేకూరేదికాదు. లోపలినుండే వూరేది. ఒక పండు తియ్యనిది. ఆనందము దానిలో లేదు. తినేవాడు ఆనందాన్ని దానిలో ఆరోపించి ఆనందిస్తాడు. ఆనందము బాహ్యవిషయాల్లో వుందని దాని కొరకు పరుగెత్తుచుందుము. సినిమాలకు కాఫీ హోటల్లకు నర్తనశాలకు పరుగులు తీయుదుము. కాని ఆనందము మనలోనే వున్నదని తెలియక పిచ్చిగా తిరుగుతూ వుంటాము. తన నాభిలోనే కస్తూరిని పెట్టుకొని కస్తూరి మృగము అడవినంత తిరుగుతుంది. పరిమళము తనలోనే వుందని తెలుసుకొని శాంతినొందుతుంది. అటులనే స్థితప్రజ్ఞుడు తనలోనే తుష్టి కలదని ఆనందముతోవుంటాడు. ఆనందసముద్రుడని తెలుసుకొని స్థితప్రజ్ఞుడు పరమ శాంతుడై ఆనందముతో వుంటాడు.

శ్లో॥ దుఃఖేష్వను ద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగ భయక్రోధః స్థితధీ ర్మని రుచ్యతే ॥ 56

ఇక స్థితప్రజ్ఞుని మూడవలక్షణము : దుఃఖాన్ని కల్గించే సంఘటనలో చిత్తక్షోభను పొందడు. సుఖము సంప్రాప్తించినపుడు ఉప్పొంగడు.

నాల్గవ లక్షణము : రాగ, భయ, క్రోధములు లేనివాడు.

స్థితప్రజ్ఞుడు ద్వంద్వరహితుడు. రాగము, భయము, క్రోధమునకు అతీతుడు.

సంసార సాగరములో సుఖదుఃఖములు అనే తరంగాలు ఏ న గు ప్రమాణము లేస్తూ పడుతూ వుంటాయి. ఒకడు స్నానానికని సముద్రము దగ్గరకు వెళ్లాడు. అలలు తగ్గిన తరువాత స్నానం చేస్తాననుకున్నాడుట! ఇదిసాధ్యమా? మహోన్నతమగు అలలున్నను ఉపాయంతో స్నానంచేయాలి. కనుక జీవితంలో సుఖదుఃఖాలు జయాపజయాలు మానావమానాలు రాక తప్పవు. వాటిని వివేకంతో ఉపాయంతో ఎదుర్కోవాలి. ఇదియే జ్ఞానము పొందుటవలన కలిగెడి ఫలితము. స్థితప్రజ్ఞుడు జ్ఞానాభిమాని. జ్ఞానాన్ని జీర్ణించుకున్నవాడు. సముద్రము మధ్యనుండే కొండ అలలతో నిరంతరము దెబ్బలు తింటున్నా అది కదలదు, మెదలదు. అట్లాగే స్థితప్రజ్ఞుడు నిరంతరము సంసారములోని తాకిడులు తింటున్నా ఇసుమంతైనా చలించని ధీరుడు. సుఖాలను ఆహ్వానించడు, దుఃఖాలను పొమ్మనడు. ఎండలో నడచి వృక్ష చ్ఛాయలో సేదదీరి అక్కడ కనబడుచున్న ఎండమావులు నీరని భ్రమిస్తాడు అజ్ఞాని. కాని జ్ఞానఖనియైన స్థితప్రజ్ఞుడు సేదతీర్చుకొనేందుకు ఎండమావుల వంటి తాత్కాలిక సుఖాలనుచూచి భ్రమించడు. కారణమేమన ఇంతకు పూర్వము ఎన్నో చేదు అనుభవాలను రుచిచూచినాడు. ఒకప్పుడు వాటిచే ఖిన్నుడై విషయభోగాలను ఆశ్రయించినాడు. అవి తాత్కాలికములని తెలిసి కున్నాడు. విషయవాసనలు సత్యములు, నిత్యములని భావిస్తున్నంతకాలము వాటి ఆకర్షణలకు లోనవుతాము. కాని అవి అసత్యము, అనిత్యములని తెలిసిన ఇక వాటిజోలికిపోము. కనుక అనుభవజ్ఞానము కలిగిన స్థితప్రజ్ఞుడు వీనిని ఆగమాపాయికులని, అనిత్యాలని భావించి వాటిని దరిజేరనివ్వడు. సుఖ దుఃఖాలు వస్తూంటాయి, పోతూవుంటాయి. కనుక వానిని సాక్షిరూపంగా చూస్తూంటాడు. సుఖదుఃఖాలు పూర్వకర్మవశమున సంప్రాప్తమవుతాయి. వానిని అనుభవించక తప్పదు. అనుభవించక తప్పని సుఖదుఃఖాలను సంతోషంగా అనుభవిస్తే కర్మఋణము తీరుటేగాక కొత్తకర్మ లభించదు. అనుభ వించేది ఉపాధి, తాను ఆత్మవిలక్షణుడు. కనుక సాక్షిగాచూస్తూ ఖిన్నత నొందక తటస్థుడై వుంటాడు జ్ఞానియైన స్థితప్రజ్ఞుడు. "రాకన్ మానవు

హానివృద్ధులు మహారణ్యంబులో దాగినన్" అంటుంది భాగవతము. కష్టాలు జీవితంలో ఒరిపిడిరాళ్ళవంటివి. బంగారుపనిచేయువాడు బంగారుగొలుసును ఒక విలువలేని రాయిపై రుద్దినపుడు అదినిజమైన బంగారని తెలిసికొంటాము. కష్టాలు మానవునిలోని ఆత్మతత్వాన్ని అంటివున్న మలినాన్ని నిర్మూలనం చేస్తాయి. ఆత్మ నిర్మలమై వెలుస్తుంది.

సుఖదుఃఖాలు ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతికాలని మూడు విధాలు,

ఆధ్యాత్మికసుఖము;- నేను పండితుడను, నేను శాస్త్రజ్ఞుడను అనుకొను వాడు తాను గౌరవింపబడినపుడు పొందు ఆనందము.

అధ్యాత్మిక దుఃఖము;- తనకన్న మరొకడు తక్కువ తెలివిగలవాడు సన్మానింపబడునపుడు కలుగుఅవేదన.

ఆధిదైవిక సుఖము!-- చల్లనిగాలి, సకాలవర్షము, అగ్నినుండి సంరక్షింపబడుట, నదీస్నానము మొదలైనవి.

ఆధిదైవిక దుఃఖము - పిడుగుపడుట, భూకంపము, అతివృష్టి, అగ్ని భయము, మొదలైనవి ఆధిదైవిక దుఃఖములు.

ఆధిభౌతిక సుఖము:- ధనము, కుటుంబ సౌఖ్యము, అనుకూలవతియైన భార్య, పుత్రుడు, స్నేహితుడు మొదలైనవి కలిగియుండుట.

ఆధిభౌతిక దుఃఖము - ధననష్టము, కుటుంబ వియోగము, రోగములు, మొదలైనవి పొందుట.

ఈ విధములైన ఎన్ని సుఖాలు, దుఃఖాలు కల్గినా తటస్థభావంతో వుండగలుగుట స్థితప్రజ్ఞుని లక్షణము. దుఃఖములు మానవునకు ఎంతో మేలుచేకూర్చును. దుఃఖములు మానవుని హృదయమును క్షాళనము గావించును. అనుకంప, దయ, కరుణ మున్నగుసద్గుణాలను పెంపొందించును. శ్రీరాములవారికి అరణ్యవాసము, భార్యావియోగము కలుగకుండిన ఆతనిలోని సద్గుణములు వెలికివచ్చేవికావు. భర్తృవియోగము కలుగకుండిన సీతా సావిత్రి మహాపతివ్రతలై రాణించి వుండేవారుకారు. అవమానము కల్గకుండిన ధ్రువ కుమారుడు తారాపథాన్ని పొందివుండేవాడుకాడు. దుఃఖ పరంపరలు, కాయ

క్లేశములు ప్రహ్లాదుని భక్తావతంసునిగా తీర్చిదిద్దగల్గినవి. దుఃఖము మానవునకు అతి హితుడైన మిత్రుడు. సుఖమనే స్నేహితుడు మనలోని లోపాలను కప్పిపుచ్చును. దుఃఖమనే మిత్రుడు మనలోనిలోపాలను కప్పిపుచ్చక మనలోని బలహీనతలను పైకితెచ్చి మనలను సన్మార్గవర్తనులుగ జేస్తాడు. కుమారులు అరణ్యాల్లో అధికమైన దుఃఖాలకుపాలై రాజ్యభ్రష్టులైన తరుణాన శ్రీకృష్ణుడు కుంతీదేవిని వరము కోరుకొనుమనగా "స్వామీ నాకు ఎప్పుడు దుఃఖాలనే యిమ్ము, దుఃఖాలుంటే నిన్ను సదా స్మరిస్తుంటాను" అని కోరెను. భక్త కుచేలుడు కృష్ణ సందర్శనంచేసి, రిక్తహస్తుడై వస్తూ ఇట్లా అనుకుంటాడు. "దరిద్రుడు సంపదంధుడై తన్ను మరచునేమో యని తనకు శ్రీకృష్ణుడు సంపదల నివ్వలేదు. (దరిద్రుడు సంపదంధుడై కానక తన్ను చేరడని) లేకుంటే సత్కృపాంభోనిధి సర్వవస్తుపరిపూర్ణునిగా నను చేయకుండునే" అని కృష్ణుని ప్రశంసించెను. "Sweets are the uses of adversity" అని షేక్స్పియర్ మహాకవి కష్టములను, అననుకూలతలను కీర్తించెను. కనుక జ్ఞానియైన స్థితప్రజ్ఞుడు దుఃఖాలను గురువులుగా గుర్తించెను. సుఖాలు తాత్కాలికములని, వానియెడ జుగుప్సా భావంతో మసలును. సుఖదుఃఖ సముడు. సుఖమువస్తే పొంగడు, దుఃఖమువస్తే క్రుంగడు.

ఇక స్థితప్రజ్ఞుని నాల్గవలక్షణమును గురించి ఆలోచిద్దాము. స్థితప్రజ్ఞుడు వీతరాగభయక్రోధుడు.

రాగము అనగా ప్రీతి, అనురాగము. తనకన్న ఇతరత్రా ఏ విషయమందైన కలుగు మమతను 'రా గ ము' లేక ప్రీతిఅనవచ్చును. ఇతర వస్తువులు తనలో కలిగించెడి ఆకర్షణమునుకూడ 'రాగము' అనవచ్చును. 'భయము' అనగా ఈ ప్రియమైన విషయము పొందలేమేమో లేదా పొందిన ప్రియమైన విషయము తన్ను వదలిపోవునేమో అనెడి 'దుగ్ధ' లేక మనోభావము 'భయము'గా నిర్వచించవచ్చును. ఈ ప్రీతిపాత్రమైన వస్తువును తననుండి ఇతరుడు బలవంతముగా తీసికొనిపోయినపుడో, లేదా తనకులేకుండా జేసినపుడో ఆ వ్యక్తిపై కలిగే మనోభావము 'క్రోధము' అని చెప్పవచ్చును. రాగ భయ క్రోధములు విడివడని త్రికము. భయక్రోధములకు మూలము రాగము. రాగమునకు కారణము 'నాది, నీది' అనే ద్వైతభావము. ఈ ద్వైతభావానికి కారణము అజ్ఞానము. నేను, నీవు అనే భేదభావము వున్నంత

వరకు రాగ భయ క్రోధాలు తప్పక వుంటాయి. అన్నిటికన్నా ప్రాణము తీపి అంటారు. మరణము అన్నిటికన్న భయంకరమైంది అని పలువురు భావిస్తారు. కనుక మరణాన్నిపొందజేసే మృత్యుదేవతను సామాన్యులంతా భయంతో, క్రోధభావంతో చూస్తారు. కాని శరీరము నేనుకాదు, శరీరము నా ఉపాధి మాత్రమే అని శరీరము తాత్కాలికంగా జీవునికి ఆశ్రయమిచ్చే ఒక బాడుగ యిల్లు అని భావించే వారికి మరణభయం ఉండదు. ఈ శరీరము అనిత్యము. దేహికి ఒక అచ్ఛాదనంగా ఉపయోగించే అంగీవంటిది. జీర్ణవస్త్రాన్ని తీసిపారవేస్తే దుఃఖము ఎందుకు కల్గుతుంది ? పాతయింటినివదలి కొత్తయింటికివస్తే సంతోషిస్తాముకాని దుఃఖించముకదా? అని భావిస్తే మరణముపై క్రోధము బదులు, మైత్రి ఏర్పడుతుంది. ఆంగ్ల రచయిత ఆర్. ఎల్ స్టీవెన్‌సన్ ఒక కథను ముగిస్తూ అఖరు ఘట్టంలో కథను ఈ విధంగా ముగిస్తాడు. "ఆతడు డాబాపై విశ్రమిస్తూ వుంటాడు. మృత్యుదేవత ఒక మానవరూపంగావచ్చి 'నీకొరకు వచ్చినాను, రా పోదాం' అంటుంది. వచ్చిన మృత్యుదేవతతో కరచాలనంచేస్తూ కొంచెము కూర్చోండి, చాలా దూరమునుండి వచ్చినారు, కొద్దిగా ద్రాక్షారసం సేవించండి పోదాము, ఎందుకింత ఆతురత, నేను సంతోషంగా వస్తానన్నాకదా?" అన్నాడట. జ్ఞానికి మృత్యుదేవత మిత్రునివంటివాడు. 'అభయం' అనేది అతని లక్షణము. తనయందు, అఖిల భూతముల యందు సమభావముతో మెలిగే వ్యక్తికి అందరు ఆత్మీయులే ! అతనికి భయమెక్కడిది ? అన్నిటిలో తనను, తనలో అన్నిటిని చూసే సమభావనులకు ప్రియములేదు, అప్రియములేదు. మిత్రులులేరు శత్రువులులేరు, అందరు ఆత్మీయులే, సర్వము బ్రహ్మస్వరూపమే. అట్టి మానవోత్తముని జ్ఞానము పరమాత్మయందు సుప్రతిష్ఠితమైనది. అట్టి జ్ఞానియే స్థితప్రజ్ఞుడు.

శ్లో॥ యః సర్వత్రా నభిస్నేహః తత్తత్ప్రాప్య శుభాశుభం ।
నాభినందతి నద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 57

దండాన్వయము:—

యః సర్వత్ర అనభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభం ।
నాభి నందతి నద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

తాత్పర్యము:- ఎవ్వరు సర్వులయందు అనాసక్తభావం కల్గియుండురో

ప్రారబ్ధవశమున శుభములువచ్చిన పొంగక, అశుభములు ప్రాప్తించిన క్రుంగక నిర్లిప్తతతో నుందురో వారి బుద్ధి (ప్రజ్ఞ) సుప్రతిష్ఠితమై ప్రకాశించుచున్నది.

ఈ శ్లోకములో స్థితప్రజ్ఞుని మరికొన్ని లక్షణములు శ్రీకృష్ణపరమాత్మ వివరించాడు.

(ఎ) భూతములయందు అనాసక్తభావము కలిగియుండుట,

(బి) కర్మవశంచేత సంప్రాప్తించు శుభాశుభములయెడ నిర్లిప్తత కలిగి యుండుట.

భక్తప్రహ్లాదుడు "తనయందు, నఖిలభూతములందు నొకభంగి సమహితత్త్వంబును" కలిగియుండెడివాడని భాగవతము ప్రస్తావించినది. ఇదియే "సర్వభూతానాం మైత్రిః" భగవంతుడు సర్వవ్యాపి. ఇందుగలడు అందులేడని సందేహములేదు సర్వోపగతుడు. తనయందు, అఖిలభూతాల్లోను వెలసి యున్నాడు. కనుక సర్వభూతములు తన సోదరులే, ఆత్మీయులే అనేభావముతో స్థితప్రజ్ఞుడు సర్వభూత హితుడై ప్రవర్తిస్తాడు. ఇది భక్తునిభావము. "ఈశావాశ్య మిదంసర్వం యత్కించిత్" అనేసర్వాత్మభావంతో జ్ఞాని విశ్వాన్ని పరికిస్తాడు. ఈశ్వరుడు సర్వభూతములలో, హృదయాలలో ప్రేమ రూపంగా ప్రకాశిస్తూన్నాడు. కనుక సాధకోత్తముడు సర్వత్ర సమబుద్ధితో వ్యవహరిస్తాడు.

ఇక మరొకలక్షణము: శుభాశుభములయెడ నిర్లిప్తత, సుఖదుఃఖములు. శుభాశుభాలు అన్నీ పూర్వజన్మలో చేసిన కర్మఫలాలు. వాటిని గురించి అంతగా పట్టించుకొనే అవసరంలేదు వస్తూవుంటాయి, పోతూవుంటాయి. శుభమువస్తే పొంగడు, అశుభంవస్తే క్రుంగడు. అన్ని సంఘటనలను సాక్షి రూపంగా చూస్తూవుంటాడు. అశుభం ప్రాప్తించినపుడు అవి పొందజేసిన వారియెడ ద్వేషముతో వ్యవహరించడు మంచి చేసినా వారిని శ్లాఘించడు. చైనా దేశములో ఒక తాత్త్వికవేత్త వుండేవాడు. అతను అన్నివిషయాల్లో నిర్లిప్తతతో ప్రవర్తించేవాడు. ఒకనాడు ఒక వ్యక్తివచ్చి "అయ్యా! మీ గుఱ్ఱము తప్పించుక పోయింది" అని వార్త చెప్పాడు, 'మంచిది' అన్నాడు. మరునాడు అదేవ్యక్తివచ్చి "స్వామి మీ గుఱ్ఱము మరొక గుఱ్ఱాన్ని తోడు జేసుకొని వచ్చింది" అని చెప్పాడు, 'మంచిది' అన్నాడు. అతను మరొక నాడు "స్వామీ! మీ కుమారుడు గుఱ్ఱముమీదనుండి క్రిందపడినాడు, చేయి

విరిగింది" అని కబురు చెప్పినాడు. 'మంచిది' అన్నాడు తత్వవేత్త. ఇంకొక దినం ఒకడువచ్చి "అయ్యా! మీ కుమారున్ని సైన్యములో చేర్పించినారు అన్నాడు, 'మంచిది' అనే సమాధానం. కొన్ని దినాల తరువాత మరొక్కడు వచ్చి "అయ్యా! మీ కుమారుని చెయ్యి విరిగినందున సైన్యంలో చేర్చుకోక వాపసు పంపినారు" అని వార్త తెచ్చినాడు. 'మంచిది' అనే సమాధానం. 'అన్నీ మన మంచికొరకే' అన్నదే నిజమైన తత్త్వవేత్తభావం. జీవితంలో సంభవించే ప్రతి సంఘటన మన మంచికొరకే అనే భావంతో స్థితప్రజ్ఞుడు జీవితంలోని ప్రతి అంశాన్ని భావిస్తాడు. ఈశ్వర సంకల్పములో అన్నీ మన ప్రగతికొరకే జరుగుతూంటాయి. ఈశ్వర సంకల్పాన్ని పరిశీలించిన జ్ఞాని క్రుంగడు, పొంగడు. ఎప్పుడూ సమబుద్ధితో వ్యవహరిస్తూంటాడు. జాతిపితయైన గాంధీమహాత్ముడు తన్నుశృంఖలాబద్ధున్నిచేసి కారాగారంలో నుంచిన బ్రిటిష్ ప్రభుత్వాన్ని ద్వేషించలేదు. "నాకు బ్రిటిష్ ప్రజలపై ఎట్టి ద్వేష భావము లేదు. నేను వారిలో సహించనిది బ్రిటిష్ స్వార్థపరత్వం" అన్నాడు. గాంధీజీకన్న ప్రత్యక్ష స్థితప్రజ్ఞుడు ఈకాలంలో మరెవ్వరు కలరు? సర్వత్ర సమదర్శనము హృదయములో ప్రతిష్ఠించబడినపుడు గడియారములోని పెండులమువలె మనసు ఇటు నటు చలించదు. దేవాలయంలోని ఉత్సవమూర్తి ఒకప్పుడు రథము నెక్కును. మరొకప్పుడు రథము దిగును. కాని మూల విరాట్టు ఎపుడు నిశ్చలంగా గర్భగుడిలో వుండును. ఈ అభేద జ్ఞానమే సామాన్య మానవుని స్థితప్రజ్ఞునిగాచేస్తుంది.

ఇంతవరకు రెండు శ్లోకాల్లోతెలిపిన లక్షణాలు స్వసంవేద్య లక్షణాలు. ఈ గుణాలు కేవలము స్థితప్రజ్ఞునికి మాత్రమే తెలియును. కాని ఇతరులకు తెలియబడే లక్షణాలు పరసంవేద్య లక్షణాలు. 58వ శ్లోకంలో ఉదహరించ బడినాయి.

శ్లో॥ యదా సంహరతే చాయం కూర్మోంగానీవ సర్వశః ।
ఇంద్రియా ణీంద్రియార్థేభ్యః తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥

దండాన్వయము:- యదా కూర్మః సర్వశః అంగాని సంహరతే తదా (స్థితప్రజ్ఞః) ఇంద్రియాణి ఇంద్రియార్థేభ్యః (సంహరతి) తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా.

తాత్పర్యము:- తాబేలు అవసరమైనపుడు తన అంగాలన్నిటినీ చాపి

నీళ్ళలో తిరుగుతుంది. అవసరం లేనపుడు అంగాలను తనలోనికి ముడుచుకొను నట్లు స్థితప్రజ్ఞుడు తన ఇంద్రియాలను విషయసుఖములనుండి మరలించును.

జలచరమగు తాబేలు నీటిలో చరించునపుడు తన అంగాలన్నిటినీ బహిర్గతంచేసి సంచరించును. కాని అపాయం సంభవించినపుడు ఇంద్రియాలను తక్షణం ఉపసంహరించుకొనును. కూర్మమునకు ఇంద్రియాలు స్వాధీనములై యుండునట్లు మానవుడుకూడ ఇంద్రియాలను తన స్వాధీనములో ఉంచుకోవాలి. ఇంద్రియాలను స్వాధీనం చేసుకోలేని అసమర్థుడైన మానవుడు జలచరముకంటే హీనుడు. తనలో సర్వశక్తిమయుడైన భగవంతుడున్నాడని నిశ్చయబుద్ధిగలవాడు తన ఇంద్రియాలను తప్పక స్వాధీనంలో వుంచుకోగలడు. ఇట్టి ఉపమానంతో గీతాచార్యుడు మానవునకు ప్రబోధం కలిగిస్తున్నాడు.

ఇంద్రియాలను యథేచ్ఛగా వదలిపెట్టిన సామాన్య మానవుడు విషయాలకు దాసుడవుతాడు. మానవుడు ఇంద్రజిత్తు కారాదు. లక్ష్మణునివలె ఇంద్రియజిత్తు కావాలి. తపస్సుచేసిన మహర్షులు తమ తపోబలంతో ఇంద్రియాలను నియమించగల్గిరి. ఇంద్రియములు మానవునికి భగవద్దత్తమైన శక్తివంతములైన సాధనాలు. వాటిని విచ్చలవిడిగా వదలిన లేదా బలవంతముగ నిరోధించటం కూడ మంచిదికాదు. "అతి సర్వత్ర వర్జయేత్" ఇంద్రియ దమనముకాదు కావలసినది. కావలసినది ఇంద్రియ సంయమము. ఇంద్రియములను ఇంద్రియార్థములపై స్వేచ్ఛగా ప్రవర్తింపచేయరాదు. ధర్మయుక్తంగా దేహపోషణకు, సంసారపోషణకు ఎంతవరకు అవసరమో అంతవరకు వాటికి స్వేచ్ఛ యివ్వవలసినదే. హితము మితము అనే కళ్లెంతో వాటిని నిగ్రహించాలి. తన ప్రగతికి ఇంద్రియములు ఎంతవరకు అవసరమో వివేకంతో తెలిసికొని ఇంద్రియములను ఉపయోగించాలి. ఈ రహస్యాన్ని తెలిసికొనిన సాధకుడు స్థితప్రజ్ఞుడై, ఇంద్రియ సంయమము గావించి సంసారంలో ప్రవర్తిస్తాడు. వాహనం నడిపే డ్రైవరు ఎపుడు తన చేతిని బ్రేకులపైనే పెట్టి వుంటాడు. అవసరమైన తక్షణం బ్రేకును ఉపయోగించి ప్రమాదాన్ని అరికట్ట కలుగుతాడు. కళ్లెంలేని గుఱ్ఱం, బ్రేకులులేని వాహనం ప్రమాదకరములుకదా?

ఈ శ్లోకమునుండి చివరి వరకు ఇంద్రియ నిగ్రహముగురించి శ్రీకృష్ణుడు బోధించుచున్నాడు.

శ్లో॥ విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః ।
రసవర్జ్యం రసోఽప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥ 58

దండాన్వయము: నిరాహారస్య దేహినః రసవర్జ్యం విషయాః వినివర్తన్తే అస్యరసః పరం దృష్ట్వా నివర్తతే.

తాత్పర్యము:- ఇంద్రియములను విషయములందు ప్రవర్తింపచేయకున్నను విషయభోగములపై ఆసక్తి అతన్ని వదలలేదు. మనసును పరమాత్మనియందు మరలించుటచేతనే నిజమైన ఉపవాసము చేయగలడు.

బలవంతముగ మనసును విషయభోగములనుండి మరలించినప్పటికి లోపల ఆ విషయవాసన, ఆసక్తి ఉంటూనే వున్నది. ఏకాదశినాడు ఉపవాసము చేస్తూంటారు. బాహ్యంగా వారు భోజనం చేయడంలేదు. కాని మనసులో మంచి మంచి, కమ్మ కమ్మని పిండివంటలను వూహిస్తూవుంటారు. ద్వాదశినాడు పారణ చేసేదానికి ఏ ఏ పిండివంటలుచేసితింటే బాగుంటుందని ఆలోచిస్తూంటారు. కనుక ఇంద్రియాలను బలవంతంగా నిగ్రహించుటవలన ఫలముః సున్న. ఇంద్రియములను సంయమ విధానంచే విషయాలపై ఆసక్తి లేకుండునట్లు ప్రయత్నించాలి. మనసు భగవంతునిపై మరలించి విషయాసక్తిని భగవదాసకిగ చేసినపుడు ఇంద్రియ సంయమము లభించును.

ఇంద్రియములకు ఆహారము లేకుండ చేయుట అనిన ఆ యా ఇంద్రియాలుచేసే పనులను చేయకుండునట్లు నిరోధించుట. త్వగింద్రియమునకు ఆహారము స్పర్శ, కంటికి చూచుట, చెవికి వినుట జిహ్వేంద్రియానికి రుచి, (మాటలాడుట) ఘ్రాణేంద్రియానికి వాసన చూచుట అనునవి ఆహారములు. వీటిని బలవంతంగా లేకుండజేసిన మనసులో అవి వాటిని కోరుచుండును, ఊహించుచుండును.

దీర్ఘరోగంతో బాధపడుచున్న రోగికి త్రాగుడు, పొగత్రాగుట మానాలి అని వైద్యుడు పథ్యంపెట్టినా, మనసులో వాటిని గురించి చింతిస్తూంటాడు. రోగము మానిన వెంటనే మరల పొగ త్రాగును, మత్తుమందు సేవించును. ఇట్టివారినే ఈ శ్లోకంలో 'నిరాహారి యగు దేహి' అని అన్నారు. విషయానుభవాలను వదలినా లోపల వాటినిగురించి చింతించేవాడు 'మిథ్యాచారి' అని గీత చాటుతుంది. వీడు ఆత్మవంచకుడు, ప్రపంచాన్ని మోసం చేస్తున్నాడు,

కాషాయ వస్త్రాలు ధరించినాడు, ఆశ్రమంలో నివాసం చేస్తున్నాడు. కాని వాసనలు కలిగియున్న సన్యాసి ఆత్మవంచకుడు. లోపల, బయట విషయములయెడ ఆసక్తి వుండరాదు. కాని ఇది అనుభవంలో చాలా కష్టము.

ఈ విషయాసక్తి ఎపుడు తొలగుతుందంటే "పరమాత్మజ్ఞానం పొందినపుడు" అని శ్లోకంలో "పరం దృష్ట్వా నివర్తతే" అని చెప్పబడింది. పరమాత్ముడు రసస్వరూపుడు. ('రసోవై సః'). అతనిలో అన్నిరసాలు వున్నాయి. బ్రహ్మానందములో ఇంద్రియానందాలున్నాయి. కాని ఒకతూరి బ్రహ్మానందాన్ని అనుభవిస్తే మిగతా విషయానందాలు తుచ్ఛమనిపిస్తాయి. "మందార మకరంద మాధుర్యమునదేలు మధుపంబు వోవునే మదనములకు?" "చెరకుపాల్మనసార త్రాగెడి జిహ్వ వేపనూనెను త్రాగ వేడ్కపడునే?"

శ్రీరామ పట్టాభిషేకానంతరము శ్రీరాములు తన అనుయాయులకు బహుమతులు యిచ్చుచుండెనట. అపుడు సీతమ్మ హనుమంతునికి తన రత్నాల హారమును బహూకరించెనట. హనుమంతుడు ఆ హారములోని ఒక్కొక్క రత్నాన్ని కొరికి అవతల పారవేయుచుండెనట. కారణమడుగగా రత్నాల్లో రామచంద్రుడు కలడా? అని చూచుచున్నాను. శ్రీరాముడులేని పదార్థము నాకు రుచించదని సమాధానమిచ్చాడు. అదే విధంగా బ్రహ్మానంద రసాస్వాదన చేసిన మహనీయులకు క్షుద్రరస విషయసౌఖ్యాలు తుచ్ఛంగా తోస్తాయి. వాటియందు ఆతని మనసు ప్రవేశించదు. కనుక స్థితప్రజ్ఞత లభించాలన్న ఇంద్రియనిగ్రహముతోపాటు జ్ఞానంకావాలి. పరమాత్మజ్ఞానం పొందుటచే బాహ్య అంతరింద్రియ నిగ్రహము లభిస్తుంది.

'పరం దృష్ట్వా నివర్తతే' అని ఈ శ్లోకంలోని బోధ. అనగా పరబ్రహ్మస్వరూపమును తెలిసికొనిన పిమ్మట విషయవాసన నివర్తించును అని ఈ పదాలకు అర్థము. ఇది జ్ఞానముచేత లభించవచ్చును. కాని సామాన్య మానవుడు పరమాత్మనిపై దృష్టి ఎట్లా సాధించాలి? ఏకాదశినాడు ఉపవాసము చేస్తారు. ఈ ఉపవాసంచేయు కాలంలో మనసును ఇంద్రియార్థాలపై పోకుండునట్లు, ధ్యానము, భజన, సంకీర్తనము, పూజవంటి కార్యక్రమాలతో నిగ్రహించుటకు సాధన చేస్తారు. శివానందలహరిలో ఇంద్రియాలు భగవంతునిపై యెట్లు ఆసక్తం కావాలో చక్కగా వర్ణించబడింది.

శ్లో॥ మనస్తే పాదాబ్జే నివసతు వచః స్తోత్ర ఫణితౌ
కరశ్చాభ్యర్చాయాం శ్రుతిరపి కథాకర్ణనవిధౌ ।
తవ ధ్యానే బుద్ధిః నయన యుగళం మూర్తి విభవే
పరగ్రంథాన్ కైర్వా పరమశివ జానే పరమతః ॥ 7

మనసు, వాక్కు, హస్తము, శ్రవణము, బుద్ధి, నేత్రము అను ఇంద్రియము లారును సర్వకాల సర్వావస్థలయందు నీ కైంకర్యమునందే నిమగ్నమై యున్నవి. కనుక ఇతర గ్రంథాలు (విషయాలు) పై ప్రసక్తిలేదు. కావున పరమశివా అనుగ్రహింపుము.

ఇట్లా ప్రహ్లాదుడు సర్వేంద్రియాలను విష్ణునియందే అర్పించి తరించాడు.

కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని చూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణునాకర్ణించు వీనులు వీనులు
మధువైరి దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు
పురుషోత్తమునిమీది బుద్ధి బుద్ధి

ఈ ప్రకారంగా ఇంద్రియాలను, మనసును, బుద్ధిని భగవంతుని సేవలో నియోగించుచుండుట వలన క్రమక్రమంగా పరమేశ్వరునిపై దృష్టి అధికమగుచురాగా ఇంద్రియ సంశమము లభించి స్థితప్రజ్ఞత్వము సాధించ నగును.

శ్లో॥ యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః।
ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః 60

దండాన్వయము— హేకౌన్తేయ, యతతః, విపశ్చితః, పురుషస్య మనోపి ప్రమాథీని. ఇంద్రియాణి ప్రసభం హరన్తి, హి

తాత్పర్యము— దృఢప్రయత్నము చేయుచున్నట్టియు, ఆత్మా నాత్మ వివేకియైన సాధకుని మనస్సునుకూడ క్షోభను కలుగ జేసెడి ఇంద్రియములు ఆకర్షించును.

శ్లో॥ తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీ తమత్పరః।
వశేహి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా॥ 61

దండాన్వయము— తాని సర్వాణి సంయమ్య, యుక్తః మత్పరః ఆసీత యస్య ఇంద్రియాణి వశే వర్తతే, తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా, భవతి.

తాత్పర్యము— ఇట్టి క్షోభకలుగజేసేది. సకలేంద్రియాలను సంయమ విధానంతో స్వాధీనము చేసుకొని ఈశ్వరాయత్తము చేయవలెను. ఈ విధముగా ఇంద్రియముల స్వాధీనముచేసుకొని ఈశ్వరాయత్తము గావించిన సాధకుని ప్రజ్ఞ మిక్కిలి స్థిరమై యుండగలదు.

ఈ రెండు శ్లోకాల్లో భగవంతుడు ఇంద్రియముల శక్తిని, అవి కలిగించెడి క్షోభను గురించి వివరించెను. దృఢప్రయత్నం చేత సంయమ విధానంలో వానిని స్వాధీనముచేసి ఈశ్వరాయత్తము గావించిన, అతను స్థితప్రజ్ఞుడై వెలుగ గలడు.

దృఢప్రయత్నం చేయుట (యతతోపి) వివేకము కలిగియుండుట అనునవి సాధకునికి రెక్కలవంటివి. ఈ రెండు లక్షణాలు కల్గియుండికూడ, ఇంద్రియములు బందిపోటు దొంగలవలె మనసును ఆకర్షించి లాగికొని పోవుచున్నవి. "బలవానింద్రియ గ్రామః విద్వాంసమపికర్షతి" అని వ్యాసఉవాచ.

ఇంద్రియములు శక్తివంతములు. ఇట్లాంటి శక్తివంతములగు సేవకులను అదుపులో పెట్టుకొనుట మానవుని కర్తవ్యము. ఇట్లాంటి ఇంద్రియముల వ్యాపారాన్ని చక్కగా గమనించాలి, యజమానిని తమ పరం చేసుకొని తాము లాభము పొందాలని సామాన్య సేవకులు ప్రయత్నిస్తూంటారు. ఇట్లాంటి సేవకులను బలవంతంగా స్వాధీనము చేసుకొనుట ఫలముండదు. కుక్కతోకను. కట్టెతో కట్టినట్లుండును. కట్టు తీసివేసిన తోక మరల వంకరగ తిరుగును. సంయమ విధానంతో ఇంద్రియాలను స్వాధీనము చేసుకొనుట అవసరము, దృఢప్రయత్నము (యతతః) అత్యవసరము. దీన్నే పతంజలిమహర్షి "అభ్యాసము" అని పేర్కొన్నాడు. ఇంద్రియాలను నిత్యము సన్మార్గవర్తనులను చేయుట అభ్యాసము. ఈ అభ్యాసము ఎంతకాలము సాగవలెను? దీర్ఘకాలము, నిరంతరము దృఢవిశ్వాసంతో చేస్తూండాలి. (దీర్ఘకాల నైరంతర్య సత్కార సేవతో దృఢభూమిః"-పతంజలి యోగసూత్రము)

ఇంద్రియాలను వాని పనిలో నియోగిస్తూ వాటిని జాగ్రత్తగా గమనిస్తుండాలి. కొంచెము ఏమరుపాటు కలిగినా యివి యజమానిని పెడత్రోవ పట్టిస్తాయి. అయిదుగురు సేవకులతో పనిచేసుకొమ్మని భగవంతుడు ఇంద్రియాలను మానవున కిచ్చినాడు. వివేకముతో వాటిని నియమించలేకపోతే ఐదుగురు యజమానుల సేవకునివలె జీవితము బాధాయుత మవుతుంది. కనుక వివేకి అయిన మానవుడు ఇంద్రియములను శత్రువులుగాగాక మిత్రులవలె వాటిని సామదానమనే ఉపాయములతో వానిని మిత్రులను చేసుకోవాలి. అభ్యాసంచే మిత్రులైన ఇంద్రియాలు యజమానికి అన్నివిధాలతోడ్పడి, అతని పురోవృద్ధికి తోడ్పడతాయి. కనుక ఇంద్రియాలను పసిపిల్లలవలె నయాన భయాన స్వాధీనము చేసుకోవాలి. ఇట్టి ప్రక్రియయే ఇంద్రియ సంయమము.

ప్రయత్నం చేస్తుంటాము, వివేకంతో ప్రవర్తిస్తుంటాము. కాని ఒక్కొక్కతూరి ఇంద్రియాలను అదుపులోనికి తెచ్చుకొనుట దుస్సాధ్యమవుతుంది. విప్రనారాయణునివంటి మహాభక్తుడు దేవదేవి అనే వేశ్యాలోలుడవుతాడు. కాని భగవదనుగ్రహంతో మరల స్వాధీనచిత్తుడవుతాడు. విశ్వామిత్రమహర్షి అంతటివాడు కామదాసుడైనాడు కనుక ప్రయత్నం చేస్తుండాలి. ప్రయత్నంలో పరాజయము పొందవచ్చుకాని ప్రతి పరాజయము విజయానికి మెట్టు అన్న ఆంగ్లనానుడివుంది. (Failures are stepping stones to success) పరాజయం కలిగిందని పట్టువిడువక తుదివరకు పోరాటము సాగించవలసినదే. ఈ సాధనలో భగవానుడు మనకు ఉపదేశించినకీలకం ఉపాయం. "మత్పరః యుక్త ఆసీత, మదీయ పరాయణత్వ" మని యోగములో నెలకొనుట. ఇంద్రియ జయానికి ప్రయత్నంచేస్తూ భగవంతుని శరణుపొందాలి. అన్నికార్యాలు భగవంతుని కైంకర్యంగా భావించి బ్రతకాలి. గజేంద్రుడు తన ప్రయత్నము చేసిచేసి అలసి "స్వామీ ఇక నాచేతకాదు. నీవేతప్ప నితః పరంబెరుగ మన్నింపన్ తగున్ దీనునిన్" అని సర్వసమర్పణ భావంతో భగవంతుని ఆశ్రయించాడు. "మయ్యేవ మన ఆధత్స్వ మయిబుద్ధిం నివేశయ, నివసిష్యసి మయ్యేవ" నీ సర్వస్వము నాకు అర్పించి పోరుసల్పు, నీ యోగక్షేమాలను నేను చూచుకుంటాను అని పరమాత్ముడే హామీ యిచ్చాడు.

"శరణువేడు నిన్నురక్షిస్తాను" అనే భగవంతుని హామీ, ప్రయత్నపరులకే కాని సోమరిపోతులకు కాదు. సోమరులకు భగవానుడు ఎట్టి సాయము

చేయడు. భగవంతుడు శక్తిరూపంలో ప్రతి ఒక్కరిలో వున్నాడు. చిద్రూపు డైన భగవంతుడు ప్రతి ఒక్కరిలో వివేకరూపంలో వున్నాడు. శక్తి జ్ఞానము అనే రెండు భగవద్విభూతులు ప్రతి ఒక్క ప్రాణిలో వున్నాయి. ఆ శక్తులను ఉపయోగించాలి. ఉడుతకు ఉడుతాభక్తి అన్నట్లు యేయే ఉపాధిలోవున్న శక్తు లన్నింటిని ఉపయోగించాలి. అదే మానవ ప్రయత్నము, పురుషప్రయత్నము. బైబిలులో ఒక కథవుంది. ఒక తండ్రికి ముగ్గురు కుమారులు వుండేవారు. వారికి వెరివేయి నాణ్యాలు (Talents) యిచ్చి వాటినిభద్రంగా వుంచుకోమని తాను విదేశాలకు వెళ్ళాడు. తండ్రి ఆదేశం మేరకు ఒక కొడుకు తన నాణ్యా లను గుంతతీసి జాగ్రత్తగా దాచాడు. మరొకడు దాన్ని అనవసరమైన ఖర్చులు చేసి నష్టపోయాడు. మూడవవాడు ఆ డబ్బును మంచి వ్యాపారంలో ఉప యోగించి రెండింతలు చేసినాడు. తండ్రి తిరిగివచ్చి వారికిచ్చిన రూకల విషయం ప్రశ్నించాడు. మొదటివాడు జాగ్రత్తగ ఇచ్చిన డబ్బును తండ్రికి యిచ్చాడు. తండ్రికి కోపం వచ్చింది. నీకిచ్చిన శక్తిని నీవు వినియోగించక భూగతం చేశావు. ఉపయోగించుటకు చేతకాని సోమరివి. అతనికిచ్చినవేయి నాణ్యాలను వ్యాపారంలో రెండింతలు చేసిన మూడవవానికిచ్చాడట. భావమే మన భగవద్దత్తమైన శక్తులను దుర్వినియోగముచేయక సద్వినియోగంచేసేవారి యోగక్షేమాలను భగవంతుడే వహిస్తాడు.

కనుక భగవంతుడు బోధించిన సన్మార్గాన్ని అనుసరించి ప్రయత్నం చేతనయినంత చేసి ఇంద్రియాలను జయించాలి. స్వశక్తితోపాటు భగవదర్పణ సాధకునికి తోడ్పడి ఇంద్రియజయాన్ని సిద్ధింపచేస్తాయి. "ప్రయత్నాత్ యత మానస్తు యోగీ సంశుద్ధ కిల్బిషః" అంటుంది గీత. ప్రయత్నముచేత మాన వుడు ఇంద్రియ జయాన్ని పొంది పరిశుద్ధాంతరంగుడై ఆత్మజ్ఞానాన్నిపొంది స్థిత ప్రజ్ఞుడు కాగలడు.

మానవుడు ఇంద్రియదాసుడై విషయాసక్తుడగుటచేత ఎట్టి దుర్గతి నొందునో 62, 63, 64 శ్లోకాలు తేటతెల్లంగా వివరిస్తాయి. మానవుని పతనానికి దారిదీసే సంఘటనలు సదా జ్ఞాపకం వుంచుకోవాలి. ఒక ఆఫీసరు తన సీటు ఎదురుగా ఈ శ్లోకాలు వ్రాసుకొని ప్రతి దినము జ్ఞాపకం చేసుకొనే వాడట. ఆ శ్లోకాలే యివి.

శ్లో॥ ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూప ...
సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోభి జాయతే॥ 62
క్రోధాత్ భవతి సమ్మోహః సమ్మోహాత్ స్మృతి విభ్రమః ।
స్మృతిభ్రంశాత్ బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥ 63

తాత్పర్యము; విషయచింతన వలన విషయములపై ఆసక్తికలుగును. ఈ ఆసక్తివలన కోరికపుట్టును. కోరిక నెరవేరనిచో లేదా నెరవేరుటకు ఆటంకం కల్గించినవారిపై క్రోధము కలుగును. క్రోధమువలన ఆవేశము కలుగును. ఆవేశమువలన యుక్తాయుక్త వివేకజ్ఞానము నశించును. తన్ను తాను మరచును. ఈ స్థితిలో అనరాని మాటలు మాటలాడుట, చేయరాని పనులు చేయుట, ఈ విధముగ మనుజుడు చెడిపోవును.

ఇంద్రియ నిగ్రహము మనోజయమునకు అత్యవసరమే. కాని ఇంత మాత్రము చాలదు. ఇంద్రియ నిగ్రహముతోపాటు చిత్తశద్ధి కావలయును. చిత్తానికి రెండు దోషాలున్నాయి. అవి చంచలత్వము, మలదోషము. చంచలత్వాన్ని ఇంద్రియ నిగ్రహమువలన జయించవచ్చును. మలదోషమును వైరాగ్యమువలన, జ్ఞానమువలన, నిరంతర సాధనవలన నిరోధించవచ్చును. ఎన్నో జన్మపరంపరలలో ఈ మలదోషము సంప్రాప్తించింది. ఇవి సంస్కార రూపంలో మనసును ఆవరించియున్నాయి. ఈ మలదోషమే విషయాసక్తిని కామనలను ప్రాప్తింపజేయును. ఈ కామనలు మానవుని పతితునెట్లు చేయునో ఈ రెండు శ్లోకాలు విదితం చేస్తున్నాయి.

ప్రథమంలో మనసు ఒక విషయాన్ని గురించి తలుస్తుంది. విషయ చింతన చేస్తూచేస్తూ దానిపై ఆసక్తి, మక్కువ, ప్రీతి కలుగుతుంది. ఉదాహరణకు విశ్వామిత్రుని ఉదంతాన్ని గురించి విచారిద్దాము.

విశ్వామిత్రుడు వశిష్ఠాశ్రమానికివచ్చి కామధేనువును చూచినాడు. గోవు ఎంతో అందంగా వుందనుకున్నాడు. ఆ ధేనువును గురించి ఎక్కువగా ఆలోచించినాడు. (ధ్యాయతః) ఆవు తన దగ్గరవుంటే బాగుంటుంది అనే కోరిక కలిగింది. (సంగం) ఆ కోరిక మరింత బలిష్ఠమైనది. (కామము) ఆ ధేనువును తనకిమ్మని, దానిబదులుగా వేయిగోవులిస్తానని వశిష్ఠుని కోరినాడు. వశిష్ఠుడు అంగీకరించలేదు. కోపంతో బలప్రయోగం చేసినాడు. (క్రోధః)

గోవు దొరకలేదు. వశిష్ఠుని ఓడించి గోవును పొందాలని తలంచినాడు. ఓడిపోతాడు. ఇంక కోపము ఎక్కువై యుక్తాయుక్త వివేకాన్ని కోల్పోయి అతని నూర్గురు కొడుకులను సంహరించాడు. ఇట్లాగే మానవుడు దిగజారి పోతాడు. ఒక్క తప్పటడుగువేస్తే మానవుడు అధఃపతనమై పోతాడు. "ఆకాశంబునుండి శంభుని శిరంబునుండి హిమవత్పర్వతంపైబడి తుదకు దేవ గంగ అధఃపాతాళలోకానికి పతనమైంది." ఇట్లావుంటుంది 'వివేకభ్రష్ట సంపాతముల్' అని భర్తృహరి వర్ణించినాడు.

కామము క్రోధాన్నెట్లు పొందజేస్తుందో వివిధ భాష్యకారులు తమ అభి ప్రాయాల నిచ్చారు. కోరికలను పొందలేకపోతే క్రోధముపొందిన విషయాన్ని మరెవ్వరైనా తమనుండి వేరుచేయాలన్నా కోపం కలుగుతుంది. (వినోబాజీ) కామము ఒక గొప్ప తిండిపోతు. మహోదరుడు. యయాతి ఎన్నివేల సంవ త్సరాలు స్త్రీ సుఖాన్ని అనుభవించినా ఆ కోరిక తీరలేదు (గాంధీజీ). ఒక వస్తువును కోరినాడు. అది లభించింది. అది తనదగ్గరనే వుండాలనేది లోభము. వస్తువు లభిస్తే లోభము. లభించకుంటే లేదా ఉన్నదిపోతే క్రోధము. ఇంతకు పతనానికి మూలము లోభము (జ్ఞానేశ్వరులు. క్రోధము, లోభము ఒకేతల్లిపిల్లలు. ఒక్కరుంటే మరొక్కరు అక్కడ వుండనే వుంటారు.

క్రోధముతో 'సమ్మోహము' కలుగుతుంది. సమ్మోహము అనగా అవి వేకము. లోభముతోనైనా, క్రోధముతోనైనా మోహము కలుగుతుంది. అర్జునుని విషాదము క్రోధముతోకాక లోభంతో కల్గింది. 'నాది' 'నావారు' అనేది లోభకారణము ఎదుట శత్రుసేనలోనున్నవారు 'నా బంధువులు' 'నా స్నేహితులు' 'నా గురువులు'. నేను వారిని ఎట్లా చంపేది? ఇదే అజ్ఞా నము. దీనినే విషాదము, మోహము అనవచ్చు. సత్యవస్తువులో అసత్యదృష్టి. అనిత్య విషయాల్లో నిత్యత్వ దృష్టి. ఇదియే అజ్ఞానము. ఈ అజ్ఞానమే మోహానికి కారణం. ఉన్నది వున్నట్లు చూడలేకపోవడమే మోహము. ఈ సమ్మోహముచే మతి భ్రమిస్తుంది అసలే మనస్సు చంచలము. సమ్మో హంతో మతి మరింత భ్రమించి గందరగోళంగా అవుతుంది. దీంతో జ్ఞాపక శక్తి పోతుంది. మరచుట అనగా అన్నపానాదులు, ధనార్జన, భార్యాపుత్రులు, ఆస్తిపాస్తులను మరచిపోవుటకాదు. తానెవరో తన స్థానమేదో మరచుట.

కామాతురుడు ఇది బిడ్డ, ఇది తల్లి అనే వావివరుసలు మరచిపోతాడు. తత్ఫలితంగా చేయరాని పనులు చేయును.

అర్జునుడు తాను నారాయణ స్వరూపమని విస్మరించి తాను కుంతీ పుత్రుడనని, తాను మహావీరుడనని, తాను చంపేవాడనని శత్రుసేనలోనున్న భీష్మ ద్రోణాదులు చంపబడేవారనే అజ్ఞానంతో సమ్మోహితుడై విషాదంతో రథంలో కూలిపోయినాడు. భగవంతుని జ్ఞానబోధ విన్నాడు. 'నష్టోమోహః స్మృతిర్లబ్ధా' అని ఆదర్శ శిష్యునివలె తన కర్తవ్యాన్ని గుర్తించి యుద్ధం చేసినాడు. స్మృతిర్లబ్ధా అంటే తాను కర్తకాదు, భోక్తకాదు. కేవలము ఆత్మ స్వరూపి, సాక్షి, ద్రష్ట అనే ఆత్మజ్ఞానం.

స్మృతిభ్రంశవలన బుద్ధినాశము, దానివలన పతనము తప్పదు. మేడ మెట్లపై బంతి దిగజారి మధ్యన నిలువక ఆఖరిమెట్టుపై పడుతుంది. ఇదియే "వివేకభ్రష్ట సంపాతముల్" అని భర్తృహరి చెప్పిన మాటలు. దిగజారుటను గీత నశ్యతి అని గాక 'ప్రణశ్యతి' అన్నది 'ప్ర' అనే పదము చెప్పుటకు వీలులేనంత అనే భావాన్ని వ్యక్తంచేస్తుంది.

ఇక రాబోయే శ్లోకం మానవుడు ఉత్తమగతిని ఎట్లా పొందునో విదితం చేసుంది.

శ్లో॥ రాగద్వేష వియుక్తైస్తు విషయా నింద్రియైశ్చరన్ ।
అత్మవశ్యై ర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి ॥ 64

సంహితాన్వయము:— రాగద్వేష వియుక్తైః, ఆత్మవశ్యైః, ఇంద్రియైః, విషయాన్ చరంస్తు, విధేయాత్మా ప్రసాదం అధిగచ్ఛతి.

తాత్పర్యము:- ప్రియా ప్రియరహితములైనది, స్వాధీనములైనవియగు ఇంద్రియములచేత విషయములను (ఇంద్రియార్థములను అనుభవిస్తూ స్వాధీనమైన మనసుకలవాడై చిత్తశాంతిని (ప్రసాదమును) పొందుచున్నాడు.

విధేయాత్ముడనగా స్వాధీన మనసు, ఇంద్రియములుకలవాడు. విషయ భోగాలను అనుభవిస్తున్నప్పటికి అపూర్వమైన చిత్తశాంతిని (ప్రసాదము) పొందగల్గుచున్నాడు. సాధనచేసి ఇంద్రియములను, మనసును స్వాధీనపరచు కొని విషయసుఖాలను అనుభవిస్తున్నా వాటిపై రాగము లేకుండుటచే, ఎట్టి

మనశ్చాంచల్యములేక ప్రశాంతచిత్తుడై వుండగలుగుచున్నాడు. శ్రీరామచంద్రుడు మరుదినము పట్టాభిషిక్తుడు అవుదునని తెలిసికొన్నపుడు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బుకాలేదు. మరుదినము పట్టాభిషేకముకాక వనవాసానికి వెళ్లవలసినపుడు క్రుంగిపోలేదు. రెండు సంఘటనలందు ఆతను నిర్లిప్తుడైయుండెను. అతని ముఖకవళికలలో ఎట్టిమార్పు కన్పించలేదని తులసీదాసు వర్ణించినాడు. ఇదియే ప్రసాదము.

'ప్రసాదం' అంటే పొంగలి, పులిహోరకాదు. ప్రసాదం అంటే అంతఃకరణ ప్రసన్నత. సామాన్యంగా దేహము ఆరోగ్యంగా అగుపిస్తుంది. కాని అంతరంగము రోగభూయిష్ఠమై ఉంటుంది. స్థూలదేహానికి వాత పిత్త శ్లేష్మముల వైషమ్యం వ్యాధులు సంభవిస్తాయి. కాని అంతఃకరణము మలవిక్షేప ఆవరణ దోషాలతో రోగం కలిగివుంటుంది రోగనివారణ కావలెనన్న ఈ పైన చెప్పిన మూడు దోషాలు నివారణకావాలి. అంతఃకరణము పరిశుద్ధంగా వున్నపుడే ఆత్మ దేవుడు అందు ప్రత్యక్షమవుతాడు. పవిత్రములగు గీతోపన్యాసాలు జరుగవలెనన్న ఆ ప్రదేశం పరిశుద్ధంగా వుండాలి. వాతావరణం కూడా పరిశుద్ధంగా, ప్రశాంతంగా వుండాలి. అపరిశుద్ధమైన ప్రదేశంలో సామాన్య మానవుడే నివసించలేనపుడు పరిశుద్ధుడైన భగవానుడెట్లు నివసించగలడు? అందుకే తులసీదాసు "కాముడుండేచోట రాముడుండడు" అని నుడివియున్నాడు. కనుక అంతఃకరణము శుద్ధికావాలి. అంతఃకరణమంటే యేమి? అంతఃకరణము ఆత్మసాక్షాత్కారానికి ఉపకరణమగు మనఃప్రవృత్తి. ఒక అద్దమున్నది. అద్దాన్ని ఉపయోగించనివాడంటూ వుండడు. ఎంత అనాకారి అయినా ఒకసారి అద్దాన్ని చూచుకొని తృప్తిపడుతాడు. అద్దము కొత్తదాన్ని దేన్నీ సృష్టించదు. ఉన్నదాన్ని ఉన్నట్లు చూపుతుంది. అంటే నీవు ఎట్లా వున్నావో నీకు తెలియజేస్తుంది. బాహ్యబింబ ప్రకాశమే మానవునికి ఆనందాన్ని కలుగజేస్తూవుంటే అంతర్ముఖ ప్రతిబింబము లేక ఆత్మసాక్షాత్కారము కలిగినప్పుడు ఎంత సంతోషము కలుగుతుందో వూహించవచ్చు. అద్దానికి దుమ్ము పట్టుతుంది. దాన్ని శుభ్రమైన గుడ్డతో తుడిచివేయవచ్చు. అద్దానికి పట్టిన దుమ్ము 'మలదోషము'. కాని ముఖము బాగా అగుపించాలంటే అద్దము శుద్ధంగా వుండటమే కాకుండ అది కదలకుండ వుండాలి. ఈ కదలికనే 'విక్షేపము' అని అంటారు. అద్దం శుద్ధంగావుంది, కదలకుండవుంది. కాని

దానిపై పలుచని పట్టుగుడ్డ కప్పివుంది. కనుక అద్దము వుండి ప్రయోజనము లేదు. దీన్నే 'ఆవరణ దోషము' అంటారు. ఇదే విధంగా అంతఃకరణ మనే అద్దానికి మలవిక్షేప దోషాలతోపాటు ఆవరణదోషముకూడ వుంది. ఆవరణ దోషమంటే 'అజ్ఞానము'. ఈ మూడు దోషాలు లేకుండు స్థితియే 'ప్రసాదము'. ఇట్టి ప్రసాదముతో పుష్టినొందిన అంతఃకరణ ఒక గొప్ప శక్తి కలిగివుంటుంది, ఈ శక్తిచే నిత్యానిత్య, సత్యాసత్యములు గోచరిస్తాయి. ఇట్లాంటి శక్తికలిగినపుడు అనిత్య అసత్యవస్తువులు అంతరించినా ఎట్లాంటి బాధ కలుగదు. అట్లాగే అనిత్య అసత్య వస్తువులు సంప్రాప్తించినపుడుకూడ ఎట్టి సంతోషముకలుగదు. సుఖదుఃఖముల సత్యస్వరూపము తెలిసినపుడు ఈ రెండును 'మిథ్య' అని తెలిసికొనినపుడు మనసు చలించదు. 'ప్రసాదే సర్వ దుఃఖానాం హాని రస్యోప జాయతే' అని రాబోయే శ్లోకం వివరిస్తుంది.

శ్లో॥ ప్రసాదే సర్వదుఃఖానాం హాని రస్యోపజాయతే।
ప్రసన్న చేతసోహ్యాశు బుద్ధిః పర్యవ తిష్ఠతే॥ 65

దండాన్వయము:- ప్రసాదే (సతి) అస్య సర్వదుఃఖానాం హానిః ఉప జాయతే ప్రసన్నచేతసః, అశు, బుద్ధిః పర్యవతిష్ఠతి హి.

తాత్పర్యము;- ఇట్లు స్వస్థతకలిగినపిమ్మట సర్వదుఃఖాలు (ఆధ్యాత్మిక, అధిభౌతిక, అధిదైవిక) నశించును. మరియు స్వచ్ఛమైన అంతఃకరణ గలవాని బుద్ధి ఆకాశమువలె స్వచ్ఛమై, నిశ్చలమై యుండును.

అంతఃకరణశుద్ధిచే పొందిన మనఃప్రసాదమువలన ఆధ్యాత్మిక, అధి భౌతిక, అధిదైవిక దుఃఖాలు నశించిపోతాయి. మనఃప్రసాదము కలిగినవారికి మేరుపర్వతములాంటిదుఃఖాలు ఎదురైనా వారు యిసుమంతకూడ చలించరు. అంతఃకరణ శుద్ధిలేనివారికి గోరంతలు కొండంతలుగా అగుపడును. ప్రసాదము లభించనివారు వివేకశూన్యులై విషయచింతన చేయుచు నవయువకులైనా 80 సంవత్సరాల వృద్ధులుగా గోచరిస్తారు. మనఃప్రసాదము లభించిన 80 సంవత్సరాల వృద్ధులుకూడ నవయువకులవలె గోచరిస్తారు. మహాత్మాగాంధీ తాను 70 సంవత్సరాల యువకుణ్ణి అని చెప్పుకునేవారట! ప్రసాదము పొందినవారు ఎప్పుడు దేవతలవలె నవయువకులుగ వుంటారు. లోకోపకారం చేయదలచినవారు ముందుగా అంతఃకరణశుద్ధి కలిగివుండాలి. వజ్రధైర్యము

కలిగివుండాలి. "వీరభోగ్యావసుంధరా" అనే ఆర్యోక్తి ప్రకారం ఈ ప్రపంచము ధైర్య శౌర్య పరాక్రమంకలవారిసొత్తు. ఇట్టివారు ఎక్కడవున్నా ఏపనిచేస్తూన్నా, ఏ వ్యవస్థలో చేస్తున్నా వారు నిరంతరము శాంతిని, తుష్టిని కలిగియుందురు. కనుక సర్వ దుఃఖోపహారియగు ప్రసాదము మానవుడు పొందాలి.

సుషుప్తిలో దుఃఖము లేదుకదా? ప్రతి దినము ప్రతి ఒక్కరు సుషుప్తిని అనుభవిస్తూన్నారుకదా ? సుషుప్తిలో సుఖము చాలదు. జాగ్రదవస్థలోకూడ దుఃఖము లేకుండుట మాత్రము చాలదు. ఒకడు కట్టెలు అమ్మి జీవనంచేస్తూ వున్నాడు. కట్టెలమోపు మోసుకొని ఎండలో వస్తున్నాడు. ఒక దయాళువు ఆతని కట్టెలమోపును క్రిందికి దించినాడు. కష్టము తొలగింది కాని ఆకలిబాధ తీరలేదు. ఇదేవిధంగా దుఃఖనివృత్తిమాత్రమే చాలదు. దానితోపాటు ఆనందప్రాప్తి కావాలి. కట్టెలమోపు దించడంతో దుఃఖనివృత్తి అయింది. మంచి భోజనము లభించినపుడుకాని అతనికి తృప్తి లభించదు. కనుక మానవ జీవిత లక్ష్యము దుఃఖనివృత్తి, ఆనందప్రాప్తి.

ఈ ఆనందప్రాప్తి ఎప్పుడు కలుగుతుంది? ప్రసాదము కలిగిన ఎన్నాళ్లకు? అను ప్రశ్నకు సమాధానం కృష్ణపరమాత్మ చెప్పినాడు. "వెంటనే" అని. "ప్రసన్న చేతసోహ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి". ప్రసన్నచేతసము కలిగినవెంటనే 'ఆశు' అని కృష్ణుని సమాధానం. ప్రసన్నత పొందిన వెంటనే 'సోహంబ్రహ్మ' నేనే బ్రహ్మను అనే నిశ్చితాత్మబుద్ధి లభిస్తుంది. ఈ బుద్ధి స్థిరంగా అఖండాకార స్థితిగా నిలుస్తుంది అని కృష్ణపరమాత్మ నొక్కి వక్కాణించాడు.

ఈ శ్లోకము ప్రయత్నశీలుడు ప్రసాదసిద్ధిని పొందిన "యుక్తుడు" పొందగలడని ప్రసాదముయొక్క మహత్తుని తెలియజేస్తుంది. వచ్చే శ్లోకము 'అయుక్తుడు' ఇంద్రియనిగ్రహములేనివాని దైన్యస్థితిని గురించి విశదపరుస్తుంది.

శ్లో॥ నాస్తిబుద్ధి రయుక్తస్య నచా యుక్తస్య భావనా ।
నచాభావ యతః శాంతిః అశాంతస్య కుతస్సుఖమ్॥ 66

దండాన్వయం:- అయుక్తస్య బుద్ధిః నాస్తి, అయుక్తస్య భావనా 'చ' నాస్తి న అభావయుతః శాంతిః + చ. అశాంతస్య కుతః సుఖం.

తాత్పర్యము:- ఇంద్రియనిగ్రహము లేనివానికి ఆత్మానాత్మ వివేకము కలుగదు. 'బ్రహ్మము నేను, నేనే బ్రహ్మము' అను భావన (నిశ్చయ జ్ఞానము) కలుగనేరదు. అతనికి మనశ్శాంతి వుండదు. మనశ్శాంతి విషయవాసనా రాహిత్యము లేనివానికి బ్రహ్మానందసుఖము ఎట్లు లభించును?

సామాన్య సంసారికి ఇంద్రియ నిగ్రహము ఎట్లా కలుగుతుంది? సోహం భావన ఎట్లా లభిస్తుంది ? అనే సంశయము కలుగవచ్చు. ధర్మవ్యాధుడు, తులాధారుడు సామాన్య గృహస్తులు కాదా? వారు ఏ కార్యం చేస్తున్నా వారి మనసు పరమాత్మనియందే లగ్నమయి వుండింది· సమస్తకర్మలు ఈశ్వరార్పణ బుద్ధితో చేసిరి· మనసును భగవంతునితో ముడిపెట్టితే ఇంకేంకావాలి? అదే తపస్సు, అదే యాగము. పరమాత్మని అండ దొరికితే ఇక కావలసినదేమున్నది ? ఒకతూరి వినోబాభావే తన మిత్రులతో వాహ్యాళికి వెల్లుతూండినాడు· అది మంచి ఎండాకాలము. ప్రదేశము కొండ ప్రదేశము. రోడ్డు యిరువైపుల పెద్దపెద్దచెట్లు చిగురించియుండెను. ప్రక్కనవున్న రాళ్ళమధ్యన పొదలు ఎండిపోయి వుండెను. "ఎండాకాలమైనా ఈ మహావృక్షాలు పచ్చగ చిగురుటాకులు దాల్చివున్నాయి, ఏల పొదలు ఎండిపోయినాయి?" అని మిత్రుని ప్రశ్నించాడు. వినోబాభావే ప్రశ్నలకు సమాధానం రాకపోతే వినోభాజీయే ప్రశ్నలకు జవాబు చెప్పాడు. మహావృక్షాలవేర్లు భూమి అంతర్భాగంలోని నీళ్ళలో వున్నాయి. పొదలవ్రేళ్ళు పైనుండే నీటిధారలపై ఆధారపడి యుండుటచే, నీరెండిపోగా అవి ఎండిపోయినాయి. యోగుల మనస్సు నిరంతరము పరమాత్మ అనెడి అమృతములో ఆర్ద్రమైవున్నాయి· అందుకే సంసారముచేస్తూన్న సామాన్య మానవులు మనస్సు సంసారతాపంలోవున్నా, పరమాత్మ అనెడి అమృతంలో వ్రేళ్ళుకలిగి యుండుటచే వారు పచ్చగా, అందంగా, ఆరోగ్యంగా, ప్రశాంతంగా వున్నారు· పరమాత్మను అందజాలని వారు చిన్న పొదలవంటివారు దుఃఖితులై, అశాంతులై వున్నారు. మహా పర్వతము మేఘాలను దాటిపోయి వుంటుంది. కనుక దాని శిఖరాగ్రము సదా సూర్యకాంతిని పొందుతూ వుంటుంది. కనుక ఈశ్వరాయత్తచిత్తము లేనివాడు ఎప్పుడు దుఃఖాలతో సతమతమవుతూ వుంటాడు. కనుక ప్రతి ఒక్కరు ఆత్మజ్ఞానాన్ని పొందేదానికి ప్రయత్నించాలి. అవకాశము కలిగిన విడనాడరాదు.

అయుక్తునకు భావన వుండదు. భావనయనగా పరమాత్మునిపై ప్రేమ. మానవునకు అన్నిటికన్న ప్రియమైనది 'నేను'. కాని అయుక్తుడు దేహము తానని భావిస్తూన్నాడు. కాని తాను నిత్య, సత్య, అఖండ, అద్వితీయమైన ఆత్మయని తెలిసికోలేకున్నాడు. ఎప్పుడు 'నేను' శరీరముకాదు. అఖండ సచ్చిదానంద పరమాత్మను అని తన్నుతాను భావించుకొనునో అప్పుడే అతను శాంతిని పొందగలడు. ఎపుడు దేనిని యెక్కువగా ప్రేమిస్తామో అప్పుడు దాన్ని పొందాలనే దృఢమైన సంకల్పము కలుగుతుంది. ఈ భావనాబలంతో ప్రయత్నంచేసి దాన్ని పొందవచ్చు. ఇట్టి భావనాబలం కలవానికే శాంతి లభిస్తుంది. ఈ శాంతి యెక్కడనోలేదు. అది ప్రతియొక్కరి హృదయాంతరాళంలో వుంది. దాన్ని వెదకాలి. Dig deep down into your self. నీలోనికి నీవులోతుగావెళ్లిచూడు. అక్కడ ప్రేమానందరసవాహిని అగుపిస్తుంది. ఆ నీరు అందరికి కనిపించలేదే? ఎందుకు కనిపిస్తుంది? ఆ ఆనందరస వాహినిపై అహంకారము, మమకారము, అజ్ఞానమనే మట్టి పేరుకొని వున్నది. బాగా అంతశ్శోధనచేసి ఈ మట్టిని ప్రక్కకుత్రోసివేస్తే ఆనందరసము వెల్లుబికి బైటికి వస్తుంది. శాంతిలేనివానికి ఆత్మానంద సుఖము సున్న. "శాంతము లేక సౌఖ్యములేదు" అని త్యాగయ్య పాడినాడు. నచాభావ యుతః శాంతి, అశాంతస్య కుతః సుఖం? ఆత్మజ్ఞానము కలిగియుండుట స్థితప్రజ్ఞుని లక్ష్యం.

సాధకుడు ఎంత సంసారములోవున్నా పరమాత్మునిపై మనసు సంలగ్నం చేసి చేయు కర్మలు ఈశ్వరార్పణ బుద్ధితో చేయగలిగితే శాంతి పొందగలడు. సాధకునిదగ్గర రామజోగి మందువుంటే సంసార సర్పము ఎన్ని కాట్లువేసినా ప్రమాదము లేదు. ముంగిస పాముతో పోట్లాడి ఎన్ని పాముకాట్లు పొందినా నకులవల్లి అనే తీగను కొరికితే విషము ఎక్కదు. అట్లాగే భగవదర్పణ అనే దివ్యౌషధం వున్నపుడు సంసారంలో ఎట్లాంటి రోగాలు వచ్చినా భయం లేదు. కనుక శాంతి వుండాలంటే భావన కలిగివుండాలి. భావన అంటే నేనే పరమాత్మ, పరమాత్మను నేనే అనే దృఢతరమైన జ్ఞానము వుండాలి. ఇట్లా జ్ఞానం లభించాలంటే ఇంద్రియ సంయమనం వుండాలి.

ఇంద్రియ సంయమనము లేకపోతే మనసు విషయవాసనలతో కొట్టుకొని తుఫానులో చిక్కుకున్న పడవవలె క్షోభనొందును. ఈ భావాన్నే ఈ క్రింది శ్లోకం విశదీకరిస్తూంది.

శ్లో॥ ఇంద్రియాణాం హి చరతాం యన్మనోను విధీయతే।
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావ మివాంభసి॥ 67

దండాన్వయము:- చరతాం ఇంద్రియాణాం యత్ మనః, అనువిధీయతే, అస్య ప్రజ్ఞాం అంభసినావం వాయురివహరతిహి.

తాత్పర్యము:- విషయములందు ప్రవర్తించుచున్న ఏ ఇంద్రియాన్ని మనసు అనుసరిస్తుందో ఆ ఇంద్రియము మనసుచే ప్రేరేపించబడి ఆ పురుషుని యొక్క ఆత్మానాత్మ వివేకాన్ని (ప్రజ్ఞను) హరించి అతన్ని సముద్రములో తుఫానులో చిక్కుకున్న పడవవలె విపరీతమైన క్షోభనొందజేయును.

ఒక్కొక్క ఇంద్రియము మానవుని వశవర్తినికాకున్న అది ఆ విషయముతో తాదాత్మ్యముచెంది మానవుని యుక్తాయుక్త జ్ఞానాన్ని కోల్పోవజేసి సముద్రంలో తుఫానులో చిక్కుకున్న పడవవలె మానవుని విపరీతమైన అశాంతికి గురిచేయును. ఒక్క ఇంద్రియానికి దాసుడై తేనే ఇంత అశాంతి కలిగితే, అయిదు ఇంద్రియాలు స్వేచ్ఛగాప్రవర్తింపజేసిన మానవునిదుర్గతి వర్ణనాతీతం.

జింక శ్రోత్రేంద్రియానికి (శబ్ద), ఏనుగు త్వగింద్రియానికి (స్పర్శ), మిడత నేత్రేంద్రియానికి (రూప), తుమ్మెద ఘ్రాణేంద్రియానికి (గంధం), చేప రసేంద్రియానికి (రస), లోబడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి. ఇక అన్ని ఇంద్రియాలకు లోబడిన మానవునిగతి దుర్గతియే యగును. ఈ విషయాన్ని వివేకచూడామణి చక్కగా వర్ణించింది.

శ్లో॥ శబ్దాదిభిః పంచభి రేవ పంచ
పంచత్వ మాపుః స్వగుణే న బద్ధాః ।
కురంగ మాతంగ పతంగ మీన
భృంగా నరః పంచభిరం కుతః కిం?॥ (వివేకచూడామణి)

ఇంతవరకు పది శ్లోకాలలో ఇంద్రియముల గురించి గీతాచార్యుడు బోధించెను. ఇక ఉపసంహారం గావిస్తున్నాడు. 58వ శ్లోకంలో 'యదా సంహరతే చాయం' అని ప్రారంభించి 68వ శ్లోకంలో 'ఇంద్రియా ణీంద్రియా ర్థేభ్యః తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా' అని ఉపసంహారం జరిగింది. ఉపక్రమణతో ఏ విషయం ప్రారంభిస్తామో, ఉపసంహారంలో అదే వాక్యంతో ఉపసంహ

రించుట శాస్త్రపద్ధతి. అందుకే 'తస్మాత్' అను పదంతో శ్లోకం ప్రారంభ మయింది.

శ్లో॥ తస్మాద్యస్య మహాబాహో నిగృహీతాని సర్వశః ।
ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 68

దండాన్వయము:- హే మహాబాహో తస్మాత్ యస్య సర్వశః, ఇంద్రియాణి, ఇంద్రియార్థేభ్యః, నిగృహీతాని, తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా హి.

తాత్పర్యము - ఇంద్రియాలు ఇంద్రియార్థాలతో ప్రవర్తించుట దోషము కాబట్టి ఎవడు విషయములందు ఇంద్రియాలను ప్రవర్తింపజేయకుండ ఇంద్రియములను స్వాధీనము చేసికొనునో అట్టి సాధకునిప్రజ్ఞ స్థిరమైనది.

ఈ శ్లోకంలో కృష్ణుడు అర్జునుని మహాబాహో! అని సంబోధిస్తున్నాడు! భావమేమన "బాహ్యశత్రువులను తపింపచేయు శక్తిసంపన్నుడవైన అర్జునా. నీ అంతశ్శత్రువులనుకూడ జయించు" అని.

ఇంద్రియాలు ఒక్కొక్కటి జీవున్ని తమవైపుకు లాగుతూవుంటే అతను అనేకభార్యలు తలా ఒకవైపు లాగబడిన భర్తవలె బాధకు గురి అవుతారు. కనుక ఇంద్రియాలపై బ్రేక్ (break) ఉపయోగించాలి. ఇంద్రియములు మన స్వాధీనములో ఉండాలి. అట్టి ప్రయత్నాన్ని చేసి ఇంద్రియజయాన్ని సాధించాలి. బాల్యావస్థలోనున్న ఇంద్రియాలు వాటి బాల్యచేష్టలతో జీవున్ని బాధిస్తుంటాయి. బడికిపోనని మారాము చేస్తున్న బాలుని నయాన, భయాన పాఠశాలకు పోయేటట్లు చేస్తూంటారుకదా? అట్లాగే బాల్యావస్థయందున్న ఇంద్రియాలను సామ దాన ఉపాయాలతో స్వాధీనము చేసుకొని వాటికి సాత్వికవృత్తి లభించేటట్టు చేసుకోవాలి. ఈ విధంగా ఇంద్రియాలను ఇంద్రియార్థములనుండి మరలించి వానిని స్వాధీనము చేసుకొని జీవింతురో అట్టివారి ప్రజ్ఞ, శక్తి సుప్రతిష్ఠమైనదగును.

ఇక రాబోవు మూడు శ్లోకాల్లో గీతాచార్యుడు స్థితప్రజ్ఞుని లక్షణాలను మరింత విశదీకరిస్తున్నాడు. స్థితప్రజ్ఞునికి, సామాన్య మానవునకుగల తారతమ్యాన్ని నిర్దుష్టంగా ఈ శ్లోకంలో విదితం చేస్తున్నాడు.

శ్లో॥ యానిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।
యస్యాం జాగ్రతి భూతాని సానిశాపశ్యతో మునేః ॥ 69

దండాన్వయము— సర్వభూతానాం, యానిశా, తస్యాం, సంయమీ జాగర్తి యస్యాం, భూతాని, జాగ్రతి, సాపశ్యతః మునేః నిశా

తాత్పర్యము— అవివేకులైన సకల ప్రాణులకు, ఏ బ్రహ్మనిష్ఠ రాత్రి వలె నుండునో అది జితేంద్రియునకు పట్టపగలు. సమస్త భూతములకు (అవివేకులైనవారికి) ఏది పట్టపగలో జ్ఞానియైనవానికి అది రాత్రి. ఇది కేవలము స్థూలమగు అర్థము. దీనియొక్క భావార్థాన్ని గుర్తించుకోవాలి. రాత్రి అనగా వస్తువు అగుపించని చీకటి. పరబ్రహ్మము అజ్ఞానమను చీకటిలో సామాన్యులకు కానవచ్చుటలేదు. కనుక సామాన్యులు పరబ్రహ్మ తత్త్వమును కనజాలక అజ్ఞానము అను చీకటిలో నిదురింతురు. దేహభావంతో మేల్కొనుట వారి పగలు. కాని స్థితప్రజ్ఞుడు బ్రహ్మభావనంలో మేల్కొని దేహభావనలో నిదురిస్తాడు.

స్థూలదృష్టికి సామాన్యమానవునకు, స్థితప్రజ్ఞునికి ఏమి భేదముకనపడదు. స్థితప్రజ్ఞుడు సామాన్య మానవునిలె భోజనము చేస్తాడు, పనిపాటలు చేస్తాడు, నిదురిస్తాడు. ఈ విషయాల్లోకూడ వీరిద్దరిలో ఒకింత భేదముకలదు. స్థిత ప్రజ్ఞుని దృష్టిలో ఆకలి అనే రోగానికి అన్నము పథ్యమువంటిది. బ్రతికే కొరకు తింటాడు కాని తినేకొరకు బ్రతకడంలేదు. ఆరోగ్యంగా వుండేకొరకు ఎంత ఆహారము కావాలో అంతే తింటాడు. మహాత్మాగాంధి శరీరాన్ని అద్దెకొంపగా వర్ణించాడు. జీవుడు ఈ బాడుగయింట్లో తాత్కాలికంగా నివశిస్తాడు. అందుకు బాడుగ చెల్లిస్తాడు. అన్నము తినుట యీ బాడుగయింటికి అద్దె చెల్లించుటవంటిది. మోటారుకారు నడపడానికి పెట్రోలు అవసరమైనట్లు, ఈ దేహమనే వాహనము నడుపడానికి అన్నం అవసరం. కనుక స్థితప్రజ్ఞుడు భోజనం చేసేదిజీవించుట కొరకే (Eat to live). కాని సామాన్య మానవుడు భోజనం కొరకే (విషయాలను అనుభవించేకొరకే) జీవిస్తాడు. ఇతను రుచి కొరకు భోజనంచేస్తే, స్థితప్రజ్ఞుడు కేవలం దేహధారణకొరకే భోజనంచేస్తాడు.

సామాన్యునికి నిద్ర మాంద్యతను కలిగిస్తే స్థితప్రజ్ఞుని నిద్ర ప్రకాశాన్ని పొందజేస్తుంది. సామాన్యునిది భోగనిద్ర. స్థితప్రజ్ఞునిది యోగనిద్ర. సామాన్యునికి మంచము, పరుపు, దిండు వుండాలి. స్థితప్రజ్ఞుడైన మలయాళ యోగీంద్రుడు కటిక నేలపై గుడ్డపరచుకొని కైదండమే దిండుగా నిద్రించాడు. సామాన్యుడు వృత్తి వ్యాపారాలను ధనార్జనకై, కూడబెట్టుటకై, స్వార్థపరుడై

భోగాల కొరకు చేస్తాడు. స్థితప్రజ్ఞుడు వృత్తి వ్యాపారాలను కేవలము అవస
రాల కొరకై చేస్తాడు. తులాధారుడు, తిరువల్లువర్ తమ వృత్తిని కేవలం
కుటుంబ పోషణకొరకు మాత్రమే చేపట్టిరి. స్థితప్రజ్ఞుడు ఫలాపేక్షారహితుడు.
ఏపని చేసినా కుశలంగ, నేర్పుతో చేస్తాడు. కర్మ కర్మకొరకే చేస్తాడు.
సామాన్యుడు కర్తృత్వ భోక్తృత్వబుద్ధితో పనులుచేస్తే స్థితప్రజ్ఞుడు అకర్తగా,
అభోక్తగా ఆత్మభావనతో చేస్తాడు. సామాన్యుల కర్మలు బంధాన్ని కల్గిస్తే,
యోగి కర్మలు బంధవిముక్తిని కలుగచేస్తాయి.

మరొక్క విధంగా ఈ శ్లోకాన్ని అన్వయంచేసుకొనేందుకు ప్రయత్ని
ద్దాము. సాంఖ్యయోగం (గీత 2వ అధ్యాయం) లో భగవంతుడు కృష్ణుడు
మూడు విషయాలను బోధించాడు. మొదటిది సాంఖ్యం, రెండవది యోగం,
మూడవది స్థితప్రజ్ఞత్వం. ఈ మూడు విధానాల్లో సామాన్యునికి స్థితప్రజ్ఞునికి
గల తారతమ్యాన్ని ఒకింత పరిశీలిద్దాం.

గీతాప్రోక్త సాంఖ్యయోగం ప్రకారం ఆత్మ అకర్త, ఆతని కర్మ
అప్రేరకం. అర్జునుని ఆత్మ యుద్ధము చేసేదికాదు. భీష్మాదులు చంపబడే
వారు కారు. శ్రీకృష్ణుని ఆత్మ ప్రేరేపించేది కాదు. ఇతరుల దృష్టికి స్థిత
ప్రజ్ఞుడు పనిచేస్తున్నా అతడు నిరహంకారి. కర్తృత్వ భోక్తృత్వ అధికారా
లను తనలో ఆరోపించుకోలేదు. కేవలం సాక్షిమాత్రుడుగా ప్రవర్తిస్తున్నాడు.
చేస్తున్నపనులన్నిటిని ఆత్మభావంతో చేస్తున్నాడు. కాని సామాన్యుడు తానే
కర్త అనెడి దేహభావంతో చేస్తున్నాడు. కర్మఫల భోగాలకొరకు జనన
మరణాదుల పొందుతున్నాడు. కాని సాంఖ్యయోగి తానుచేయు కర్మలను
ఆత్మభావంతో చేయుటవలన అవి బంధాన్నికాక మోక్షాన్నే కలుగచేస్తున్నాయి.
అతని భోజనము యజ్ఞము, అతని నిద్ర సమాధి. ఇల్లు తగులబెట్టేవాన్ని
ఆకతాయి అంటారు. హనుమంతుడు లంకాదహనంచేశాడు. అతను ఆకతాయి
కాదు. మహాభక్తశిఖామణిగా, రామకార్యదురంధరుడుగా పేరొందినాడు.

యోగపద్ధతిని అనుసరించి ఈ శ్లోకాన్ని విచారిద్దాము. యోగి ఆత్మ
అకర్త అని ఎరుగును. కాని దేహంకూడ అదేపద్ధతి అనుసరిస్తే తమోగుణం
ప్రవేశిస్తుంది. మానవుడు ఏ ప్రవృత్తియందున్నా ఉత్తీర్ణుడు కాగల్గుతాడు.
కాని తమోవృత్తిమాత్రం కూడదు. కర్మ చేయాలి, కాని కర్మఫలాన్ని ఆశించ

కూడదు. తిరుగలివుంది, అందులో క్రిందిరాయి స్థిరంగావుంటుంది. పైరాయి తిరుగుతూ వుంటుంది. అపుడే దాని ఉపయోగం. రెండురాళ్ళు తిరుగుతున్నా, రెండురాళ్ళు తిరుగకున్నా నిష్ప్రయోజనం. ఆత్మ స్థిరపదార్థం. దాన్ని ఆధారం చేసుకొని శరీరం కర్మజేస్తుండాలి. ఆత్మ అకర్తకాబట్టి కర్మఫలితంతో ప్రసక్తిలేదు. ఆత్మభావంలో స్థిరంగావుండే యోగి కర్మను నిష్కామబుద్ధితో చేస్తాడు. యోగికి నిష్కామబుద్ధి వెన్నెముకవంటిది. కర్మ కర్మకొరకే చేయడం అతని స్వభావం. అతనిలో సాత్వికాహంకారానికికూడ చోటులేదు. ఇందుకు నిదర్శనం తుకారాంస్వామి. ఒకదినం అతను పూజచేస్తుండగా, శివాజీ అతన్ని బంగారుపల్లకిలో తీసుకురావాలని ఆజ్ఞాపించాడు. బంగారుపల్లకి తుకాజీ ఇంటిముంధు వేచివుంది. తుకాజీ దేవునిముందుకువెళ్ళి భోరున ఏడ్వడం మొదలుపెట్టాడు. "స్వామీ! నన్నెందుకు ఇట్లా పరీక్షిస్తావు? ఏడ్చేపిల్లలకు తినుబండారాలుపెట్టి ఏడ్పు మాన్పించినట్లు నీ సాన్నిధ్యాన్ని చేరాలని తపించే నా పోరు మాన్పడానికి ఈ రాజమర్యాదలనే లంచంయిచ్చి నన్ను తృప్తిపరుద్దామనుకున్నావా? అదేం కుదరదు. నాకు కావలసింది నీవొక్కడవే" అని ఆ రాజభటులను, బంగారుపల్లకిని వాపసుపంపాడు. తుకాజీ సాత్వికాహంకారము రాకుండా తన్నుతాను కాపాడుకున్నాడు మహాభక్తుడు తుకారాం. యోగి కర్మచేస్తాడు. ఫలాపేక్షతోచేసేవారికంటే నేర్పుతో చేస్తాడు. కాని అతనికి ఫలాపేక్షలేదు. కాని సామాన్య మానవుడు ఫలాపేక్షలేకుండ ఏపనిచేయడు. పైపెచ్చు అట్లా వారినికూడ ఎందుకు అతను సేవచేస్తున్నాడు, ఏదో లోపలి ఫలం కోరకుండా వుంటాడు అని ఎద్దేవ చేస్తాడు. యోగి కర్మలకు ఆధారం నిస్వార్థము. సామాన్యుని కర్మలకు మూలం స్వార్థం.

ఇక స్థితప్రజ్ఞుని పరంగా ఈతనికి సామాన్యునికిగల తారతమ్యాన్ని పరిశీలిద్దాం. స్థితప్రజ్ఞుని బాహ్యలక్షణం ఇంద్రియ నిగ్రహం. ఈతను ఇంద్రియాలకు ప్రభువు. సామాన్యులు ఇంద్రియాలకు దాసులు. సామాన్య మానవుడు ఇంద్రియాలకు స్వాతంత్ర్యానిచ్చి తాను నిద్రపోతాడు. కాని స్థితప్రజ్ఞుడు ఇంద్రియనిగ్రహంలో మేల్కొంటాడు. తాను అకర్త అని పగటిలో (జ్ఞానంతో) మేల్కొంటాడు. సామాన్యుడు తాను కర్త అని పగటిలో మేల్కొన్నాడు. అకర్త అని రాత్రిలో (అజ్ఞానంతో) నిదురించాడు. స్థితప్రజ్ఞుడు నిష్కామబుద్ధితో మేల్కొంటే సామాన్యుడు సకామబుద్దితో మేల్కొన్నాడు.

శ్లో॥ ఆపూర్యమాణ మచల ప్రతిష్ఠం
సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।
తద్వత్కామా యం ప్రవిశంతి సర్వే
స శాంతి మాప్నోతి నకామ కామీ ॥ 70

దండాన్వయము— ఆపూర్వమాణం, అచల ప్రతిష్ఠ, సముద్రం ఆపః యద్వత్ ప్రవిశంతి, తద్వత్ సర్వే+కామాః, యం ప్రవిశన్తి సః శాన్తి, ఆప్నోతి, కామ కామీన.

తాత్పర్యము— నదీజలములచే, వర్షముచేత సదా నింపబడుచున్న సముద్రము ఎపుడు హానివృద్ధులు లేవో, ఏకరీతిని ఉన్నట్లు, స్థిరబుద్ధి యగు యోగి అప్రయత్నంగా చేకూరు ప్రాపంచిక సుఖదుఃఖాలను పొందుచున్నను పొంగడు, క్రుంగడు, కలతచెందడు. కోరికలులేనివాడే ప్రశాంతిని పొందును. కోరికలుకలవానికెప్పుడును శాంతి లభించదు.

ఈ శ్లోకంలో కృష్ణభగవానుడు స్థితప్రజ్ఞుని గాంభీర్యాన్ని వర్ణిస్తున్నాడు 7వ అధ్యాయంలో "జ్ఞానీత్వాత్మైవమే మతం". జ్ఞాని తన స్వరూపమే అంటూ బోధించినాడు. కనుక జ్ఞాననిధియై తన స్వరూపమే అయిన స్థితప్రజ్ఞుని పొగడడంలో ఆశ్చర్యములేదు. స్థితప్రజ్ఞుడు ఒక మహాసముద్రమువంటివాడు. సముద్రములో ఎన్నో నదులు చేరుతున్నా పొంగదు. నదులు చేరకున్నా క్రుంగదు. అదేవిధంగా సముద్రమువలె స్థితప్రజ్ఞుడు అతనిలో ఎన్ని కామనలు ప్రవేశిస్తున్నా ఇంచుకేని చలించడు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే మహానదులు తనలోనికి ప్రవేశిస్తున్నా ఇసుమంత అతనిలో మార్పు కనిపించదు. పైపెచ్చు ఆ గుణాలను మార్చివేసి తన గుణాలనేవాటికి పొంద జేస్తున్నాడు. అగ్ని హోత్రములో కట్టెలువేస్తే కట్టెలు నిప్పుగా మారుతాయి. కట్టె తన స్వరూపాన్ని పోగొట్టుకొని అగ్నిస్వరూపాన్ని పొందింది.

ఈ విషయంలో ఒక సంశయము కలుగవచ్చు. స్థితప్రజ్ఞుడు సముద్రం వలె తనలోచేరే కామనలను అన్నిటినీ హరిస్తాడు. అయితే అతని పాప కార్యాల విషయంలో అతనెట్లా ప్రవర్తిస్తాడు? ఈ శ్లోకంలో స్థితప్రజ్ఞుని లక్షణాల విషయమే ప్రస్తావించబడింది. నీతి విషయంలో అతని ప్రవర్తన ఎట్లా వుంటుందని ప్రశ్న వచ్చినపుడు అతను పాపకార్యాలు చేయలేనట్టి స్థితికి

ఎదిగినాడు. జ్ఞాని భగవంతుని స్వరూపమేనని భగవంతుడే చెప్పినపుడు అతని కర్మలన్నీ అకర్మలనుటలో సందేహములేదు. కృష్ణుడు పూతనను, అనేకమంది రాక్షసులను సంహరించెను. అతని కర్మవలన పాపులందరు ముక్తినిచెందిరి. అగ్నిలోవేసిన ఎంతటి నికృష్ట పదార్థమైనా అగ్నిస్వరూపమే దాల్చును. వివేకానందుడు అమెరికాలో మాంసభక్షణ చేస్తున్నాడని ఎవరో శారదాదేవికి చెప్పిరట. ఆమె ఇట్లా అన్నది. "నరేంద్రుడు మాంసభక్షణ చేస్తాడని నేను నమ్మను. ఒకవేళ అతను మాంసముతిన్నా అది అగ్నిలోవేసిన వస్తువువలె హరించబడును". అది హవిషాన్నముగ మారును. "బ్రహ్మసత్యం జగన్మిథ్యా" అనే జ్ఞానంతో పరిపుష్టిని చెందిన మహానుభావునకు అనాత్మ వస్తువులన్నీ మాయా స్వరూపాలే. సత్యస్వరూపాన్ని తెలిసికొన్నవారికి భ్రాంతి ఎక్కడిది? నారాయణరెడ్డి అనే అవధూత వుండేవాడు. అతను ఎద్దుపేడ తింటూండుట చూచి ఒకరు "రెడ్డీ పేడ తింటూన్నారే" అనగ అతను చేతిలోని పేడను చూపించి, ఇది పేడకాదు 'లడ్డు' అనగానే ఆవ్యక్తికి పేడ మధురమైన లడ్డుగా గోచరించిందట. "శునిచైవ శ్వపాకేచ పండితాః సమదర్శినః". సమబుద్ధి లభించిన స్థితప్రజ్ఞునకు అన్నీ బ్రహ్మస్వరూపమే. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అనే సర్వాత్మనా భావాన్ని పొందిన స్థితప్రజ్ఞునకు ప్రపంచ విషయస్పందనలు ఏమి చేయజాలవు. 'వాతాపి జీర్ణం వాతాపి జీర్ణం' అని అగస్త్యుడు వాతాపిని రూపంలేకుండ చేయగలిగినాడు. సముద్ర మధ్యనవున్న కొండను అలలు ప్రతినిమిషము తాకుచున్నను ఆ కొండ ఇంచుకైన చలించనట్లు, స్థితప్రజ్ఞుని కామనలు ఏమీ చేయలేవు. అవి అతనిలో హరించుకొనిపోవును. హాలాహలాన్ని మ్రింగిన సదాశివుడు విషాన్ని కంఠంలోనుంచుకొని మూర్తీభవించిన శాంతమో అన్నట్లుండును. అట్లాగే స్థితప్రజ్ఞుడు శాంతస్వరూపుడు, చిదానంద స్వరూపుడు. కాన విషయ భోగలంపటుడు ఎప్పటికి శాంతి పొందలేడు.

శ్లో॥ విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిఃస్పృహః ।
నిర్మమో నిరహంకారః స శాంతి మధిగచ్ఛతి ॥ 71

దండాన్వయము— యః పుమాన్, సర్వాన్ కామాన్ విహాయ, నిస్పృహః నిర్మమః, నిరహంకారః, చరతి, సః శాన్తిః, అధిగచ్ఛతి.

తాత్పర్యము— ఏ సాధకుడు సమస్తములైన విషయవాసనలను వదలిపెట్టి ఎంతమాత్రమును వానియందు అభిలాష లేనివాడును, మమకార అహం

కారాలు లేనివాడై సంచరిస్తూ వుంటాడో అట్టి సాధకుడు సకల దుఃఖనివృత్తి రూపమైన శాంతిని పొందుచున్నాడు.

ఈ శ్లోకము స్థితప్రజ్ఞ లక్షణాలకు ఉపసంహార శ్లోకము. ఏ విషయంతో ఉపక్రమించబడుతుందో అదే విషయంతో ఉపసంహారము జరుగుట శాస్త్రపద్ధతి. 'ప్రజహాతి యదాకామాన్' అనెడి కామనాత్యాగంతో ఆరంభించబడిన స్థితప్రజ్ఞ లక్షణాలు 'విహాయకామాన్ యస్సర్వాన్' అనే కామనాత్యాగంతో ఉపసంహరించబడ్డాయి.

ఎవరైతే సర్వకామనలను పరిత్యజించి నిస్పృహతో నిరహంకారము, నిర్మమకారంతో చరిస్తారో వారు సర్వదుఃఖ నివృత్తిరూపమైన మోక్షాన్ని పొందుదురు.

ఈ శ్లోకంలో 'కామాన్ సర్వాన్' అని బహువచన ప్రయోగం చేయబడినది. అనగా స్థూల, సూక్ష్మ అవిద్యారూపాలగు సమస్తమైన కోరికలను త్యజించినవాడు అని అర్థము. జీవించాలనే యిచ్ఛ, జీవించి ప్రపంచాన్ని ఉద్ధరించాలనే యిచ్ఛకూడ లేకుండాపోవాలి. శంకరాచార్యాది మహానుభావులు వారు జీవించాలని అనుకొనివుంటే ఎంతకాలమైన జీవించియుందురు. అట్టి యిచ్ఛ వారికేమాత్రములేదు. ఈ శ్లోకంలో 'చరతి' అనే క్రియాపదం ఉపయోగించబడింది. 'చరతి' అనేది అకర్మక ప్రయోగము. కనుక ఇట్టి గుణగణాలు కలవాడు పరివ్రాజకుడై చరించుచున్నాడు అని శంకరాచార్యుల వారి భావము. 'కర్మలు చేస్తూవుంటారు' అని తిలక్ మహాశయుని భావము. 'కర్మను చేస్తూవుంటాడు' అనే భావం స్ఫురించవలసి వుండిన 'చరతి' అనిగాక 'చరన్' అనే క్రియను ఉపయోగించి వుండాలి అనేది వినోబాజీ భావము. వినోబాజీ శంకరుల అర్థాన్నే సమర్థించారు. ఏది ఎట్లున్నా స్థితప్రజ్ఞ లక్షణాలు ప్రతి ఒక్కరు పొందాలి. వారు సన్యాసులు కావచ్చు, సంసారులు కావచ్చు. ముందుగా అహంకార మమకారాలు ఉడిగిపోవాలి. అతను నిస్పృహస్థితిలో వుండాలి. దేనిపైన ఆసక్తి వుండరాదు. సదా వైరాగ్యాన్ని పొందివుండాలి. ఇట్లాంటి గుణాలు కలిగివున్నపుడు సన్యాసి అయినా, సంసారి అయినా పర్వాలేదు. ఇట్లాంటి మహానుభావులు ఉత్తమోత్తమమైన బ్రహ్మ భావంతో పరమ శాంతిస్థితితో వుంటారు. ఈ స్థితిని తెలియచేస్తుంది ఈ అధ్యాయంలోని చివరిశ్లోకం.

శ్లో॥ ఏషా బ్రహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి।
స్థిత్వా స్యామంత కాలేపి బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి॥

దండాన్వయము— ఏషా బ్రాహ్మీ స్థితిః, ఏనాం ప్రాప్య నిముహ్యతి, అస్యాం అంతకాలేపి, స్థిత్వా బ్రహ్మనిర్వాణం ఋచ్ఛతి.

తాత్పర్యము– అర్జునా! ఇంతవరకు నీకు చెప్పినది సర్వకర్మ సన్యాసముచేసి బ్రహ్మాకారముగావుండు స్థితి. ఇట్టి స్థితి పొందినవాడు మరల మోహము పొందడు. ఈ స్థితిని మరణసమయమునకు సాధించగలిగినను నిర్వాణ పదమును అధిష్ఠించగలడు.


స్థితప్రజ్ఞుడు పొందినది బ్రహ్మీస్థితి. బ్రాహ్మీవృత్తికాదు. వృత్తియనగా మారు స్వభావము కలది. కాని స్థితి మారనిది. మోహము, అవిద్య నశించిన తరువాత అజ్ఞానము అంతమొందినది. మనక చీకటిలో త్రాడును సర్పంగా భావించాము. కాని చీకటిపోయి వెలుతురు రావడంతో సర్పభ్రాంతి అంతరించింది. కనుక జ్ఞాని ఎంతటి చీకటిలోనైనా త్రాడును త్రాడుగా తెలుసుకుంటాడేగాని పాముగ భావించడు.

ఇట్టి బ్రహ్మజ్ఞానము పొందిన వారికి పతనమంటూ వుండదు. కర్మలు, జన్మలు అతనికి లేవు. సెనగగింజలు భూమిపైపడితే అవి మరల మొలకెత్త వచ్చును. కాని శనగలను పెనంపై వేయించిన వాటిలో జీవశక్తి నశించును. అవి మరల మొలకెత్తజాలవు. కనుక జ్ఞానాగ్నిచే దగ్ధములైనకర్మలు మరల మొలకెత్తు ప్రసక్తియేలేదు. కనుక జ్ఞానాగ్ని దగ్ధకర్ములైన స్థితప్రజ్ఞులు జన్మ కర్మలనుండి విముక్తులు. ఈ జ్ఞానము జీవితములో ఏ వయస్సునందైన రావచ్చును. అంతకాలమందైనా రావచ్చును. అట్టివారు బ్రహ్మ నిర్వాణాన్ని పొందుదురు.

కనుక సర్వకామనలను కూకటివేళ్లతో లాగివేసి, సుఖదుఃఖాలకు పొంగక క్రుంగక, సమబుద్ధితో నిత్యసంతోషియై, ఇంద్రియాలను మనసును విషయ సుఖాలనుండి మరలించి, సర్వభూతహితేరతుడై సర్వాత్మనాభావంతో పుష్టి నొంది, ఇంద్రియాలకు ప్రభువై, కర్మల నొనర్చుతూ, కర్మబద్ధుడుగాక సముద్రునివలె గంభీరుడై ఎవ్వడుండునో అతడే స్థితప్రజ్ఞుడు. అతని స్థితియే సమాధి. పునరావృత్తి రహిత బ్రహ్మస్థితిని పొందిన సాధకోత్తముడగు

మానవుడు అయినపుడే స్థితప్రజ్ఞుడు. స్థితప్రజ్ఞత్వము భగవద్గీత చాటిన మానవాదర్శము పొందుట దుస్సాధ్యమే. కాని పొందాలనే దీక్షతో ప్రయత్నము చేయువారికి అసాధ్యముకాదు.

బోధనలెంతో ఉన్నతంబులని
బోధనలెంతో సుందరంబులని
చెప్పినంతనే చాలదు నిక్కం
ఆచరించవలె సత్యసూక్తులు
తు. చ. తప్పక ఎల్లవేళల. (పరమగురు చరణసన్నిధి)



ఓం

# భక్తి – భక్తుడు

"సా పరా అనురక్తి రీశ్వరే" అని నారద భక్తిసూత్రాలలో భక్తి నిర్వచింపబడినది. అనగా పరమశ్రేష్ఠుడైన భగవంతునియందుగల అనురక్తి (అపారమగుప్రేమ). ఇట్లాంటి అనురక్తి ఎవరికి వుంటుందో వారే భక్తులు.

విభక్తముకానిది భక్తి. అనగా ధ్యేయమూర్తితో ఐక్యతాభావము కల్గియుండుట భక్తి.

భగవద్గీత పంౘ్రెండవ అధ్యాయము రెండవశ్లోకము భక్తులగుటకు మూడు ముఖ్య లక్షణాలను ప్రతిపాదించింది.

1. భగవంతునందే మనసు సంలీనమైయుండు. (మయ్యావేశ్యమనః)
2. శ్రద్ధ, విశ్వాసము కలిగియుండుట. (శ్రద్ధయా పరయోపేతః)
3. భగవంతునందే మనసును లగ్నమొనరించగలుగుట. (నిత్య యుక్తా ఉపాసతే)

'మయ్యావేశ్య మనః' అనేది భక్తుడగుటకు మొదటియోగ్యత. అనగా మనసు ధ్యేయమూర్తితో నిండియుండుట.

భక్తాగ్రేసరులైన నారదమహర్షి హరిగుణగానంచేస్తూ బృందావనంలోని యమునానదీ తటంలో దిగాడు. ఒక గోపిక ఇసుకతిన్నెపై కూర్చొనియుంది. ఆసన సాధన చేస్తూవుందో, ధ్యానం చేస్తూవుందో నారదునికి అంతుపట్టలేదు. కడవ ప్రక్కనవుంది. నారదునిచూచి నమస్కరించి, మళ్ళీ కళ్ళుమూసుకొంది. నారదుడు తన వీణను గట్టిగా మీటి పాడడం మొదలుపెట్టాడు. గోపిక కన్నులు తెరువలేదు. ఇంకా గట్టిగా వీణను మీటినాడు. "శ్రీకృష్ణ గోవింద హరే మురారే, హే నాథ నారాయణ వాసుదేవ" అంటూ మరింత గట్టిగా పాడడం ప్రారంభించాడు. కొంతసేపటికి కళ్ళు తెరచింది. నారదుడన్నాడు "ఏమమ్మా నాపాట చేదుగావుందా? శ్రీకృష్ణుని దర్శనం లేదందువా? అది నీకు నిత్యం లభిస్తూనేవుంది. ఎందుకు ఏదో దిగులుతో ఆలోచిస్తూన్నావు?"

ఆ గోపిక ఇట్లా బదులిచ్చింది. "స్వామీ! ఆ కొంటె కృష్ణునిమాట ఎత్తకండి. నిద్ర లేచినప్పటినుండి ఒకే సతాయింపు. చీపురు తీసుకొనివస్తే కలకల నవ్వుతూ చీపురును లాగిపారవేసి పరిగెత్తుతాడు. దొరకడు. ఆవుపాలు పిండుతూవుంటే వచ్చి మారాం చేస్తాడు, పాలు పితుకనివ్వడు, తన నోట్లోకే పాలు పిండమంటాడు, పిండితే తుపుక్కున మొగంపై వుమ్మివేస్తాడు, పరుగెత్తుతాడు. యమునకు నీళ్లకుపోతే కడవ లాగుకొని పోతాడు. ఇంట్లో పని చేస్తుంటే పని చేయనివ్వడు. దంచుతుంటే రోకలిని పట్టుకొంటాడు. ఈ తప్పు కృష్ణునిదికాదు. నా మనసుదే దోషం. కృష్ణుడు మనసులో నిండి యున్నాడు. అతన్ని మనసులోనుండి గెంటివేయడానికి సాధన చేస్తున్నాను. కుదరటంలేదు. ఏమిచెప్పమంటావు నారదా! ఆ కృష్ణుని లీలలు. మీరే మన్నా మనసును కృష్ణునినుండి మరలించేందుకు ఉపాయమేమైనా చెప్పండి. ఆ కృష్ణుని వలనుండి మనసు బయటపడేందుకే ఈ సాధన".

నారదునికి ఆశ్చర్యం వేసింది. మహామునులు, ఋషులు మనసును సంసార విషయాలనుండి మరలించి కొన్ని క్షణాలైన కృష్ణున్ని మనసులో నిలపాలని, సతమతమవుతూవుంటే, ఈ గోపిక చదువురానిది! మనసునిండా కృష్ణుడుంటే, అతన్ని మనసునుండి వెళ్లగొట్టాలని ప్రయత్నిస్తూంది. ఈ గోపికకు కృష్ణుడు మనసులోవుంటే పనిపాటలు జరుగవట! వహావ్వా! ధన్యా! కన్యా!

ఆ గోపిక అనన్యసామాన్యమైన భక్తిని జూచి భక్తి అంటే గోపికాభక్తి వంటిదని యథావ్రజ గోపికానాం అని తన డైరీలో వ్రాసుకున్నాడట– (నారద భక్తి సూత్రములు)

యోగులు యోగీశ్వరులు శ్రీకృష్ణున్ని మనసులో రవ్వంతసేపు నిలిపి ధ్యానం చేయాలని సతమతమవుతూంటే తనమనసును పూర్ణంగా ఆక్రమించిన కృష్ణస్వామిని మనసునుండి బలవంతంగా నెట్టివెయ్యాలని తపిస్తూంది. వ్రజ గోపిక! అహా, గోపకన్యది ఏమి భాగ్యం!

స్వామి రమ్మంటేరాడు. పొమ్మంటేపోడు. కృష్ణా నీలీలలు నీకే తెలుసు!

ఇట్టాంటి స్థితిలోనే ప్రహ్లాదుడు విష్ణుని మనసులో నింపుకొని —

పానీయంబుల్ ద్రావుచున్. గుడుచుచున్, భాషించుచున్, హాసలీ
లానిద్రాదులు చేయుచున్. దిరుగుచున్ లక్షించుచున్ సంతత
శ్రీ నారాయణ పాదపద్మయుగళీ చింతామృతాస్వాద సం
ధానుండై మరచెన్ సురారిసుతుడే తద్విశ్వమున్ భూవరా!

భాగవతము 7. వ. స్కంధము,

ఇక రెండవ లక్షణం– శ్రద్ధ. శమాది సద్గుణ షట్కంలో శ్రద్ధ ముఖ్యమైనది. శ్రద్ధ వున్నచోట విశ్వాసం ఉండి తీరుతుంది. సాధకునకు శ్రద్ధ భక్తి విశ్వాసాలు తప్పక ఉండవలసిన లక్షణాలు. "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం" అని భగవద్గీత ఉపదేశిస్తుంది. "శ్రద్ధామ్ మేధామ్ యశః ప్రజ్ఞాం, ఆయుష్యం తేజ ఆరోగ్యం దేహిమే హవ్యవాహన" అని వేదఋషులు అగ్నిదేవుని ప్రార్థిస్తారు. సాధకునికి పై జెప్పినవన్ని అవసరం. వాటన్నిటికి తలమానికం వంటిది శ్రద్ధ.

యాదేవీ సర్వభూతేషు శ్రద్ధా రూపేణ సంస్థితా
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమోనమః

అని దేవీసూక్తంలో శ్రద్ధను దేవిగా వర్ణించారు. శ్రద్ధావిశ్వాసాలు పార్వతీ పరమేశ్వరులుగా తులసీరామాయణం వర్ణించింది.

"భవానీశంకరం వందే శ్రద్ధా విశ్వాస రూపిణిమ్"

శ్రద్ధావంతుడు ఎంతటి కార్యములనైనా నిర్వహించగలడు. శ్రద్ధావంతునికి భగవంతుని సాయం తప్పక ఉంటుంది. శ్రద్ధావంతున్ని విఘ్నాలు, విపత్తులు, భయము, బాధలు ఏమీచేయలేవు.

ప్రహ్లాదుని శ్రద్ధ, అగ్నిని చల్లగా చేసింది. విషాన్ని అమృతంగా చేసింది. మార్కండేయుని శ్రద్ధ, మృత్యువును జయించింది. హనుమంతుని శ్రద్ధ సముద్రాన్ని అనాయాసంగా దాటేటట్లుచేసింది. ముందుగా సాధకునికి ఆత్మవిశ్వాసం ఉండాలి. ఒకమానవుడు చేయగల్గింది మరే మానవుడైన చేయగలడు. నేను మానవుడిని అంతేకాదు. నా అంతరంగంలో భగవంతుడున్నాడు. కనుక నేను చేయజాలనిది ఏదీలేదు. అనే అత్యంత ఆత్మవిశ్వాసము

సాధకునిలో ఉండాలి (What man has done man can do, I am a man. yet I am also god in man I can do this thing and I will do - at the feet of the master) శ్రద్ధను గురించి భగవద్గీతలో ఒక అధ్యాయమే వ్రాయబడింది. శ్రద్ధ పాత్ర వంటిది. ఆ పాత్ర శుభ్రంగా ఉండాలి, అందుకే అసూయలేనివారికి, శ్రద్ధావంతునికే 'గుహ్యాత్ గుహ్యాతర మైన' రాజవిద్య ఉపదేశించబడుతుంది.

శ్రద్ధను గురించి అనేకములైన కథలు ఉదంతాలున్నాయి. సునందుడు శంకరాచార్యుల శిష్యుడు. కొంచెము మందబుద్ధికలవాడు అని ఇతర శిష్యుల అభిప్రాయము. కాని అతని శ్రద్ధ, గురువుపై విశ్వాసము అమోఘమైనది. ఒక దినం పాఠం ప్రారంభించ బడుతుంది రమ్మని గురువు పిలుపు వినగానే గంగకు అవలిగట్టుననున్న సునందుడు నీటిలోనికి ఉరికాడు. ప్రతి అడుగుకు ఒక పద్మం ఉద్భవించి అతన్ని గంగానది దాటేందుకు తోడ్పడింది. అందుకే అతడు 'పద్మపాదుడు' అని ప్రసిద్ధి నొందినాడు.

ఒక అనాథయైన పేదరాలుండేది. ఆమెకు ఒకే ఒక కొడుకు. బుద్ధి మంతుడు, శ్రద్ధావంతుడు. అతనికి చదువుకోవాలని ఉత్సాహం కలిగింది. "అమ్మా! నన్ను చదివించు" అని ప్రాధేయపడినాడు. తల్లి అన్నది "నాయనా! తిండికే కష్టంగా ఉంది నిన్ను చదివించే శక్తిలేదు." చిన్నక్లాసులు చదివాడు. పెద్దక్లాసులు చదువాలంటే బడిజీతం కట్టాలి. అబ్బాయి ఏడ్వడం మొదలు పెట్టాడు. తల్లికి దిక్కు తోచలేదు. ఆమె బాధపడి "నాయనా ఏం చేసేది? దిక్కులేనిదాన్ని, మనకు దేవుడే దిక్కు" అన్నది. అట్లాగైతే "దేవునికే జాబు వ్రాస్తాను. అడ్రసు చెప్పమన్నాడు" ఏమి తోచక ఆ యిల్లాలు, 'దేవుడు, వైకుంఠం' అని అడ్రసు చెప్పింది. ఏలాగో ఒక పోస్టుకార్డు సంపాదించి ఆ కార్డుపై దేవుడు, వైకుంఠం అని అడ్రసు వ్రాసి పోస్టుడబ్బాలో వేయడానికి వెళ్లాడు. ఆ డబ్బా ఎత్తులో ఉంది. అందలేదు. పోస్టుమాస్టరు అబ్బాయిని చూచి ఆ జాబును తెమ్మన్నాడు. జాబు చదివినాడు. అతని హృదయం ద్రవించింది. "బాబూ! నేను జాబు డబ్బాలో వేస్తాను" అని డబ్బాలో వేసి నాడు. అబ్బాయి "ఎన్నాళ్లకు బదులొస్తుంది?" అని అడిగినాడు. వారము రోజుల తర్వాత రమ్మన్నాడు పోస్టుమాష్టరు.

దేవునికి భాషతో పనిలేదు. భావాన్ని అతడు గ్రహించగలిగాడు. దేవుడు పోస్టుమాస్టరు హృదయంలో చేరాడు.

వారం రోజుల తర్వాత అబ్బాయి పోస్టుమాస్టరును కలుసుకొని "నా జాబుకు దేవుడు బదులు వ్రాశాడా?" అని అడిగినాడు. "దేవుడు జాబు వ్రాశాడు అతనికి చాలా పనిఉందట! అబ్బాయికి కావలసిన డబ్బు ఇస్తూండు నేను తర్వాత నీకు డబ్బు పంపుతాను" అని వ్రాసినాడు. కనుక నీవు బడిలో చేరు అని మొదటినెల జీతం ఇచ్చినాడు. "దైవం మానుష రూపేణ" అంటూ అబ్బాయి తల్లికి విషయాన్ని చెప్పాడు. ఆ తల్లికి కండ్లలో ఆనందాశ్రువులు నిండాయి. ఇంతకు సారమేమిటంటే, శ్రద్ధ ఉంటే సిద్ధి లభిస్తుంది శ్రద్ధకు ఏకలవ్యుడు సజీవ విగ్రహం.

గంగానదికి పుష్కరం వచ్చింది. గంగలో స్నానంచేస్తే పాపాలు హరించుకపోతాయి అనేది భారతీయుల విశ్వాసం. అందుకుతోడు పుష్కరం వచ్చింది. లక్షలాది జనం గంగలో స్నానం చేయడానికి వచ్చారు. ఆకాశ మార్గంలో శివపార్వతులు విహరిస్తూ ఈ దృశ్యమును చూచారు. పార్వతికి సందేహంకల్గి శివునితో ఇట్లాఅన్నది. "స్వామీ! ఇన్ని లక్షలమంది గంగలో పుష్కర స్నానం చేస్తూన్నారే వీరందరు కైలాసం చేరితే అక్కడచోటు సరి పోతుందా?" అందుకు పరమేశ్వరుడు నవ్వి, "సరే వీళ్లలో ఎందరు కైలాసా నికి వెళ్లటానికి అర్హులో పరిశీలిస్తాము." అన్నాడు.

వెంటనే యిద్దరు వృద్దదంపతులవలె గంగాతీరంలో అవతరించారు. ముసలాయన వ్యాధితో ఇప్పుడో అప్పుడో అన్నట్లు బాధపడుతున్నాడు. ప్రక్కన ముసలావిడ అంటూంది. "అయ్యలారా! అమ్మలారా! నా భర్తను బ్రతికించండి కేవలం మూడు గుటకలు గంగాజలంపోస్తే బ్రతుకుతాడు. పుణ్యం కట్టుకొండి" అంటూవుంది. ఒకరిద్దరు గంగాజలంతో దగ్గరికి వచ్చారు. ఆ ముసలాయన నోట్లో గంగాజలం పోసేటప్పుడు ఆ ముసలావిడ అన్నది కదా! అయ్యా కొంచం ఆగండి పాపంలేనివారు పోస్తేనే ఆయన బ్రతుకుతాడు లేకుంటే వారు, "తలపగిలి చస్తారు." అన్నది. వచ్చినవారు "పాపం చెయ్యని వారుంటారా? మనకెందుకు ఈ బెడద" అంటూ వారిత్రోవన వారు వెళ్లారు.

గంగాస్నానంచేసి ఒకచెంబులో నీళ్లు తీసికొని వస్తూండిన ఒకవేశ్య ముసలమ్మ మాటలనువిని ఆ ముసలాయన నోట్లో నీళ్లు పోసేదానికి ఉద్యుక్తు

రాలైంది. "ఆగు ఆగు తల్లి పాపంలేనివారు నీళ్లుపోయాలి లేకుంటే తలపగిలి చస్తారు" అన్నది ముసలావిడ, "గంగలో స్నానం .... అందులో పుష్కరంలో స్నానంచేస్తే ఇంకా పాపాలుంటాయా? అవ్వా!" అని నీళ్లుపోసింది ముసలాయననోట్లో. ముసలాయనలేచి కూర్చొని ఆ వేశ్యను ఆశీర్వదించాడు.

చూశావా పార్వతీ ఇందరిలో ఆ వేశ్య ఒక్కతే కైలాసం వెళ్తుంది. తక్కినవాళ్ల సంగతి మనకెందుకు అని అదృశ్యమైనారు.

గంగలో స్నానంచేస్తే సర్వపాపాలు హరించుక పోతాయి అనే విశ్వాసం సంపూర్ణంగా ఉన్నవారే శ్రద్ధాళువులు- వారికే కైలాసం ప్రాప్తిస్తుంది. గంగలో చేపలు, మొసళ్లు ఉన్నాయి వాటికి కైలాసం ప్రాప్తిస్తుందా.

కనుక అచంచల విశ్వాసం ఉండటమే శ్రద్ధ. ప్రతిమానవునిలో శ్రద్ధ ఇంతో అంతో ఉంటుంది. దానిని అనుసరించి అతనికి సిద్ధి లభిస్తుంది.

## భగవంతునియందే మనసును సంలగ్నము గావించుట

"నిత్యయుక్తా ఉపాసతే" ఇది భక్తుడు కాగోరువాని కుండవలసిన మూడవలక్షణము. భగవంతుని మనసులో పూర్ణంగా ఉంచగలగాలంటే, మరొక ఆలోచనకు మనసులో చోటుండకూడదు. కాముడుంటే రాముడుండడు, రాముడున్నచోట కామునకు చోటులేదు. ఇంద్రియాలను శాసించేది మనసు. మనసు బుద్ధి పరంగావాలి. బుద్ధి ఆత్మలో లయంకావాలి. అంటే ఇంద్రియాలు, మనసు, బుద్ధి భగవంతునిలో (ఆత్మలో) సంలీనము కావాలి. ఇదే సంపూర్ణ సమర్పణ. సర్వసమర్పణ జరిగినపుడు భక్తునికి భగవంతునికి భేదములేదు. భగవంతుడు ఎట్లా ఆడితే ఉపాధులు అట్లా ఆడతాయి.

సర్వసమర్పణ భావానికి మనసు ప్రతీక. ఒక తూరి రాధాదేవి మురళితో ఇట్లా అన్నది. "మురళీ నీవెంత అదృష్టవంతురాలివే. స్వామి నిన్ను వదలిపెట్టి ఉండనే ఉండడుకదే! ఎప్పుడూ నిన్ను అతని అధరాలు ముద్దుపెట్టుకుంటూనే ఉంటాయి. మురళి మ్రోయించనపుడు, అతని నడుముకు కట్టిన వస్త్రంలో దాచుకుంటాడు. ఏమమ్మా దీని రహస్యం?"

మురళి అన్నది– "అక్కా, ఏమి రహస్యములేదు. నేను ఒట్టి రొల్లను. నేను అంతా ఖాళీగా ఉంటాను. ఆయన ఎట్లా పలికిస్తే అట్లా పలుకుతాను.

నేను కేవలము ఆయన చేతిలో ఒక ఉపకరణాన్ని మాత్రమే. నాకు స్వతంత్రములేదు. సమస్తము ఆ స్వామికే అర్పణచేసుకున్నాను. అందుకే నేమో ఆయన నన్ను ఎపుడూ కాపాడుతూఉంటాడు" అన్నది మురళి. పిల్లి కూనలు కేవలము అసక్తులు. తల్లి పిల్లలను నోటిలో కరచుకొని త్రిప్పుతుంది. పంటితో పట్టుకొన్న కూనలకు రవంతైన బాధయుండదు. అట్లాగే భక్తుడు కూడా. అతను నిరహంకారి. సర్వస్వము అతనికి అర్పించి మిన్నకుంటాడు. "మయ్యేవ మన అధత్స్వ మయి బుద్ధిం నివేశయ నివశిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం నసంశయః" అని కృష్ణస్వామి బోధించినాడు. చేసేపనులకు తాను కర్తకాదనుకుంటాడు భక్తుడు. భగవంతుడే కర్త. తాను అతని చేతిలోని పనిముట్లు మాత్రమే. మహాభక్తుడు పోతన భాగవతాన్ని రచిస్తూ ఇట్లా అన్నాడు.

"పలికెడిది భాగవతమట,
పలికించెడువాడు రామభద్రుండట నే
బలికిన భవహరమగునట,
పలికెద వేరొండుగాథ పలుకగనేలా?"

తాను కేవలము వ్రాసేవాడే కాని, పలికించినవాడు రామభద్రుడు. అతను ఎట్లా పలికిస్తే, అట్లా పలికినాడు. తాను అతని చేతిలోని ఘంటము మాత్రమే.

మనసు భగవంతునిలో సంలగ్నము కావాలని పరమేశ్వరుని ఈ విధంగా ప్రార్థిస్తాడు ఆదిశంకరులు.

సదా మోహాటవ్యాం చరతి యువతీనాం కుచగిరౌ
నటత్యాశా శాఖాస్వటతి ఝుటితి స్వైరమభితః
కపాలిన్ భిక్షో మే హృదయకపి మత్యంత చపలం
ధృఢం భక్త్యా బధ్వా శివ భవదధీనం కురు విభో!

"స్వామి మనస్సనే కోతి మోహమనే అడవిలో చరిస్తూఉంటుంది. యువతుల కుచగిరులపై ఆడుకుంటుంది. ఆశలనే చెట్టుకొమ్మల పైనుండి గెంతులు వేస్తూఉంటుంది. ఇట్లాంటి కోతిని నీవు భక్తి అనే త్రాటితో కట్టి ఆడించు. నీవు ఆది భిక్షువు. ఇట్లా ఆడిస్తే నీకు దండిగా భిక్షలభిస్తుంది. నామనస్సు నీఅధీనంలో ఉంటుంది.

కనుక అనిత్య విషయాలను త్యాగంచేసి ఇంద్రియాలను మనసును భగవంతుని కర్పించి నిరహంకారియై భగవంతుని చేతిలో ఒక ఉపకరణంగా భక్తుడు ఉంటాడు. ఇదే సర్వసమర్పణ భావన. ఇదే భక్తుడు కాగోరువారి కుండవలసిన మూడవ లక్షణం.

## భక్తుడు భగవంతునికి అత్యంత ప్రియతముడు

భగవంతునికి అత్యంత ప్రియతముడు భక్తుడు. అంతేకాదు భగవంతుడు భక్తపరాధీనుడు.

భగవద్గీత ద్వాదశాధ్యాయంలో చివరి 8 శ్లోకాల్లో, భక్తుడు ఏకారణం వల్ల భగవంతునికి ప్రియతముడో అత్యద్భుతంగా వర్ణించబడింది. భగవంతుని ప్రేమించడం అంత గొప్పకాదు. కాని భగవంతునిచే ప్రేమించబడుటయే అతిముఖ్యము. ఈ విషయాన్ని వివరిస్తూ ఆంగ్లవాఙ్మయంలో ఒక కథవుంది.

అబూ-బెన్-ఆడమ్ అనే మానవతావాది ఉండేవాడు. అతను భగవంతునికి పూజ, ప్రార్థన చేసేవాడుకాదు. మానవసేవే అతనికి ముఖ్యం. ప్రాణి వర్గం సంక్షేమం కొరకు దినమంతా ప్రయాసపడేవాడు. రాత్రి పడుకోబోయే ముందు కొంచెముసేపు బైబిల్ చదువుకొనేవాడు. ఒక దినం యథా ప్రకారం బైబిల్ చదివి, పడుకున్నాడు. అతనికి ఒక దృశ్యం కనిపించింది. ఆ దృశ్యంలో, ఒక దేవదూత ఏదో వ్రాస్తుండడము గమనించి, ఏమి వ్రాస్తున్నావని అడిగేడు. "భగవంతుని ప్రేమించే వారిపేర్లు వ్రాస్తున్నాను" అని దేవదూత ప్రత్యుత్తర మిచ్చింది. ఈ పుస్తకంలో తన పేరేమైనా నమోదయిందా అని అడిగాడు, ఆడమ్. పుస్తకమంతా తిరగతిప్పి "కనిపించ లేదు" అని దేవదూత చెప్పింది. ఆ తరువాత నిద్రపోయాడు. మరుదినం రాత్రి కూడ ఇట్లాంటి దృశ్యమే కనిపించింది ఆడమ్‌నకు. "ఇదేమి వ్రాస్తున్నావు? అని ఆడమ్ ప్రశ్నించాడు." ఈ పుస్తకంలో "దేవునిచే ప్రేమించబడే వారిపేర్లు వ్రాస్తునాను" అన్నది దేవదూత. "అంతేకాదు ఈ చిట్టాలో నీపేరే మొట్టమొదటిది" అని చెప్పింది. దేవునికి అత్యంత ప్రియతముడయిన ఆడమ్‌ని అభినందించింది.

భగవంతుడు విశ్వాన్ని సృష్టించినాడు. అందుండే జీవరాసులన్నింటికి అతను తండ్రి. "తన సంతానాన్ని ఆదరించి, సేవచేస్తే, ఏ తండ్రి సంతోషించడు?" అట్లాగే జనాన్ని సేవించేవారు జనరంజనుడైన భగవంతునికి ప్రీతి పాత్రులగుటలో ఆశ్చర్యంలేదు.

సంత్ అసీసి (st. Assisi) తన ప్రార్థనలో, may I seek not so much to be comforted as to comfort.

"సుఖంబు నేను కోరను దేవా, సుఖంబు సర్వప్రాణులకెపుడు పొందజేయుచు నుండును గాక" అని కోరాడు ఇదే అత్యుత్తమమగు ప్రార్థన. అట్లాంటి భక్తులను భగవంతుడు అత్యంతము ప్రేమిస్తాడు. అంతేకాదు వారి యోగక్షేమాలను తానే వహిస్తానని ప్రతిన చేసినాడు (యోగక్షేమం వహామ్యహమ్) భగవద్గీతలో.

భక్తవరదుడు భక్తులకు అపకారం తలంచిన సహించడు. భక్త అంబరీషునిపై శక్తిని ప్రయోగించిన దుర్వాసునిపై చక్రాన్ని పంపి తన భక్తునికి అపకారము తలంచిన అతన్ని అంబరీషునికి పాదాక్రాంతుని జేసినాడు.

భగవంతుడు భక్తపరాధీనుడు. అతడు భక్తులను, వారి పాదధూళిని సేవిస్తాడనే కథ ఒకటి ఉంది.

ఒక దినం నారదుడు వైకుంఠానికి వెళ్లాడు. లక్ష్మీదేవి మాత్రమే కనిపించింది. భక్తితో నమస్కరించి స్వామివారిని గురించి అడిగాడు "స్వామి పూజాగృహంలో ఉన్నాడు వెళ్లండి" అని అమ్మ అన్నది. పూజానంతరం స్వామి గదినుండి బయటికి వస్తూంటే, సవినయంగా నమస్కరించి, "స్వామీ అందరు నిన్ను పూజిస్తూంటే నీవెవరిని పూజిస్తున్నావు?" అత్యాశ్చర్యమైన విషయం కదా? అన్నాడు నారదుడు. "నారదా! నీవే పూజాగృహంలోకి వెళ్లి చూడు" అన్నాడు నారాయణమూర్తి. గది అగరుధూపంతో సువాసనతో నిండియుంది.

అక్కడ ఒక బంగారు మందసము. అది పూలతో నిండియుంది. ఆపూలను తొలగిస్తే ఒక రత్నఖచిత పేటిక కనుపించింది. దాని తెరిస్తే ఇంకొక పేటిక; ఇట్లా పెట్టెలో పెట్టె తీయగ చివరకు ఒక బంగారు బరిణె ఉంది. అది తీసి చూస్తే దానిలో ఒక చిటికెడు దుమ్ము, ఒక చుక్క నీరు కనుపించాయి.

"స్వామీ ఏమిటివి?" అని ప్రశ్నించాడు నారదుడు "ఆ ధూళి భక్తుల పాదధూళి. ఆ నీటిబిందువు భక్తుల ఆనందాశ్రువు." అవి నాకు అత్యంత ప్రీతి పాత్రములు. పూజనీయములు." అని అన్నాడు నారాయణమూర్తి.

నారదుడు అత్యానందముతో తన్మయుడై భావసమాధిలోకి వెళ్లాడు. తదుపరి భక్తిసూత్రాలు రచించాడట. "మోక్షసాధన మార్గాణాం భక్తిరేవ గరీయసీ" మోక్షసాధన మార్గాలలో భక్తియే మిక్కిలి గొప్పది. అని భక్తి సూత్రాలలో నమోదుపరచిన భక్తాగ్రేసర చక్రవర్తి నారదమహాముని,

## భక్తుల యోగక్షేమాలు భగవంతుడే వహిస్తాడు

భక్తుల యోగక్షేమాలను భగవంతుడే చూచుకుంటాడు అనే సత్యాన్ని ఋజువుపరిచే ఒక ఉదంతం ఉంది.

స్వామి రామతీర్థ గణితశాస్త్ర ప్రవీణుడు. లాహెూరు కాలేజిలో గణితశాస్త్ర ఆచార్యుడుగ పనిచేస్తూ ఉండేవాడు. వైరాగ్యం కలిగింది. పదవికి రాజీనామాచేసి హిమాలయములకువెళ్లి తపస్సుచేసి సిద్ధిపొందాడు, తదుపరి దేశమంతా పర్యటించి, అధ్యాత్మిక బోధనల గావించాడు. పాశ్చాత్య దేశాలకు కూడ వెళ్లి భారతీయ సంస్కృతిని తత్వశాస్త్రాన్ని పాశ్చాత్యులకు బోధించి అఖండఖ్యాతిని గడించిన పరివ్రాజకోత్తముడు రామతీర్థుడు. తన్ను గూర్చి చెప్పేటప్పుడు "నేను" అనే పదాన్ని వాడేవాడుకాదు. "రాముడు ఇట్లా చేశాడు, అట్లా మాట్లాడినాడు" అని చెప్పేవాడు,

రామతీర్థులు అమెరికాకు వెళ్లారు. హార్బరులో ఓడ దిగాడు. ఆ దేశపు విలేఖరి ఆతన్ని గమనించి "స్వామి, మీకు లగేజివుందా?" అని ప్రశ్నించాడు, "ఉంది. 90 పౌండ్ల బరువు" అని స్వామి అన్నాడు. లగేజి ఎక్కడ ఉంది? అంటే "ఇదిగో అని తన శరీరాన్ని చూపించాడు." విలేఖరికి ఆశ్చర్యం వేసింది. "మీ దగ్గర డబ్బు ఏమైన ఉందా?" అని విలేఖరి ప్రశ్నిస్తే, "లేదు" అని సమాధానం చెప్పాడు స్వామి. "డబ్బులేదు, లగేజిలేదు. మీకు ఇక్కడ తెలిసిన వారెవరైనా వున్నారా?" అని విలేఖరి ప్రశ్నించాడు. "ఆ! వున్నారు" అని సమాధానం చెప్పాడు. 'ఎవరు వారని' యడుగగా "మీరే" అంటూ రామతీర్థులు విలేఖరిపై చేయివేసాడు.

రామతీర్థస్వామి ఆ దేశంలో వున్నంతకాలము ఆ విలేఖరి స్వామివారి యోగక్షేమములు చూచుకున్నాడు. దేశంకాని దేశంలో కట్టుగుడ్డలు తప్ప ఏమీలేని రామతీర్థులకు దేవుడు విలేఖరి రూపంలో అతని యోగక్షేమాలు విచారించాడు. "ఉదారచరితానాంతు వసుధైవ కుటుంబకం" అనే ఆర్యోక్తి అక్షరాలా నిజం, అని ఈ ఉదంతం తెలియజేస్తుంది. విశ్వనాథుడే తన వాడైతే భక్తులకు కొదువ యెక్కడిది?

## భక్తుల లక్షణాలు

1. ఏ భూతమును ద్వేషించకుండుట
2. సర్వభూతముల యెడ మైత్రి
3. సర్వభూతముల యెడ కరుణ
4. మమకారము లేకుండుట
5. అహంకారము లేకుండుట
6. సుఖదుఃఖముల యెడ సమచిత్తము
7. క్షమ
8. నిత్యసంతోషము
9. యోగిగా ఉండుట
10. ఇంద్రియ నిగ్రహము కలియుండుట.
11. ధృఢ నిశ్చయత
12. భగవంతునికి మనసు బుద్ధి సమర్పించుట
13. ఒకరు తన్ను చూచి భయము నొందకుండుట
14. తానెవరికి భయపడకుండుట
15. హర్షము, భయము, కోపము, ఉద్వేగము లేకుండుట
16. దేనిపైనను అపేక్ష లేకుండుట
17. శుచిగా నుండుట
18. దక్షత కలియుండుట
19. ఉదాసీనత (నిస్పృహ)
20. చింతించకుండుట
21. కర్తృత్వబుద్ధి లేకుండుట

22. శుభాశుభముల యెడ సమబుద్ధి
23. శత్రువులు మిత్రుల యెడ సమభావము
24. మానావమానముల యెడ సమభావము
25. శీతోష్ణములు సుఖదుఃఖముల యెడ సమభావము
26. సంగతి లేకుండుట
27. నిందాస్తుతులందు సమభావము
28. మునిగ యుండుట
29. కొంచెము లభించిన తృప్తితోనుండుట
30. అనికేతుడు, ఒకేచోట స్థిరముగా నుండవలెనని ఆకాంక్షలేని వాడు
31. స్థిరమతి (స్థితప్రజ్ఞుడు)

## 1. ఏ భూతమును ద్వేషించకుండుట

"అద్వేష్టా సర్వ భూతానాం" అనేది ప్రథమంగా చెప్పబడిన భక్తుల లక్షణము సృష్టిలో ఏ ప్రాణియెడ ద్వేషము లేనివాడు భక్తుడు. మనం శాంతి మంత్రములో" శంనో అస్తు ద్విపదే శం చతుష్పదే, అని చెప్పకుంటూ న్నాము. మనుష్యులకేకాక పశుపక్ష్యాదులకు కూడ శాంతి కావలెనని కాంక్షిస్తూ న్నాం. కుక్కను కాలభైరవుడని, పామును సుబ్రహ్మణ్యేశ్వరుడని, పందిని విష్ణువు అవతారమని చెప్పకుంటూన్నాము. భగవంతుడు విశ్వరూపుడు విశ్వంలో భగవంతుడు కాని వస్తువంటూలేదు.

దయానందసరస్వతిస్వాములకు విషప్రయోగం జరిగింది. స్వామి ప్రాణావసానదశలో నున్నాడు. "నేరస్థుడు దొరికినాడు బంధించినాము వీని కేమి శిక్ష విధించాలి?" అని అనుయాయులు స్వామి నడిగారు. "నేను ప్రపంచంలో బంధించేదానికి రాలేదు. బంధాలు విడిపించేదానికి వచ్చాను." "అతన్ని విడిచిపెట్టండి" అన్నాడు. మహాత్ముల నడకలు మనకు వెలుగు బాటలు.

ఒక భక్తుడుండేవాడు. వాని యింటికి ఒక వ్యక్తి భోజనానికి వచ్చినాడు. తీరా వడ్డించిన తర్వాత అతడు నాస్తికుడని తెలిసింది. నాస్తికునికి భోజనం పెడితే దైవద్రోహం చేసినట్లని భావించి, అతన్ని తరిమివేసినాడు. దైవ

ప్రీతమైన ఘనకార్యం చేసినట్లు భావించి తృప్తినొందాడు. రాత్రి వానికి కలలో ఇష్టదైవం కనిపించి, "అరే వానిని 60 సంవత్సరాలు పోషించి, ఒక దినం నీ దగ్గరికి పంపినాను. ఆ భారంకూడా నాపైననే వేసినావు. ఏమి భక్తుడవు నీవు? నేనే అతన్ని పోషించకపోతే ఇన్నేండ్లు జీవిస్తాడా? అంత మాత్రం వివేకం లేదా?" అని మందలించాడు.

ఒక సాధువు స్నానానికి వెళ్లాడు. ప్రవాహంలో తేలు కొట్టుకొనిపోతూ ఉండడం చూచాడు. దాన్ని చేతితోతీసి గట్టున వేసినాడు. తేలు కుట్టింది. ఎండకు ఇసుక కాలుతుంది. అయ్యో, అని మరల దాన్ని నీళ్లలోకి వేశాడు. మరల కాటేసింది. ప్రక్కనున్నవ్యక్తి "సాధుమహాత్మా! ఎందుకు బాధ స్తం అది దుష్టజంతువు. దాని జోలి నీకెందుకు? అన్నాడు. కాని సాధువు యిచ్చిన జవాబు.—

తే॥ గీ॥ బెడ్డవాడు వదలడు తన బెడ్డను కదా!
మంచివాడు తన మంచిని మాననగునే?
వెధవ పురుగది తన పట్టు విడువకున్న
భక్తుడను నానిష్ఠ బాయగలనే?

'అద్వేష్టా సర్వ భూతానాం మైత్రః కరుణ పవచ' అంచును గీత బోధకు, అతండేతాన్ నిలుచుండె సజీవమై. జీవనం సర్వభూతేషు (గీ॥ 7 అ 9 శ్లో) అన్నిటిని బ్రతికించేవాడు దేవుడు కదా! కాదు కాదు ఆయనే జీవనం. ప్రతిరూపంలో 'జీవనం' రూపంలో ఉన్నాడు. ఈ సత్యాన్ని దర్శించిన భక్తుడు ఏ ప్రాణిని ద్వేషించడు.

## 2. మైత్రి

సర్వభూతానాం మైత్రిః-భక్తుని రెండవ లక్షణము సర్వభూతముల యందు మిత్రభావము కలిగియుండుట మైత్రి. సూర్యభగవానునికి 'మిత్ర' అని పేరు వుంది. సర్వభూతములకు మిత్రుడు సూర్యుడు. ఆయన ఎట్టి భేదభావం చూపక అందరికి ప్రకాశాన్ని అందిస్తాడు. స్వార్థపరత్వం లేక మిత్రభావం చూపగల్గాలి. సూర్యుడెట్లా అందరికి ఎట్టి ప్రతిఫలాపేక్ష లేక తన కాంతిని ప్రసరిస్తాడో, అట్లాగా సర్వభూతముల యెడ మిత్రభావం చూపగల్గాలి.

తనతో సమానమైన వానితో స్నేహం చేయడం మైత్రి. పెద్దలను, ధర్మాత్ములను, అభివృద్ధి చెందేవారి యెడ చూపే నిస్వార్థ స్నేహభావం, 'ముదిత'. కష్టంలో వున్నవారిని చూచినపుడు కలిగే స్నేహభావం కరుణ. పాపాత్ములను, కుటిలుని చూచినపుడు చూపేభావం-ఔదాసీన్యం లేక తటస్థ భావం.

కుక్కలను, పిల్లులను స్నేహభావంతో చూస్తే, అవి తన స్నేహభావం చూపుతాయి. చెట్లు, చేమలతో స్నేహంతో వ్యవహరిస్తే, అవి మంచి ఫలాలను ఇస్తాయి. ఎక్కువుగా పూలు పూస్తాయి. కనుక ప్రాణ వర్గుపై కూడ మైత్రి చూపాలి. మనము ప్రేమభావం చూపేకొద్ది, మన హృదయము ఉదారము అవుతుంది. ఇతర ప్రాణ వర్గులో పరివర్తిన వస్తుంది. వాని ప్రగతి కిమనము ఎంతో దోహదం చేసిన వారమవుతాము.

మర్యాదపూర్వంగా ప్రక్కింటి వారిని చిరునవ్వుతో పలుకరిస్తే, చిన్న పిల్లలకు చిన్న, చిన్న కానుకలు బహూకరిస్తే, వారెంతో సంతోషిస్తారు.

మొదటి లక్షణమైన 'అద్వేష్టాసర్వ భూతానాం' అనేది. సాధనలో నిషేధాత్మక క్రియ (Nagative morality). దీనికి తోడు నిర్మాణాత్మక క్రియ ఉండాలి. (Positive morality) విధ్వంసక క్రియతో పాటు విధాయక పద్ధతి ఉండాలి. మైత్రి, కరుణ, క్షమ మొదలైనవి అన్నియు విధాయక క్రియకు సంబంధించిన లక్షణాలు. "మిత్రస్య చక్షుషా సర్వాణి భూతాని సమీక్షామహే" (రండి మనమందరము మిత్రదృష్టితో పరస్పరము సమస్తాన్ని దర్శిద్దాము) అని వాజసనేయ సంహితలో వైదికఋషి పిలుపు.

క్రొత్తగా మనయింటి ప్రక్కన ఎవరో చేరుతారు. మర్యాదగా వారిని చూడటం ఏమైన సహాయం కావాలా అని వారిని అర్థించడము వలన స్నేహ భావము అభివృద్ధి అవుతుంది. క్రొత్తగా వచ్చిన వ్యక్తి సంతోషిస్తాడు. ఈ ప్రకారంగా ఎట్టి అరమరికలులేక స్వార్థభావంలేక మానవతాదృష్టిని ప్రదర్శించడంలో మనము అందరి హృదయాలను ఆకట్టుకుంటాము.

## 3. కరుణ

హృదయ వికాసంలో మైత్రికి పైమెట్టు కరుణ. మైత్రి కరుణగా ఫలిస్తుంది. స్నేహితుడు కష్టపడుతూఉంటే ఆ కష్టాన్ని బాపేటందుకు అతనికి

సాయపడుతాం. ప్రక్కఇంట్లో ఉండే స్నేహితునికి జ్వరం వచ్చింది. అతడు స్వయముగ బయటికి వెళ్లలేడు. అతనికి ఆహారము యిచ్చి డాక్టరు దగ్గరకు తీసికెళ్ళి వైద్యం చేయించడం కరుణగా చెప్పవచ్చు. స్నేహంలో 'దయ' ఉండవచ్చు. సహాయం చేయకపోవచ్చు కాని కరుణలో దయాభావం సేవా భావంగా రూపొందుతుంది. సేవాభావంతో కూడిన దయ కరుణగా పరిణితి చెందుతుంది క్రియాత్మకమైనపుడు దయ కరుణగా మారుతుంది.

ఒక రైతు బండి తోలుకొని పోతున్నాడు. అది భర్తీ బండి. మార్గ మధ్యంలో ఒరదగుంటలో చిక్కుకొని పోయింది. ఎద్దులు బండిని లాగలేక పోతూన్నాయి ఎద్దులను తోలుతూనగలపై కూర్చుంటే, వెనుకనుంచి ఎవరైన బండిని తోయాలి. లేకుంటే బండి కదలదు.

దారిన వచ్చిపోయేవాళ్లు అయ్యో పాపం అంటారేకాని ఒక్కరికి బండిని వెనుకనుండి తోయాలని తోచదు. అందరు కబుర్లు చెప్పుచున్నారే కాని ఒక్కరు సాయపడలేదు.

ఒక యువకుడు వచ్చి పరిస్థితి చూచినాడు. "తమ్ముడూ ఎందుకు చింతిస్తావు? ఎద్దులు తోలు. నేను వెనుకనుండి బండిని నెట్టుతాను" అంటూ ఒక పట్టు పట్టాడు. బండి కదిలింది. దయ కార్యరూపం ధరించి కరుణగా మారింది.

అట్లాంటి ఉదంతాన్నే ఏసుక్రీస్తు 'ది గుడ్ సమారిటన్ (The Good Samaritan) అనే కథలో ప్రస్తావిస్తాడు.

ఒక వ్యాపారి పట్టణంనుండి సరుకులుకొని స్వగ్రామానికి వస్తున్నాడు. త్రోవలో దొంగలు అతన్ని దోచుకొని బాగా కొట్టి గాయపరిచారు. అతను క్రిందిపడి ఉండినాడు. తెలివిలోలేడు. ఒక టీచరు ఆ గాయపడిన వ్యక్తిని జూచి "అయ్యో! పాపం" అని తనకు స్కూలు పనిఉందని వెళ్లిపోతాడు. అట్లాగే ఒక ప్రీచర్ (Prea her), ఒక రైతు "అయ్యో! పాపం" అని అతనికి సాయం చేయకుండా వెళ్లిపోతారు.

ఇంతలో ఒక సమరిటన్ (Samaritan) తన గుఱ్ఱపుబండిని దిగివచ్చినాడు. అతను బాగా త్రాగి మత్తులో వున్నాడు. అతను గాయాలతో ఉండింది గమనించి గాయపడిన వ్యక్తిని తనబండిలోకిచేర్చి. దగ్గరలోనున్న ఇన్

(inn) కి తీసుకొని వెళ్లి, అతనికి ప్రాథమిక చికిత్సచేసి. ఆ ఇన్ యజమానికి చెప్పి, అతనికి తగినచికిత్స చేయుటకు తర్వాత అయ్యే ఖర్చుకు కొంతడబ్బు కూడా ఇచ్చాడు. ఇది నిజమైన కరుణ దృష్టాంతము.

## 4. మమకారం ఉండరాదు

దయ, కరుణ ఉండవచ్చు కాని మమకారం వుండరాదు. మమకారం ఒక వస్తువుకాదు. నాది అనే బుద్ధి మమకారం. మమకారం మమత్వబుద్ధిలేని వాడు 'నిర్మముడు.'

నోటితో "నాది" అని అనకుండా ఉన్నంతమాత్రాన మమకారవృత్తి వారికి లేదనికాదు. మమకారము మనసుకు సంబంధించినది. కారు తనదికాదు, దాని ఓనరు వేరేఉన్నాడు. కాని డ్రైవరు నాకారు అనడం ఉంటుంది. ఆవులు మేపేవారు "మా ఆవులు" అనడం తటస్థిస్తుంది. బాడుగయిండ్లను "నా ఇల్లు" అనడం జరుగుతుంది. కాని వీరందరిలో మమకారంలేదు. నిర్మముడు బయటికి "నాది" అనినా మనసులో "మమ" అనుకోడు. ఒకతల్లి తన కొడుకుపైచూపే కరుణ మమకారంతో కూడింది. ఒక డాక్టరు రోగిని చాలా శ్రద్ధగా చూస్తాడు. ఆపరేషన్ చేస్తాడు కాని అతనికి మమకారములేదు. అదే డాక్టరు తన కొడుకుకు ఆపరేషన్ చేయాల్సివస్తే జంకుతాడు. ఇక్కడ ఈ జంకుకు కారణం మమకారము.

భరతుడు తల్లిలేని జింకపై దయజూపాడు. దాన్నిరక్షించాడు. పాలన, పోషణ చేశాడు. కాని "నేను లేకపోతే ఈ జింక గతియేమి?" అనుకున్నాడు. మమకారపాశానికి బద్ధుడై చనిపోయేటపుడు జింకను స్మరిస్తూ మరుజన్మలో జింకయై పుట్టాడు.

ద్రోణుడంతటివాడు పుత్రమమకారముతో హతమయ్యాడు.

మార్కండేయ పురాణంలో ఒక దృష్టాంతం ఉంది. తన యింట్లో ఒక ఎలుక ఉంది. తాను పెంచే చిలుక ఉంది. చిలుకను పిల్లి పట్టుకోపోతే ఆగ్రహం. ఎలుకను పట్టితే "ఆయుషు తీరిపోయింది" అంటాడు. ఈ వ్యత్యాసానికి కారణం "చిలుకను తాను పెంచడము." కనుక బంధించేది వస్తువు కాదు. వస్తువుపై మానవునికుండే మమకారం.

ఒకామె ఆస్పత్రిలో బిడ్డను కనింది. నర్సులంతా బిడ్డకు ముద్దు ముచ్చటలు చూపుతారు. అకస్మాత్తుగా ఆ బిడ్డ చనిపోయింది. ముద్దుచేసిన వారెవ్వరు ఏడ్వరు. ఏడ్చేది తల్లి. వారికి మమకారం లేదు. తల్లికి మమకారం ఉంది. తల్లిలో మమకారం ఉంది. కరుణ ఉంది. కాని భక్తునిలో మమకారం లేదు. కరుణఉంది.

భక్తునిలో 'నాది' అనే భావంలేదు. అంతా "నీది" భగవంతునిది. కనుక భక్తుడు నిరహంకారి. అంతా భగవంతునిదే అనేభావం. "తాను", "తనది" అని వ్యవహరించే దారా, పుత్ర, ధనాలపై మమకారం లేదు. అవి వున్నా, ఊడిపోయినా, అతడు బాధపడడు.

## 5. అహంకార ముండరాదు

భక్తునికి మమకారమేకాకుండా అహంకారముండరాదు. అహంకారము రజోగుణానికి సంబంధించింది. భక్తుడు సత్వగుణసంపన్నుడు. అహంకారము పూర్తిగా పోవాలి. 'నేను' అనుభావమున్నంతవరకు భగవంతునిప్రీతి లభించదు. ద్రౌపది నిండుసభలో వివస్త్రగా చేయబడుచుండిన సమయంలో ఒకచేత కుచ్చిళ్ల గట్టిగా పట్టుకొని, ఒకచేయి కృష్ణా కాపాడు అని దీనహృదయయై ఆక్రోశించింది. ఫలితములేదు ఎప్పుడు రెండుచేతులెత్తి నమస్కరించిందో అపుడు కృష్ణునికి అనుగ్రహం కల్గింది. అట్లాగే గజేంద్రుడు తాను వేయిగజములకు రాజు అని, వేయేండ్లు మకరంతో పోరుసల్పి, అలసి. తన అహంకారము పూర్తిగా నశించ "నీవే తప్ప నితః పరం బెరుగ మన్నింపన్ దగున్ దీనునిన్ రావే ఈశ్వర కావవే వరద" అన్నప్పుడు భగవంతుడు కదలి వచ్చి తన్ను రక్షించగల్గినాడు.

రాజ సభలో భోజరాజు ఒక ప్రశ్న వేసినాడు. "మీలో ఎవరైనా స్వర్గానికి పోతారా?" అని. ఎవరు బదులు చెప్పలేదు. కాళిదాసు లేచి "నేను పోతే పోవచ్చు" అన్నాడు. అందరికి ఆశ్చర్యం కల్గింది. "నీవు నీ మాటను ఎట్లా సమర్థించు కుంటావు?" అని రాజు ప్రశ్నవేస్తే కాళిదాసు జవాబు చెప్పాడు. "నేను" అనే అహంకారముపోతే స్వర్గానికి పోవచ్చు అని సమర్థించుకున్నాడు.

క్రైస్తవమత చిహ్నము క్రాసు (Cross +.) 'I' అనే అక్షరము అహంకారమునకు చిహ్నము. ఈ I ని అడ్డ గీతతో కొట్టివేస్తే అహంకారాన్ని నాశనంచేసినట్టే కదా? కనుక క్రాసు + నిస్వార్థతకు చిహ్నము.

ఫుట్‌బాలు గాలితో నిండా ఉన్నప్పుడు దానికి కాలితన్నులు తప్పవు. ఎప్పుడైతే గాలిపోతుందో ఆబంతిని తాకమన్నా తాకరు.

కనుక "నేను" చచ్చినపుడే భక్తునికి భగవదనుగ్రహం లభిస్తుంది. "నేను" "నీవాడను. నీ కరుణలేకున్న నేనేమి చేయగలను? "నేను" "నాది" అనే భావం పోయి అంతానీదే, అంతానీదే నేను కేవలం నీ చేతిలోని ఉపకరణాన్ని అనే సర్వసమర్పణ భావం కలిగినపుడు భక్తుడు భగవంతునికి ప్రీతి పాత్రుడౌతాడు.

## 6. భక్తుడు సుఖ దుఃఖ సముడు

సుఖ దుఃఖాలకు చలించనివాడే జ్ఞాని. అతడే భక్తుడు. అతనే కర్మ యోగి. అతనే ముక్తుడు. సామాన్య లౌకిక రంగములో కూడా ఈ యోగ్యత అవసరం. దుఃఖమువస్తే క్రుంగిపోకూడదు. సుఖంవస్తే పొంగిపోకూడదు.

ధర్మరాజు కృష్ణుని సవినయముగా అభ్యర్థించాడు. "మహానుభావా! సుఖదుఃఖాలలో నేను సంచలనం పొందక, ధర్మాన్ని వదలకుండా, స్థిరంగా ఉండగల్గే ఏదైనా మంత్రము ఉపదేశించండి." అని అడిగాడు. కృష్ణభగవానుడు కాగితములో ఏదో వ్రాసి, దాన్ని మూసివేసి, "ధర్మరాజా! నీకు అట్టి సందిగ్ధ పరిస్థితి కల్గినపుడు, ఈ కాగితం తీసిచూడు" అని చెప్పాడు. ఒక సందర్భంలో ఇట్లాంటి సందిగ్ధ పరిస్థితి ఏర్పడింది. అపుడు ధర్మరాజు కాగితం విప్పి చదివినాడు. అందులో ఇట్లా ఉంది "ఇది ఇట్లనే ఉండదు. సుఖ దుఃఖాలు అశాశ్వతాలు. అవి ఎపుడు అట్లాగే ఉండవు "ఆగమా, అపాయినః, అనిత్యాః" అని గీతలో భగవానుడు సెలవిచ్చాడు. కనుక ఓపిక పట్టితే అవే పరిష్కరించబడుతాయి. అనీబిసెంటమ్మ ఒక ముసలావిడకు ఇట్లాంటి మంత్రాన్నే ఉపదేశించింది. 1. This too will pass away 2. Face evenrs boldby 3. Think it is nc worse 4 Everything comes for your good. 1. అనగా ఇది ఇట్లా ఉండదు 2. పరిస్థితులను ధైర్యంతో ఎదుర్కొ 3. ఇంతకన్నా విపరీతపరిస్థితులు కలుగలేదని తృప్తిగాఉండు. 4. అంతా నీ మంచికే వచ్చిందనుకో.

ఒక ధనవంతుడుండేవాడు. ఆయన పరమభక్తుడు జ్ఞాని. ఒకదినం ఆయన పనిచూసుకుంటూ ఉండగా ఒక టెలిగ్రాం వచ్చింది. దాన్ని చదివి మడిచిపెట్టి తనపనిచూసుకుంటూ ఉన్నాడు. మరికొంతసేపటికి మరొక టెలిగ్రాం వచ్చింది. దాన్ని చదివి మడిచిపెట్టి పనిచూసుకుంటూ వున్నాడు. మేనేజరు ఆశ్చర్యంతో "స్వామీ! ఏమని టెలిగ్రాములు రెండు వచ్చాయి. ఏమి విశేషము?" అని అడిగాడు "ఏమీలేదు. మనసరుకు తెస్తూన్న 'ఓడ నడిసముద్రంలో మునిగిపోయిందట" అని మొదటి టెలిగ్రాము, ఓడలో నా కుమారుడు కూడా వస్తూవుండినాడు. రెండవ టెలిగ్రాములో మునిగి పోయింది మనకు సంబంధించిన ఓడ కాదు. మనఓడ రేవుచేరింది. అబ్బాయి క్షేమంగా వున్నాడని రెండవ టెలిగ్రాములో వార్త," అని చెప్పాడు షావుకారు.

మునిగింది తేలింది ఓడకాదు. నా మనఃస్థితి. ఓడమునిగింది నాకు సంబంధించింది అనుకొన్నపుడు, నా మనఃస్థితి చూసుకున్నాను. మనసు స్థిమితంగావుంది. అట్లాగే మునిగిన పడవ నాదికాదు అనుకున్నపుడు కూడా నా మనస్సు స్థాయిలోనే వుంది. అంతా దైవానుగ్రహము. చింతిస్తే పోయేది కాని, సంతోషిస్తే వచ్చేదికాని, ఏమీలేదు. అంతా భగవదిచ్ఛ. 'నా' అనే భావం నాలోవున్నంతవరకూ ఈ మనసు పొంగుతూవుంటుంది. క్రుంగుతూ ఉంటుంది. "నా" అనేది లేనపుడు మనసు ద్రష్టగా మాత్రమే వుంటుంది. సమభావనయే బ్రహ్మభావన. ఆ భావన ఉన్నపుడు ఏమి జరిగినా సాక్షిగా చూస్తూంటాము" అని అన్నాడు ఆ షావుకారు భక్తుడు.

జ్ఞానియయిన ఆ షావుకారు సముద్రములోని గండశిలవలె సుఖదుఃఖాల తాకిడికి తట్టుకొని నిబ్బరంగా నిండుగా ఉండినాడు.

కనుక భక్తుడు సుఖదుఃఖాలను సమంగా చూస్తాడు. దుఃఖమువస్తే కుంగడు. సుఖంవస్తే పొంగడు. అట్లాంటి భక్తుడే భగవంతునికి ప్రియతముడు.

ప్రఖ్యాత భారత స్వతంత్ర సమరయోధుడు, శ్రీ వల్లభభాయి పటేలు న్యాయవాద వృత్తిని నిర్వహించే కాలంలో ఒకదినం హైకోర్టులో ఒక ఖూనీ కేసు వాదిస్తూన్నాడు. ఒక టెలిగ్రాం వచ్చింది. దాన్ని చదివి మడిచిపెట్టి కేసు వాదనచేశాడు. ఆ టెలిగ్రాంలో వారి భార్య చనిపోయినట్లుగా ఉంది. సామా

న్యానికి సంక్షోభం కలిగించేవా_ర్త పటేలుగారిపై యే మాత్రం ప్రభావం చూప లేదు. వారి మనసు స్థిరంగా ఉంది.

ఇట్లాంటి మహాత్ములే సుఖదుఃఖసములు. నడిసముద్రంలో పర్వతము ఎన్నిఅలల తాకిడికైన సంచలనం పొందనట్లు, భక్తాగ్రేసరులు. జ్ఞానులు సుఖ దుఃఖాలపట్ల సమభావంతో వుంటారు.

## 7. భక్తుడు క్షమాగుణ శీలి

'క్షమ' ఓరిమికి పరాకాష్ఠ. ఎంతటి అవమానాన్నిగాని, ఎంతటి బాధను గాని సహిస్తు, తమ బాధకు. అవమానానికి, కారణభూతులైన వారి యెడ ఎట్టి ప్రతీకారభావం లేకుండా, క్షమించగల వారు ధీరులు, అందుకే విష్ణు సహస్ర నామాల్లో విష్ణువు. 'క్షమిణాంవరః' అని కీ_ర్తింపబడినారు.

శ్లో॥ సహనం సర్వభూతానాం, అప్రతీకారపూర్వకం।
చింతానిలాపరహితం, సా తితీక్షా నిగద్యతే॥

అని ఆచార్య శంకరులు, సహనాన్ని, నిర్వచించారు జరుగుతూన్న బాధలగురించి, చింతించక, విలపించక, ప్రతీకారము తలంచక. సహిస్తూ వుండగల్గుట క్షమా గుణంలోని అంతర్యం.

భూమాత 'క్షమ' అని ప్రశంసించబడింది. తన సంతానం తన్ను ఎంత బాధిస్తున్నా, ఎంత అపవిత్రం చేస్తూన్నా, తన సంతానం యొక్క క్షేమాన్నే సర్వదా అభిలషిస్తుంది కాబట్టి పృథ్వీమాతను క్షమా దేవిగా కీ_ర్తించారు.

ఏసుక్రీస్తు, తనను వాడి ములుకులతో _స్తంభానికి బిగగొట్టి తనను ఎన్నెన్ని అవమానాలకు గురిచేసిన వారిపై ఎట్టి ద్వేషభావం లేక "ప్రభూ నన్నుహింసిస్తూన్నవారు అజ్ఞానులు వారిని క్షమించు వారిని ఆశీర్వదించు" అంటూ ప్రాణత్యాగం చేసిన పరమ కరుణామూ_ర్తి (Lord they know not what they do. pray bless them.)

అజ్ఞానానికి పలం క్షమ దాన్ని అవలంబించిన వారికి ఏ దుర్జనుడు ఏమీ చేయలేడు. క్షమాశీలుర సాన్నిధ్యంలో దౌర్జన్యం అణగిపోతుంది. శాంతించిపోతుంది.

ఇందుకు దృష్టాంతం యామునాచార్యులు.

యామునాచార్యులు విశిష్టాద్వైత స్థాపనాచార్యులైన రామానుజుల వారికి గురువు. మహారాజుగా వుండి, రాజ్యాన్ని త్యాగంచేసి, రంగనాథుని సేవించిన భక్తాగ్రేసరుడు. ఒకరి జోలికిపోరు, ఒకరిని నొప్పించరు. కాని ఆ గ్రామస్థులలో కొందరికి ఆచార్యుల వారిపై అసూయ కలిగింది. వారిని అవమానించదలచారు.

ప్రతినిత్యం ఆచార్యులవారు కావేరిలో స్నానం చేస్తూ ఒక మార్గం గుండా వెళ్లేవారు. ఆ మార్గంలో చిన్నసందువుంది. ఆ మార్గానికి అడ్డుగా చెప్పుల తోరణం తలకు తగిలేటట్టుగా కట్టబడింది. ఆచార్యులవారు ఆ మార్గంలో వచ్చేటప్పుడు ఆ చెప్పులు వారి తలకు తగులుతాయి. అప్పుడు చప్పట్లు కొట్టి ఆనందించాలని వారి పథకం.

యామునాచార్యులు స్నానంచేసి తడిబట్టలను, చేతిచెంబులో నీళ్లు తీసి కొని వచ్చేటప్పుడు, నాలుగు అడుగుల దూరంలో చెప్పుల తోరణం వారి కంటబడింది. చేతిలోని చెంబుక్రింద పెట్టి సాగిలపడి ఆ చెప్పుల మాలకు నమస్కరించారు. యామునాచార్యులు కేవలం భక్తుడే కాక, కవికూడా. అప్పుడు వారి నోటి నుండి ఒక శ్లోకం వెలువడింది.

శ్లో॥ కర్మావలంబకాః కేచిత్, కేచిత్ జ్ఞానావలంబకాః।
వయంతు హరిభక్తానాం పాదరక్షావలంబకాః॥

ఈ శ్లోకం భావం ఏమిటంటే సమర్థులైన కొందరు పుణ్యాత్ములు కర్మ యోగాన్ని అనుసరిస్తారు. మరికొందరు జ్ఞానయోగాన్ని అనుసరిస్తారు. నాబోటి అసమర్థులకు ఈ భక్తుల పాదరక్షలే గతి, వాటి నాశ్రయించి, నా వంటివారు ఉద్ధరించబడతారు.

ఆత్సితుల హృదయాలు కుమిలి పోయాయి. మత్సర గ్రస్తులు మాడి పోయారు. ద్వేషం కర్పూరం లాగ హరించిపోయింది.

రామానుజులవారి బోధన గురువు యాదవ ప్రకారులు, రామానుజులపై అసూయతో ఆతన్ని చంపటకు ప్రయత్నించారు. వారి పన్నుగడ ఫలించ లేదు. అట్టి గురువును క్షమించగల్గిన, అహింసామూర్తి రామానుజులు. అట్లాగే రామానుజునులను అంతమొందించ దలచి, అసూయాగ్రస్తుడైన,

శ్రీరంగేశుని పూజారి రామానుజులకు విషప్రయోగం చేశాడు. రామానుజులు విషపూరిత తీర్థం స్వీకరించారు. కాని రంగనాథుని అనుగ్రహం వలన ఆతీర్థం అతనికి అమృతమైంది. రామానుజులను ఇంటికి భోజనానికి పిలిచి, అన్నంలో విషంపెట్టి చంపాలనుకున్నాడు కాని, పూజారి భార్యామణి, ఆ విషాన్నాన్ని భోజనంచేయనివ్వలేదు. రామానుజుల హృదయం పరితపించింది. అన్యాయంగా తన్ను చంపాలన్న ఆ పూజారిపై ఆతనిహృదయం కరుణతో నిండిపోయింది. రంగనాథా! ఈ అజ్ఞానిని క్షమించమని ప్రార్థించారు. తుదకు ఆ పూజారి తనతప్పు తాను తెలుసుకొని, అతి దీనుడై రామానుజుల పాదాక్రాంతుడై తన కన్నీటితో వారి పాదాలను కడిగివేశాడు. క్షమాగుణశీలుర సన్నిధిలో ద్వేషాలు, అసూయలు కరిగిపోతాయి.

శ్రీమద్రామాయణం యుద్ధకాండలో క్షమాగుణాన్ని గురించి సీతాదేవి అంజనేయునికి చెప్పిన ఒక కథవుంది. రావణాసుర సంహారానంతరం, అంజనేయుడు అశోకవనంలోవున్న సీతాదేవికి రావణుని మరణాన్ని గురించి తెలియచేస్తూ, ఇంతకాలం ఆ సీతాదేవిని బాధించిన రాక్షసస్త్రీలను అంత మొందిస్తా ననగా, ఆ సీతమ్మ అంజనేయుని వారించి 'ఋక్షవ్యాఘ్రసంవాదం' అనే కథను చెప్పింది.

ఒక పులి ఒక మానవుణ్ణి తరుముకొనిరాగా అతను ఒక చెట్టెక్కినాడు. అక్కడ ఒక ఎలుగుబంటి వుంది. మానవుడు తనకు చావు తప్పదనుకున్నాడు. కాని ఎలుగుబంటి ఆతనికి అభయమిచ్చింది. పులి చెట్టుక్రింద పొంచి కూర్చునివుంది. రాత్రి అయింది. ఎలుగుబంటు ఇట్లా అన్నది. "మానవా! నేను కొంచెము నిద్రపోతాను నీవు కాపలావుండు, నేను నిద్రలేచిన పిదప నీవు నిద్రపో నేను కాపలా వుంటాను". మానవుడు అంగీకరించాడు. ఎలుగు బంటు నిద్రపోయింది. అప్పుడు పులి మానవుని వుద్దేశించి ఇట్లా అంది. "మానవా! ఎలుగుబంటును క్రిందికి త్రోసివేయి. దాన్ని నేను తిని వెళ్ళి పోతాను. నీ దారి నీవు పోవచ్చు" అన్నది. మానవుడు పులి మాటలకు మోసపోయి ఎలుగుబంటును క్రిందికి త్రోసినాడు. ఎలుగుబంటు మేల్కొని తన వాడియైన గోళ్లతో చెట్టు కొమ్మను పట్టుకొని పైకివచ్చి కూర్చుంది. అపుడు పులి ఎలుగుబంటుతో అన్నది "చూచినావా! ఏనాటికైన మానవులను నమ్మరాదు. ఇప్పుడైనా వాణ్ణి క్రిందికి తోయి ఇద్దరం వానిని తిందాము"

అన్నది. కాని ఎలుగుబంటు అన్నది "నేను వానికి ఆశ్రయమిచ్చినాను, వాడు ఎట్లాంటివాడైన కావచ్చు. ఆశ్రయమిచ్చినవానిని చంపుట ధర్మము కాదు" అని ఎలుగుబంటు తన్ను చంపదలచిన మానవుని క్షమించింది.

శ్లో॥ న పరః పాప మాధత్తే పరేషాం పాప కర్మణాం।
సమయో రక్షితోవ్యస్తు సన్తః చారిత్ర భూషాణాః॥

యుద్ధకాండ 116

ప్రాజ్ఞుడైనవాడు తనకు అపకారము చేసినవానికి ఎంతమాత్రము ప్రత్య పకారము చేయరాదు, ఉపకారము చేయాలి. కాని అపకారము చేయరాదు.

"క్షమ కలిగిన సిరి గలుగును,
క్షమ గలిగిన వాణిగలుగు సౌఖ్యములెల్లన్
క్షమ కలుగఁదోన కలుగును
క్షమ కలిగిన మెచ్చు శౌరి సదయుడు తండ్రీ." (భాగవతము)

1994 సంవత్సరం జనవరినెలలో వార్తాపత్రికలో ఒక వార్త క్షమా గుణాన్ని ప్రస్తావిస్తూ ఒక ఉదంతాన్ని తెలియజేసింది.

గుజరాత్ రాష్ట్రంలోని ఒకగ్రామంలో హిందూ ముస్లింలకు కొట్లాటలు జరిగాయి. కొందరు ముస్లింలు ఒక హిందూ కుటుంబంలోని ఇద్దరు యువకు లను చంపారు. తల్లిదండ్రులు ఎవ్వరెంత చెప్పినా ఆ హంతకులపై ఫిర్యాదు చేయలేదు. వారిట్లా అన్నారు. హంతకులకు ఉరిశిక్ష పడితే పడొచ్చు. కాని చచ్చిపోయిన మా కుమారులు బ్రతికిరారుకదా! వారేదో ఉద్రేకంతో మా కుమా రులను చంపారు. కాని వారు మంచివారు" అని హంతకులను క్షమించినారు. ఊరిలో పెద్దమనుషుల ముందు ఆ హంతకులు ఆ తల్లిదండ్రులకు పాదాభి వందనము చేసి పశ్చాత్తాపము పొందినారు. ఆ నాటి నుండి వారు హిందువుల యెడ సోదరభావంతో వుంటూ వచ్చినారు.

చెల్లి యుండియు సైరణ చేయునతడు
పేదవడియును, అర్థికి ప్రియముతోడ
తనకుగల భంగి ఇచ్చునతండు పుణ్య
పురుషుడని చెప్పిరార్యులు కురువరేణ్య (భారతం)

## 8. భక్తుడు సదా సంతుష్టుడు

భక్తుడు సదా సంతుష్టుడు. అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు తన హృదయంలో ఉండగ అతని సంతోషానికి తక్కువేమి? "తక్కువేమి మనకు రాము డొక్కడుండువరకు" అనే పరమ విశ్వాసంతో పుష్టినొందిన భక్తునకు ఏమి కొదువ! సంతుష్టుడు అతని చుట్టు ఉండే వారికి సంతోషం పంచిపెట్టు తాడు. వస్తువు తన కేంద్రానికి చేరుట ప్రకృతి నైజం. కనుక సంతుష్టుని దగ్గరకు సంతోషం సహజంగా వస్తుంది.

"సంతుష్టుడీ మూడు జగముల పూజ్యుండు
సంతోషి కెపుడు జరుగు సుఖము" అని అంటుంది భాగవతము

తృప్తి ఉన్న చోట సంతోషము ఎపుడూ వుంటుంది ఆశలేమియే తృప్తికి కారణము.

"వ్యాప్తిం జెందక వగవక ప్రాప్తంబగు లేశమైన పదివేలనుచున్
దృప్తిం జెందని మనుజుడు సప్తద్వీపములనైన చక్కంబడునే"
(భాగవతము)

అసంతృప్తి దుఃఖానికి మూలము. తుదకు అది పతనానికే కారణమవు తుంది.

వింధ్యపర్వత ప్రాంతాలలో ఒకప్పుడు కావలసినంత బంజరుభూమి వుండేది. అక్కడ వుండే జనానికి భూమి ఉపయోగించేది తెలియదు. ఒక వ్యక్తి ఆ ప్రాంతానికి వచ్చాడు. భూమి చాలా సారవంతమైనది. ఆ భూమిని కైవసం చేసుకొవాలని ఆశ కలిగింది. ఆ ప్రాంతపు పెద్ద మనిషితో తన కోరికను వెల్లడించాడు. "ఈ భూమి నీకు ఎంత కావాలో అంత నీకు ఉచితంగా ఇస్తాను. ప్రొద్దున బయలుదేరి సాయంత్రం సూర్యాస్తమయ సమయానికి ఎంత భూమిని చుట్టి వస్తే అంత భూమి నీకు స్వంతం" అని ఆ ప్రదేశాధికైన ప్రభువు చెప్పగ– ఆ వచ్చిన వ్యక్తికి సంతోషం ఇంతా అంతాకాదు.

సూర్యోదయాన బయలు దేరాడు. ప్రొద్దుకూకే సమయం వరకు చుట్టి నాడు. తృప్తి కలుగలేదు. సూర్యుడు అస్తమించబోతున్నాడు. తాను బయలు దేరిన స్థలానికి పరుగుపరుగున వచ్చి "భూమి! భూమి" అంటూ ఆ పెద్దమని

షిని చేరాడు. ఆయాసానికి గుండె ఆగిపోయింది. ఆఖరుకు అతనికి దక్కిన భూమి 6 అడుగులు మాత్రమే.

'అత్యాశా పరమం దుఃఖం నిరాశా పరమం సుఖం' భక్తుడు నిత్య తృప్తుడు. నిరాశ్రయుడు. ప్రాప్తించింది ఈశ్వర ప్రసాదమని భావించేవాడు కనుక అతడికి ఎపుడూ సంతోషమే.

## 9 భక్తుడు యోగి

భక్తుడు నిత్య సంతోషిమాత్రమేగాక అతను యోగి కూడా. "యోగము అంటే చిత్తవృత్తులను నిరోధించుట" అని పతంజలి యోగసూత్రములు నిర్వచించుచున్నవి యమ నియమాదులు యోగికి ఉండవలసిన యోగ్యతలు. అహింస, అస్తేయము, బ్రహ్మచర్యము, సత్యవచనము, అపరిగ్రహము, అను అయిదు యమముయొక్క ముఖ్యలక్షణములు· ఇవి బాహ్యేంద్రియ నిగ్రహానికి సంబంధించినవి. శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము, ఈశ్వర ప్రణిధానము అనేవి దమము (అంతరింద్రియనిగ్రహము)నకు సంబంధించినవి. అనగా భక్తుడు అంతరింద్రియ, బాహ్యేంద్రియ నిగ్రహము కలిగి వుండాలి. సమతా బుద్ధికూడా యోగము అని గీత ప్రవచించింది. ("సమత్వం యోగ ముచ్యతే) "యోగః కర్మసు కౌశలం" అని యోగానికి మరొక నిర్వచనముగ భగవద్గీత బోధించింది. మనసు ఎపుడు స్వాధీనమౌతుందో, అపుడు యోగి చేసే కర్మలు కుశలంగా వుంటాయి. సమభావంతో వ్యవహరిస్తాడు.

ఏకనాథస్వామి మహాభక్తుడు. భాగవతాన్ని మరాఠీ భాషలోనికి అనువదించిన పండితోత్తముడు. ఒకతూరి కాశీ యాత్ర చేసి రామేశ్వరానికి శిష్య సమేతంగావెళ్లుతున్నాడు. గంగాజలంతో రామేశ్వరుని అభిషేకించాలి. త్రోవలో ఎడారి ప్రదేశంగుండా వస్తూన్నాడు. అక్కడ ఒక గాడిద దప్పితో బాధపడు తూవుంది. వెంటనే ఏకనాథుడు బిందెలోని గంగాజలాన్ని ఆ గాడిద నోట్లో పోశాడు· శిష్యులంతా ఆశ్చర్యపడి, స్వామీ! ఈ గంగాతీర్థంతో రామేశ్వరుని అభిషేకం చేయాలి కదా! దాన్ని గాడిదకు పోసినారు" అన్నారు. సర్వభూతాల్లో పరమేశ్వరుణ్ణి చూపగల్గిన ఏకనాథుడు గాడిదలో ఈశ్వరుణ్ణి చూడ గలిగినాడు. "నాయనలారా! ఈ గాడిదలో రామేశ్వరుని చూచినాను· అనగానే అక్కడ ఒక లింగం కనపడిందట! పండితులు కుక్కను, కుక్కను తినేవాణ్ణి

సమభావంతో చూడగల్గుతారు." సర్వం ఖల్విదం బ్రహ్మ" అనే బ్రహ్మభావంతో ప్రవర్తిస్తారు.

భక్తాగ్రేసరుడు త్యాగరాజు యోగి. అపరిగ్రహము అనే గుణంలో పుష్టి నొందినాడు. తంజావూరు రాజు శరభోజి, తన ఆస్థానానికి వచ్చి పాడవలసిందని ధనరాసులు పంపగా, వాటిని నిరసించాడు. దరిద్రంతో కుమిలిపోతున్న త్యాగరాజు నిధులు సుఖము కాదని రాముని సన్నిధి సేవయే సుఖమని తలచినాడు. సోదరులకు కోపంవచ్చింది. త్యాగయ్య అర్చించే విగ్రహాలను కావేరిలో పారవేశారు. త్యాగరాజు వాటికై దేశము వెదికి తుదకు రాముని అనుగ్రహము వలన విగ్రహాలను పొందగల్గినాడు. కనుక భక్తుడు మనోనిగ్రహం కల్గియుండాలి. సర్వభూతముల సమభావంతో ప్రవర్తించ గలగాలి. అట్టి నిశ్చల నిర్మలమైన మనస్సు కల్గి ఈశ్వరార్పణ బుద్ధితో వ్యవహరించే భక్తుడే భగవంతునికి ప్రియతముడు కాగలడు. త్యాగరాజు యోగి కాబట్టే అత్యంత మధురమైన సంగీత శాస్త్రంలో నిష్ణాతుడు కాగల్గినాడు. కీర్తనలతో రామభక్తి సామ్రాజ్యాన్నే పొందగల్గినాడు. కర్మలలో కుశలతను ప్రదర్శించ గల్గిన యోగి త్యాగయ్య.

## 10 భక్తుడు యతాత్ముడు

(అనగా ఇంద్రియ నిగ్రహము కలవాడు)

యతాత్మ అనగా ఇంద్రియ నిగ్రహము కలవాడు. కాని ఎంతటి భక్తుడైనా ఒక్కొక్కతూరి ఇంద్రియములకు వశుడవుతూ వుంటాడు. ఇవన్నీ అతనికి పరీక్షలు. విప్రనారాయణుని వంటి భక్తాగ్రేసరుడు దేవదేవి అను వేశ్యపై వ్యామోహానికి బలి అయినాడు. దైవభక్తుడు దేవదేవి భక్తుడైనాడు. జపించేదానికి ఉద్యమిస్తే అతనికి దేవదేవి కనపడుతుంది. ఎట్టకేలకు రంగనాథుని అనుగ్రహంతో రక్షించబడినాడు.

ఇంద్రియములు అత్యంత బలిష్ఠములైనవి. ఎంతటి వానినైనను తల క్రిందులు చేయగలవు. వ్యాసమహర్షి భారతం వ్రాస్తూ ఒకచోట బలవాన్ ఇంద్రియ గ్రామః విద్వాంస మపి కర్షతి (ఇంద్రియములు అతిశక్తివంతమైనవి. ఎంతటి విద్వాంసుడైనా నరుని అవి మభ్యపరచ గలవు) అని వ్రాస్తే అతని ప్రశిష్యుడైన జైమిని మహర్షి ఏకీభవించక 'విద్వాంసం నాపి కర్షతి' అని

మార్చినాడు. వ్యాసులు దీన్ని గమనించి మిన్నకున్నాడు. కొన్ని దినాలైన పిదప వ్యాసమహర్షి పనిగానే ఒక్కచోటికిపోదలచి ఆశ్రమ పాలనను జైమినికి అప్పజెప్పి వెళ్ళినాడు. వ్యాసులు వెళ్లిన తర్వాత ఒక వృద్ధబ్రాహ్మణుడు ఒక అత్యంత సుందరియైన అమ్మాయి వెంటరాగా వ్యాసాశ్రమంచేరినాడు. సంధ్యా కాలము చీకటి పడనున్నది. తాను మరియొక ఆశ్రమానికి వెళ్లుతున్నానని చీకటివేళ అమ్మాయిని అడవుల్లో తీసికొనిపోవుట మంచిదికాదని రాత్రికి అమ్మాయికి ఆశ్రమంలో ఆశ్రయమిమ్మని జైమినిని అర్థించినాడు. జైమిని అందుకు అంగీకరించినాడు. అమ్మాయికి రాత్రికి కావలసిన ఆహారాన్ని సమకూర్చి పర్ణశాలలో ఒక గదిలో పండుకొమ్మని లోపలి గడియవేసికొమ్మని చెప్పి తాను ఆశ్రమము వెలుపల పడుకున్నాడు.

కాని జైమినికి నిదుర రాలేదు. గదిలోనున్న అమ్మాయి సౌందర్యానికి మోహితుడైనాడు. మనసు నిగ్రహించేదానికి ఎంతో ప్రయత్నించినాడు. కాని సాధ్యము కాలేదు. ఎట్లాగైనా అమ్మాయిని పొందాలని నిశ్చయించి వాకిలి తట్టినాడు. వాకిలి తెరువలేదు. అట్లా కాదని పర్ణకుటీరము పైకెక్కి పైనున్న ఆచ్ఛాదము తీసివేసి లోపలికి దుమికినాడు. ఆశ్చర్యము అమ్మాయి బదులు వ్యాసభగవానుడే అక్కడ కూర్చొనియున్నాడు. జైమినికి తానుచేసిన పొరపాటు తెలిసి వచ్చింది. వ్యాసుల పాదములపైబడి "అపికర్షతి, అపికర్షతి" అని గురువుల పాదములను కన్నీటితో కడగినాడు.

కనుక భక్తుడు ఇంద్రియ నిగ్రహము తప్పక కల్గియుండవలెను. కామ క్రోధ, లోభ మోహాదులనుజయించి యుండవలెను. ఇట్లు ఇంద్రియ నిగ్రహము కల్గి భగవంతునిపై మనసు సంలగ్నము కావించు భక్తుడు భగవంతునికి అత్యంత ప్రియతముడు.

## *11 భక్తుడు ధృఢ నిశ్చయుడు*

భక్తుడు ధృఢనిశ్చయుడు. పట్టు పట్టనిది పరమాత్మ దొరుకుతాడా? కరో యా, మరో! విజయమో వీరస్వర్గమో! Do or Die. ఇది ధృఢ నిశ్చయము.

రుక్మిణీదేవి శ్రీకృష్ణుని వరించినది. అతన్ని తప్ప వేరొక్కరిని వివాహం చేసుకొనే ప్రశ్న లేదని ధృఢంగా నిశ్చయించింది. తానే చొరవ తీసికొని

బ్రాహ్మణుని కృష్ణుని దగ్గరకు పంపింది. వివాహ వేళ దగ్గర పడుతూవుంది. మంగళగౌరీవ్రతం చేయుటకు పట్టణానికి సమీపంలో వున్న దేవాలయానికి వెళ్లింది. ఒకటే నిశ్చయము. "వ్రత చర్యన్ నూరు జన్మంబులు నిను చింతించుచు ప్రాణమున్ విడిచెదన్" అని ధృఢనిశ్చయముతో గౌరీపూజకు పూనుకొంది. ఆ ధృఢనిశ్చయ ఫలం, శ్రీకృష్ణుని ఆగమనం. ద్వారకను వదలి కృష్ణుడు కుండిన నగరం చేరి, రుక్మిణీదేవిని రక్షించి ద్వారకానగరం చేరినాడు.

దృఢనిశ్చయానికి ప్రతీక బాల ధృవుడు. అమ్మ తపస్సు చేయమన్నది. తండ్రి తొడ నెక్కాలనే ధృఢ నిశ్చయంతో వనాలకు వెళ్లాడు. తత్ఫలితంగా తండ్రి తొడనుకాదు శ్రీ మహావిష్ణువు వడిలో కూర్చొన్నాడు,

పరిణయ మాడితే శివుడినే పరిణయమాడుతాను లేకుంటే కన్యగా నే ఉంటానని ప్రతిన చేసింది పార్వతీదేవి. నిశ్చయం ఫలించింది.

"విద్యాతురాణాం నసుఖం ననిద్రా" నేను ఫస్టుక్లాసులో తప్పక ప్యాస వుతాను. ఇది ఆదర్శ విద్యార్థి నిశ్చయము.

కొందరు నిశ్చయం చేస్తారు కాని వివేకం లోపిస్తుంది. ఒకాయన పొలంలో బావి తవ్వాలనుకున్నాడు. వాస్తును సంప్రదిస్తే 100 అడుగులు త్రవ్వితే పుష్కలంగా నీరు లభిస్తుందని తెలుసుకున్నాడు. బావి త్రవ్వటం ప్రారంభించాడు. 10 అడుగులు త్రవ్వేటప్పటికి బండపడింది. మరొకచోట పదడుగులు త్రవ్వాడు. మొత్తం 100 అడుగులు త్రవ్వాడు. ఫలం యేదీ? ఒకేచోట 100 అడుగులు త్రవ్వితే నీరు పడుతుందేకాని 10 చోట్లలో త్రవ్వితే గుంతలు పడుతాయేకాని నీరు పడదు. "ఒకే చోట లోతుగా త్రవ్వు" అనే ఆంగ్ల సామెత వుంది, (Dig deep down at one place)

ఆ మంత్రంలో ఏముందో, ఈ మంత్రంలో ఏముందో, ఈ స్వామి ఏమి చెప్పుతాడో ఆస్వామి ఏమి చెప్పుతాడో అని నిశ్చయ బుద్ధిలేక కాలాన్ని ధనాన్ని వృధాచేస్తారు, కొందరు మందబుద్ధులు.

"నిశ్చితార్థంబు వదలరు. నిపుణమతులు"— ఇది భర్తృహరి సుభాషితం. ధృఢవ్రతుడు కాని వాడు ఏమి సాధించలేడు. కనుక ధృవునివలె, రుక్మిణి వలె భక్తుడు దృఢవ్రతుడు కావాలి అపుడు అతడు భగవంతునికి ప్రియతముడు కాగలడు.

# 12 సర్వ సమర్పణ బుద్ధి కలవాడు, భక్తుడు

"మయ్యర్పిత మనోబుద్ధిః" అనేది భక్తుని లక్షణాలలో ప్రముఖమైనది. ఇదే సర్వసమర్పణ. ఇంకొకచోట మయ్యేవమన అధత్స్వ మయిబుద్ధి. నివేశయ నివశిష్యసి మయ్యేవ" అని గీతలో చెప్పబడినది. ఇంద్రియాలను శాసించేది మనస్సు. మనసును అదుపులో పెట్టగలిగేది బుద్ధి. బుద్ధిని ఆత్మకు అర్పణచేస్తే ఇంద్రియాలు, మనసు, బుద్ధి అన్ని ఆత్మలో లీనమవుతాయి. ఇంక జీవుని అత్మ రంగము ఖాళీయై అందులో భగవంతుడు ప్రవేశిస్తాడు. భగవంతుని చేతిలో ఈ కరణాలన్నీ ఉపకరణాలవుతాయి. ఇక "నేను"కు తావేలేదు. ఇట్లాంటి సర్వసమర్పణ గావించిన భక్తుడే భగవంతుని ప్రియతముడు.

ఒకతూరి గోపికకు మురళికి సంవాదము జరిగింది. గోపిక అన్నది. "మురళీ నీవు ఎంత అదృష్టవంతురాలివే! స్వామి నిన్ను విడచి ఉండడు. ఎపుడు నిన్ను అధరాలకు అంటించుకొనియుంటాడు. పాడనపుడు తన నడుముకు కట్టిన వల్లెలో చెక్కుకొనివుంటాడు. ఇంత ప్రియాతిప్రియంగా కృష్ణుడు నిన్ను చూచుకొనేదానికి కారణం చెప్పవా? అందుకు మురళి సమాధానం చెప్పిందట "అక్కా! ఏమీలేదు నేను స్వామికి సర్వసమర్పణ గావించుకొనియున్నాను. నా శరీరము డొల్ల. నాలో అన్ని రంధ్రాలే. స్వామి పలికించినట్లెల్ల నేను పలుకుతూ వుంటాను. "నేను" అనేది నాకు వేరే లేనేలేదు. స్వామి ఎట్లా పలికిస్తే అట్లా పలుకుతాను" అన్నదట. పిల్లి కూనలు కేవలము అసక్తులు. అవి కదలలేవు– తల్లి వాటిని నోటితో కరచుకొని తిప్పుతుంది. పిల్లికూనలు కేవలం తల్లిపైననే ఆధారపడివుంటాయి. అట్లాగే భక్తునికి "నాది" అంటూ ఏదీ లేదు. నిరహంకారి మమకారం లేదు. అతను సర్వస్వము స్వామికి అర్పణము చేసినాడు. అతను కేవలం భగవంతుని చేతిలోనిపనిముట్టు.

ఇట్లా తన మనస్సును స్వాధీనం చేసుకొమ్మని ఆదిశంకరులు శివుని ప్రార్థిస్తాడు.

శ్లో॥ సదామోహాటవ్యాం చరతి, యువతీనాం కుచగిరౌ
నట త్యాశాశాఖాసు అటతి, ఝటితి, స్వైరమభితః
కపాలిన్, భిక్షోమే హృదయ కపిం, అత్యంత చపతిం
దృఢం భక్త్యా బద్ధ్వా శివభవదధీనం కురువిభో!

(శివానందలహరి)

శివా! ప్రారబ్ధం కొద్దీ మనసు అనే కోతి నాకు దాపురించింది. అది ఒక క్షణమైన వూరకుండదు. మోహమనే అడవిలో సంచరిస్తూంటుంది. యువతుల కుచ గిరులపై ఆడుకుంటుంది. ఆశలనే తరుశాఖలపై ఎగిరి గెంతులు వేస్తుంది. దీని బాధ పడలేకున్నాను. నా మనవి ఆలకించు- నీవు ఆది భిక్షువు. నా మనస్సనే కోతిని, భక్తి అనే త్రాటితో కట్టి స్వాధీనం చేసుకొని బాగా ఆడించు. నీకు దండిగా భిక్ష దొరుకుతుంది. నాకు మనసు బెడద తప్పిపోతుంది. ఇది ఇద్దరికి లాభదాయకమైన పద్ధతి.

సామాన్యులు భగవంతుడినే తలంచరు. ఎపుడు లౌకికవ్యాపారంలో సతమతమవుతూ వుంటారు. ఇక సర్వము సమర్పించడమెక్కడిది? వారు సర్వస్వాన్ని ధనము, అధికారము, కీర్తిప్రతిష్ఠలకే అర్పించినారు. ఈ విషయాన్ని విశదీకరిస్తూ వ్యంగంగా ఒక కథ వుంది.

ఒక బడావ్యాపారి ఒక సాధువును చూస్తూనే అంగడిలోనుండి వెలుపలికి వచ్చి సాధువుకు నమస్కరించగా "ఏమయ్యా! నిన్ను ఇంతవరకు చూడలేదే ఎందుకు ఇంతభక్తితో నమస్కారంచేస్తున్నావు" అన్నాడు సాధువు. షావుకారు అన్నాడు "మహానుభావా! మీ ముఖంచూస్తూనే మీరు త్యాగులని తెలుస్తుంది. సంసారులు మీ వంటి సర్వసంగ పరిత్యాగులకు నమస్కారం చేయాలికదా?

"అలా అయితే నా కంటే మీరు మహాత్యాగులు. మీరు లోకేశ్వరుడైన భగవంతుడినే త్యాగం చేసినారు. మేము అల్పమగు ప్రాపంచిక వస్తువులనే త్యాగం చేసినాము. మీకు పదివేల నమస్కారములు" అని సాధువు షావుకారికి నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

కనుక అనిత్య విషయాలను త్యాగంచేసి మనసును, బుద్ధిని భగవంతుని కర్పించి, కేవలం అతని చేతిలో ఉపకరణంగా వుండే భక్తులే భగవంతునికి అత్యంత ప్రియతములు.

## 13 భక్తుని కెవ్వరు భయపడ వనిలేదు

భక్తుని వలన ఎవరికి భయములేదు. భక్తుని చూచి ఎవరు భయపడ నవసరంలేదు. భక్తుడు సర్వాత్మనా భావంతో పుష్టినొందినాడు. కనుక అతను ఎవరికి బాధ కల్గించడు. ఇతరులు బాధపడితే తనకే బాధకలిగినట్లు భావిస్తాడు. క్రూరజంతువులు మనిషిని చూస్తే భయపడుతాయి. ఇందుకు కారణము అతను

తమకు బాధ కల్గిస్తాడని, జంతువుకు మనిషివల్ల అపకారం జరగదని భావిస్తే ఆ జంతువు మనుష్యుని దగ్గరికి వస్తుంది, ఆండ్రూస్ అనే సత్పురుషుడు కరుణకు మారుపేరు. అతడు ఆశ్రమంలో కూర్చుని వున్నాడు. ఒక సింహము కుంటుకుంటూ అతన్ని సమీపించింది. ఆ కాలిని పరీక్షిస్తే ఒక పెద్దముల్లు గుచ్చుకొని వుండింది. దాన్ని తీసిపారేస్తే ఆ సింహము సంతోషముతో వెళ్ళిపోయి మరలవచ్చి ఆశ్రమంలో వుంటూవుండింది. ఆండ్రూస్ మహాశయుడు చనిపోతే ఆ సింహముకూడా ఆహారముమానేసి ప్రాణత్యాగం చేసింది. భక్తుడు చంటిపిల్లమాదిరి వుంటాడు ఆతని వలన ఎవరికి ఏమి ఆపదలురావు. కరుణామయుడు, అహింసామూర్తి కనుక అతన్నిచూచి ఎవరు భయపడరు.

## 14 భక్తుడు ఎవరికి భయపడడు

"భగవంతుని సామ్రాజ్యము పసిపిల్లల సామ్రాజ్యము" అంటాడు ఏసు ప్రభువు. (The Kingdom of Heaven is child like) ఆ సామ్రాజ్యం లోని భక్తులు పసిపిల్లలరీతిగా వుంటారు. చంటి పిల్లల వలన ఎవరికి భయము లేదు. వారు ఎవరికి భయపడరు. చిన్న పిల్లలలాంటి నిర్మలమైన హృదయం గల భక్తునికి భయమెక్కడిది?

వివేకానందస్వామి ఒక అడవిలో వెళ్లుతున్నాడు. ఒక పులి ఎదురుగా వస్తూవున్నది. వేరే మార్గములేదు. స్వామి త్రోవలో కూర్చుని ధ్యానం చేశాడు. అతను ఇట్లా తలచాడు. "ఓ వ్యాఘ్రమా! నీ ఉపాధి, నా దానికంటే గొప్పది. ఆకలిగొన్నావేమో? దీన్ని స్వీకరించి, ఆకలి తీర్చుకో". అట్లానే ఎంతోకాలం గడిచింది. పులికూడా అతనిఎదుటకొంచెముసేపుకూర్చుని వెళ్లిపోయింది. స్వామి కళ్లు తెరిచి చూస్తే పులిలేదు. భక్తుడు ఎవరికీ భయపడడు.

భక్తప్రహ్లాదుడు 5 ఏండ్లవాడు. ముల్లోకాలు జయించిన తండ్రి హిరణ్యకశిపునకు భయపడలేదు. తండ్రియొక్క అజ్ఞానానికి జాలిపడి ఆతనికి హితబోధ చేస్తాడు. తండ్రీ! లోకములన్నియున్ క్షణములో జయించితివి. కాని ఇంద్రియాలోకమును జయించలేక పోతివి. ఏమి ప్రయోజనం?" ముల్లోకాలు ఆతనికి భయపడతాయి. అతనికి కెదురనే వాడెవ్వడు లేడు. కాని భక్తావతంసుడైన కొడుకు తనకెదురాడినాడు.

తనకు బుద్ధులు గరిపినాడు. "ఏరా! బాలకా! నీకు భయములేదా" అంటే నిర్భయంగా "బలయుతులకు దుర్బలులకు బలమెవ్వడు నీకు, నాకు బ్రహ్మాదులకున్ బలమెవ్వడు ప్రాణులకును...బలమెవ్వండట్టి విభుడుబలమసురేంద్రా!" అట్టివాడు నా పట్ల వుండగా దేనికిభయం. అని నెమ్మదిగా తండ్రిని ఎదిరిస్తాడు. సమస్తలోకాలకు రక్షకుడుగా వుండే భగవంతుడే తనహృదయంలో వుండగా అతనికి భయమెక్కడిది?

కనుక భక్తుని చూచి ఎవరూ భయపడనవసరములేదు. అతను ఎవరికిని భయపడడు. ఇట్టి భక్తుడే, భగవంతునికి ప్రియుడు.

## *15 హర్షామర్షములు - భయోద్వేగములు లేనివాడు - నిజమైన భక్తుడు*

సంతోషము, అసూయ, భయము, ఉద్వేగము లేనివాడు నిజమైన భక్తుడు. సూక్ష్మంగా చెప్పవలసివస్తే అతను ద్వంద్వాతీతుడు. ద్వంద్వములు మనసుకు చెందినవి. భక్తుని మనస్సు, భగవంతునిలో నిండియుండుటచే ద్వంద్వాలు అవంతకవే భక్తున్ని వదిలిపెట్టి వెళ్లినాయి. రాముడుండేచోట, కామునికి స్థానములేదు. హర్షము అంటే సంతోషించుట-- తన్ను పొగిడితే సంతోషము, నిందిస్తే కోపము. నిందాస్తుతులకు అతీతుడు భక్తుడు. అసూయ లేక మత్సరము, అరిషడ్వర్గములలోమిన్న, చాలావరకు మిగతావన్ని అసూయ నుండే ప్రభవిస్తాయి. కుండల దొంతివుంది. అన్నిటికన్న అడుగున వున్న కుండను, అసూయగా భావిస్తే క్రింది కుండను పగులగొట్టినచో, పై కుండ లన్నీ పడిపోతాయి. అరిషడ్వర్గాలకు మూలమైన అసూయను, తొలగిస్తే మిగతావన్నీ మాయమవుతాయి.

విశ్వామిత్రునికి వశిష్ఠునిపై అధికమైన అసూయ. వశిష్ఠుడు తనను బ్రహ్మర్షిగా భావించాలి. ఎంత తపస్సు చేసినా, ఇంకో లోకాన్ని సృజించినా అతన్ని వశిష్ఠుడు రాజర్షి అంటాడేకాని, బ్రహ్మర్షి అనడు. ఇందుకు కారణం అతను అసూయను జయించలేదు.

మత్సరగ్రస్తుడైన విశ్వామిత్రునికి వశిష్ఠుని చంపాలనేంత కోపంవచ్చింది. వశిష్ఠాశ్రమానికి రహస్యంగా వెళ్లాడు. రాత్రి నిదురబోతున్నపుడు వశిష్ఠుని

హతమార్చాలని పన్నాగడ పన్నినాడు. అది వసంతరాత్రి. అరుంధతీ, వశిష్ఠులు వెన్నెలలో పడుకొని కబుర్లు చెప్పుకొంటుండినారు. "వెన్నెల ఎంత ఆనందంగా వుంది." అన్నది అరుంధతి. "అవును విశ్వామిత్రుని తపస్సువలె ఆనంద దాయకంగావుంది" అన్నాడువశిష్ఠుడు. ప్రక్కనేదాగియున్నాడు విశ్వామిత్రుడు. వశిష్ఠుడు తన తపస్సును వెన్నెలతో పోల్చుట ఆతనిలో సమూలమైన మార్పు తెచ్చింది. పశ్చాత్తప్తుడైనాడు. చంపాలనుకున్న వశిష్ఠుని పాదాలపైబడి కన్నీటితో అభిషేకం చేశాడు. 'లే బ్రహ్మర్షి' అని వశిష్ఠుడు విశ్వామిత్రుని అక్కున చేర్చుకున్నాడు. అసూయ పశ్చాత్తాపాగ్నిలో దగ్ధమైపోయింది. క్రోధం మొదలైన దుర్గుణాలన్ని మాయమయ్యాయి. విశ్వామిత్రుడు బ్రహ్మర్షిగా వశిష్ఠునిచే గుర్తించబడ్డాడు.

భక్తునకు భయములేదనే అంశము ఈ వరకే తెలుసుకున్నాము. కాని దాని ప్రసక్తి వచ్చింది. కాబట్టి మరొక ఉదంతముతో ఈ విషయాన్ని మరింత విపులంగా తెలుసుకుందాము.

అలెగ్జాండరు ఐరోపా, మధ్య ఆసియా దేశాలను జయించి భారతదేశాన్ని జయించాలని వచ్చాడు. సింధుతీరంలో సైన్యాన్ని వుంచాడు. భారతదేశంలో ప్రతిభావంతులైన యోగిపుంగవులుంటారు. వారిలో ఏ ఒక్కరినైనా తన దర్బారులో పెట్టుకొంటే బాగుంటుందని అనిపించింది.

సింధునదీ తీరంలో ఒక సుప్రసిద్ధ తపస్వి తపస్సు చేసుకుంటుంటే తనకు అతనిపై కన్నుపడింది. అలెగ్జాండరు తనసైనికుల్లో ఒకన్ని ఆ యోగిని తీసుకొనిరమ్మని పంపాడు. యోగి కన్నులు తెరువలేదు. ఇంకా పెద్ద ఉద్యోగిని పంపాడు. ఫలంలేదు. సైన్యాధిపతి వెళ్లాడు. యోగి కన్నులు తెరువలేదు. స్వయంగా అలెగ్జాండరే వెళ్లి, అతన్ని పిలిచాడు. అప్పుడు కన్నులు తెరిచాడు యోగి. నేను ఎవరో తెలుసునా? అన్నాడు అలెగ్జాండరు. "ఎవరైతే నాకేమి? అయినా చెప్పు" అన్నాడు. నేను అలెగ్జాండరు చక్రవర్తిని, ప్రపంచాన్ని జయించినవాడును, నీ కేమైనా కోరిక వుంటే తీరుస్తాను. అన్నాడు చక్రవర్తి. "ఉన్నది. దయచేసి ఇక్కడి నుండి వెళ్ళిపో" అలెగ్జాండరుకు ఆశ్చర్యము కోపము వచ్చింది. "నిన్ను చంపుతాను" అని కత్తి పైకెత్తినాడు. ఎత్తినచేయి నిలిచిపోయింది. యోగి శక్తి గుర్తించి చక్రవర్తి యోగికి పాదాభివందనం చేసి వెళ్లిపోయినాడు. జ్ఞానోదయమైంది. భారతదేశమునుండి తిరుగు ప్రయాణం

చేసినాడు. స్వదేశం చేరకముందే చనిపోయినాడు. అతని చివరి కోరిక తనను ఖననం చేసేటప్పుడు చేతులకు గుడ్డ కప్పవద్దని. ఎందుకంటే ప్రపంచాన్ని జయించిన అలెగ్జాండరు చనిపోయేటప్పుడు రిక్తహస్తాలతో పోతున్నాడని ప్రజలు తెలుసుకోవాలి.

పోయేనాడు వెంటరాదు ఒక పూచికపుల్లయినా! ఎందుకీ అహంకారము? ఎందుకీ కీర్తికాంక్ష? ఎందుకీ సంపద?

భక్తుని చూస్తే యముడంతటివాడు భయపడతాడు. మార్కండేయుడు పరమేశ్వరున్ని కౌగలించుకొని యమునికి భయపడలేదు.

మహాపతివ్రత సావిత్రి మృత్యుదేవతను జయించి మృతిచెందిన భర్త ప్రాణాలను పొందింది.

జ్ఞానానికి భక్తునికి భయములేదు.

"భీషోస్మా ద్వాతఃపవతే భషోదేతి సూర్యః
భీష్మోస్మా దగ్ని శ్చేం ద్రశ్చ మృత్యుర్ధావతి పంచమ ఇతి"
(తైత్తిరీయోపనిషత్)

అనగా జ్ఞానిని చూస్తే పంచభూతాలు భయపడతాయి. ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు భయపడతారు. మృత్యువు తనకుమృత్యువు వస్తుందేమో నని పరుగెత్తి పోతుంది.

దైవీగుణాల్లో అభయానికి ప్రథమస్థానం కనుక భక్తునికి భయంలేదు. అతను ధీరాతి ధీరుడు.

## 16 భక్తుడు విముక్తోద్వేగుడు

ఉద్వేగము అంటే కలత అలజడి. భక్తుడు ఎంత కష్టము వచ్చినా కలత చెందడు. సామాన్యులు చిన్నచిన్న విషయాలకే కలత చెందుతూంటారు. కుమారుడు ఇంటికి సమయానికి రాకుంటే తల్లి అలజడి చెందుతుంది. బస్సు ఆలస్యంగా వస్తే అలజడి. కాని భక్తుడు, జ్ఞాని, ఎంతటి ఇక్కట్లు వచ్చినా కలతచెందడు. నెమ్మదిగా ఉంటాడు. ఎట్టి పరిస్థితులలోను ఉద్వేగము చెందడు, "అలజడులకు అల్లాడనివాడే ధీరుడు" అంటాడు కాళిదాసు.

శివునికి అర్ధాంగములో ఒకభార్య. మరొక భార్య తలమీద ఎక్కి కూర్చుంది. శివుని వాహనం ఎద్దు. అమ్మవారి వాహనం సింహం. ఒక కొడుకు వాహనం ఎలుక, మరొక కుమారుని వాహనం నెమలి. ఆభరణాలు పాములు గొంతులో హాలాహలం. ఇంత కల్లోలంలో వున్నా పరమశివుడు అతను శాంతంగా పద్మాసనంలో, కళ్లుమూసుకొని కైలాసంలో ఉంటాడు.

సర్దారు వల్లభభాయిపటేల్ కోర్టులో పెద్దకేసు వాదిస్తున్నాడు. టెలిగ్రాం వచ్చింది. చూచి ప్రక్కన పెట్టినాడు. వాదన పూర్తి అయింది. ప్రక్కన న్యాయవాదులు టెలిగ్రాంలోనిసంగతి ఏమిఅని అడిగారు. భార్య చనిపోయింది అని టెలిగ్రాం. మహానుభావుడు ఎంతటి ఆపదవచ్చినా ఏ మాత్రం చెలించక కేసు పూర్తి చేసినాడు.

అట్లా వుంటుంది భక్తుని స్వాస్థత. సముద్రంలోని కొండ అలలతో ఎన్ని దెబ్బలు తింటున్నా కదలదు వదలదు. మెదలదు. అట్లాగే భక్తుడు ఎంతటి కష్టము వచ్చిన ఉద్వేగము చెందడు.

## 17 అనపేక్షుడు

భక్తునికి కోరికలు వుండవు. దేనిపై అపేక్షలేదు. కోరికలు బంధ కారణాలు. కోరికలు లేకుండుటే ముక్తి. భక్తునికి వుండేదంతా, ఒకే కోరిక తానెపుడు భగవంతునికి సన్నిహితంగా వుండాలనేది ఆ కోరిక. నరసింహ స్వామి ప్రహ్లాదుని వరముకోరమన్నాడు. స్వామీ నీ సందర్శనంతో నా కోరికలు తీరినాయి. ఇంక కోరవలసినది ఏమీలేదు. కాని మీరు కోరమంటున్నారు కాబట్టి ఒకటి కోరుతాను.

"నత్వహం కామయే రాజ్యం, న స్వర్గం నా పునర్భవం
కామయే దుఃఖ తప్తానాం, ప్రాణినాం ఆర్తినాశనం"

నాకు రాజ్యము వద్దు, స్వర్గము వద్దు, పునర్జన్మ లేకుండుట వద్దు. నాది ఒకేకోరిక. దుఃఖితులు ఆర్తులైనవారికి బాధానివారణం, దుఃఖనివారణం కావించు.

ఇంకొక భక్తురాలు కుంతీదేవి. కృష్ణుడు "అత్తా నీకేమైనా వరం ఇవ్వాలని వుంది. అడుగు" కుంతి అన్నది "స్వామీ! నాకు కష్టాలనే

యివ్వు. కష్టాలుంటే ఎపుడు నీవు నా స్మరణలో వుంటావు" ఎంతటి అసాధారణమైన కోర్కె.

రోహిదాసు హరిజనుడు. మహాభక్తుడు. ఒక సేఠ్ అతని కుటీరానికి వచ్చి స్వామీ నేను యాత్రలు వెళ్లుచున్నాను. నా వద్ద అమూల్యమైన రత్నాలున్నాయి. యాత్రనుండి వచ్చేవరకు భద్రంగా వుండేటందుకు నీ కుటీరంలో ఉంచుతాను. మీరంటే నాకు అమితవిశ్వాసం.

"అయ్యా! నా కుటీరానికి భద్రమైన వాకిలిలేదు. తాళంలేదు. ఇష్టము వచ్చిన దాచుకో" అన్నాడు రోహిదాసు. సేఠ్ తన అమూల్యమైన రత్నాభరణాలమూటను కుటీరంలో దాచి యాత్రకు వెళ్ళి తిరిగి వచ్చాడు.

"దాసా నా మూటను నాకు తిరిగి ఇస్తావా" అని అడిగాడు. "నీ మూట ఎక్కడ పెట్టినావో నాకు తెలియదు. వెళ్ళి తెచ్చుకో" అన్నాడు. రోహిదాసు. తాను పెట్టినచోట భద్రంగా వుంది. దాన్ని తీసుకొని సేఠ్ రోహిదాసుకు నమస్కరించి వెళ్ళాడు.

రోహిదాసుకు ఆ మూటలో దాచిన అమూల్యాభరణాలు చూడాలని కూడా అపేక్షలేదు. ఎందుకు చూడాలి. ఇది అనపేక్షకు చక్కటిఉదాహరణ.

కోరికలు నిజంగా త్యజించినారా లేదా అనేది ఎవరికి వారు తెలుసుకోవలసిన విషయం. కోరికలు సున్నితంగా అంతరంగంలో దాగివుంటాయి. ఇందుకు నిదర్శనంగా ఒక ఉదంతం.

ఒక పెద్దమనిషికి సన్యాసాశ్రమం స్వీకరించాలని కోరిక కలిగింది. అతని భార్య వెంట వస్తానని పట్టుబట్టి బయలుదేరింది. నీకు బంగారుకు మట్టికి ఏమీ భేదం లేదు. రెంటిని సమదృష్టితో చూడగల్గుతానని ధీరత్వముంటే వెంట రమ్మన్నాడు. సరే! ఇద్దరూ బయలుదేరినారు. త్రోవలో భర్త ముందుకు నడుస్తున్నాడు. దారిలో ఒక బంగారు గొలుసు కనిపించింది. దాన్ని చూస్తే ఆశపడుతుందేమోనని దాన్ని మట్టితో కప్పాడు. కొంతదూరం వెళ్ళి ఒక చెట్టు నీడన విశ్రమించినారు. "ఏమిటి మీరు కాలితో దేన్నోకప్పారు" అనిఅడిగింది భార్య. బంగారు నగ కనిపించింది. దాన్ని తీసుకుంటావేమోనని దాన్ని మట్టిలో కప్పాను. భార్య ఇట్లా అన్నది. మీకు మట్టికి, బంగారుకు భేదం కనిపించి ఆ బంగారాన్ని కప్పారు. నాకు ఆ భేదంలేదు. నిజంగా మీకు సన్యాసా

శ్రమణ స్వీకారంచేసే యోగ్యతలేదు. సన్యాసం లేదు. పాడు లేదు. నడవండి ఇంటికి అనిందట ఆ యిల్లాలు. వాస్తవంగా బంగారుకన్నా మట్టేనయం. మట్టి నుండే మనము పుట్టాము. మనమే కాదు సమస్త జీవరాశి పుట్టింది. మట్టి నుండే ఆ మట్టె మనలను పోషించింది.

బిల్హణకవి "భోజ ప్రబంధం" అనే గ్రంధాన్ని వ్రాశాడు. అందులో ఒక విషయం వుంది. భోజుడు దానశీలుడు. కవులకు అక్షరలక్షలు ఇచ్చే వాడు. మంత్రికి ఇది బాధగా వుంది. బొక్కసం ఖాళీ అవుతుందేమోనని భయం. రాజుకు నేరుగా చెప్పలేక ఈ విషయం ఎట్లయినా రాజుకుతెలియాలి అని రాజు శయనాగారం ప్రవేశించబోయేటప్పుడు అక్కడ గోడకు కనపడే టట్లుగా "ఆపదర్ధం ధనం రక్షేత్" అని వ్రాసినాడు. అనగా ఆపదసమయం రావచ్చు. అందుకొరకు ధనాన్ని రక్షించుకోవాలి. అని అర్ధం.

భోజుడు దాన్ని చదివి దాని క్రింద "శ్రీమతాం ఆపదః కుతః" అని వ్రాశాడు. శ్రీమంతులకు ఆపదలెందుకు వస్తాయి? అని దాని భావం. దాని క్రింద మంత్రి మరోవాక్యం "సాచేదపగతా లక్ష్మీః" అని వ్రాశాడు. లక్ష్మీ కటాక్షం తప్పిపోయే కళ కూడా రావచ్చు.

అది చదివి భోజరాజా పాదం ఇట్లా వ్రాశాడు. "సంచితార్ధోఽపినశ్యతి" పోయే కాలం వస్తే నిలువబెట్టింది మాత్రం ఉంటుందా?

రాజుగారి నిశ్చయనిష్టకు మంత్రి చకితుడైనాడు.

ఆపదర్ధం ధనం రక్షేత్ శ్రీమతాం ఆపదః కుతః?
సాచేదపగతా లక్ష్మీః సంచితార్ధోఽపి నశ్యతి.

ఆయుష్షుంటే ఆటంబాంబు ఏం చేస్తుంది? నొసట వ్రాసిన వ్రాతలు చెరుస్తే పోవు. అదృష్టవంతుని చెడగొట్టేవాడు లేడు. రానున్నది రాకమానదు. కానున్నది కాకమానదు.

ఇట్టాంటి భావాలలో పుష్టిపొందిన భక్తుడు అనపేక్షుడు. నిరపేక్షుడు.

## *18 భక్తుని మరొకలక్షణం శుచి*

విష్ణు సహస్రనామాల్లో శుచి అనేది రెండుమార్లు వచ్చింది.

1. ఉపేంద్రో వామన ప్రాంశుః అమోఘః శుచిః ఊర్జితః 151నామము.

2. అసంఖ్యేయోఽఅప్రమేయాత్మ విశిష్టః శిష్టకృత్ శుచిః 251 నామము.

భగవంతుడు శుచి అని కీర్తించబడినాడు. అతనిలో ఎటువంటి కల్మషము కళంకము కాని లేదు. అతన్ని తలుస్తూనే శుచిత్వము లభిస్తుంది. సంధ్యావందన ప్రారంభములో, అంతేకాదు పూజాప్రారంభంలో

అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాం గతోపి వా
యస్మరేత్ పుండరీకాంక్షం సబాహ్యాంభతర శ్శుచిః

'పుండరీకాక్ష' అనే నామోచ్ఛారణ మాత్రంతో ఎంతటి అపవిత్రత అయినా తొలగి సాధకుడు శుచిత్వాన్ని పొందును. బాహ్యశుచి మాత్రమే గాక అంతశ్శుచి కూడా లభిస్తుంది, తన నామాన్ని స్మరించినంత మాత్రాన పరమ పాపియైన అజామిళున్ని విష్ణుదూతలు వైకుంఠాన్ని చేర్చారు. అట్లాంటి శుచి ఖ్యాతుడైన భగవంతుడు భక్తుని పాదధూళి తనపై పడితేచాలు అని భావిస్తాడట. ఇంతే కాదు ఆ పాదధూళిని పరమపావనమైనదిగా పూజిస్తాడట, ఈ విషయాన్ని శ్రీకృష్ణుడు ఉద్ధవునితో అంటాడు,

నిరపేక్షం మునిం శాంతం నిర్వైరం సమదర్శనం
అనువ్రజామ్యహం నిత్యం పూయేయేత్యం ఘ్రిరేణుభిః

కోరికలు లేనివాడు, ముని, శాంతము, వైరములేనివాడు, సమదర్శనుడు అయిన భక్తునివెనుక నేను పయనిస్తాను. కారణమేమంటే అతని పాదధూళి నాపై పడితేచాలు పవిత్రుడనవుతాను అని శ్లోక భావము.

నారద భక్తిసూత్రాలు భక్తుని శుచిత్వాన్ని ఇట్లా కీర్తిస్తాయి. "సుతీర్థీ కుర్వంతి తీర్థాని సుకర్మీ కుర్వంతి కర్మాణి సచ్ఛాస్త్రీ కుర్వంతి శాస్త్రాణి" అని.

భక్తుని శుచిత్వం అందరిని పావనంచేసే తీర్థాలను పావనం చేస్తుంది. అన్ని కర్మలను సుకర్మలుగా మార్చగల్గుతుంది. అన్నిశాస్త్రాలను సచ్ఛాస్త్రాలుగా చేయగలదు.

భగీరథుడు తపస్సుచేసి గంగాదేవిని ప్రసన్నం చేసుకోగలిగాడు. గంగ అన్నది - "భగీరథా! ఎందరో పాపాత్ములు నాలో స్నానం చేస్తారు. ఆ పాపాలను నేనెట్లు భరించగలను?" భగీరథుడన్నాడు– "తల్లీ! నీకేమి భయం. భక్తులు నీలో స్నానంచేస్తారు. ఆ ప్రభావంవలన నీలోచేరిన పాపుల పాపాలను భక్తుల స్నానం హరించివేస్తుంది.

అందుకే భక్తుడు తీర్థపాదుడు. భక్తుని పాదస్పర్శచే జలము పవిత్రత నొందుతుంది.

భక్తుడు లోపల వెలుపల శుచియే. నిజమైన భక్తుడు నిష్కల్మషుడు. అంతేకాదు, ఇతరుల పాపాలను హరింపజేసేటంతటి శుచికలవాడు.

కనుక భక్తుని పాదరజాన్ని అపేక్షించే భక్తుడు భగవంతునికి అత్యంత ప్రీతిపాత్రుడగుటలో సంశయములేదు.

## 19 దక్షుడు

భక్తుడు దక్షతకలవాడు. అనగా చతురుడు, కుశలుడు. భక్తుడు చూచేదానికి నెమ్మదిగా, అమాయకుడుగా ఉంటున్నా సమయంవస్తే ఏపనినైననూ అత్యంత సమర్థవంతంగా నిర్వహించగల చతురత గల్గియుండును. లంకకు వెళ్ళాలి. నూరు యోజన విస్తీర్ణముగల మహాసముద్రము! వానర శ్రేష్ఠుల్లో ఒకరొకరు వారిశక్తులను వివరిస్తున్నారు. అంజనేయుడు మిన్నకున్నాడు. జాంబవంతుని ప్రోత్సాహము అతని సమర్థతను వెలికితీసింది. సముద్రాన్ని దాటినాడు. ''చూచిరమ్మంటే కాల్చివచ్చిన'' భక్తుడు హనుమంతుడు.

తెల్లవారేలోగా సంజీవకరణి తెమ్మని జాంబవంతుడు, సుషేణుడు చెప్పగా సంజీవకరణివుండే ద్రోణపర్వతాన్నే పెకలించి తీసుకొని రాగలిగిన ఘనుడు హనుమంతుడు.

విద్యార్థి దశలో స్వామి రామతీర్థ పరీక్షకు వెళ్ళాడు. పరీక్షాపత్రంలో 9 ప్రశ్నలిచ్చి 7 ప్రశ్నలకు సమాధానం వ్రాయండి అని పరీక్షకుడు పత్రంలో షరా వ్రాశాడు. రామతీర్థుడు తొమ్మిది ప్రశ్నలకు జవాబులువ్రాసి, "మీ యిష్టంవచ్చిన ఏడు ప్రశ్నలకు మార్కులు ఇచ్చుకోండి" అని వ్రాసినాడు. ఇది సమర్థతకు, దక్షతకు ఒరిపిడి.

ధనాకర్షణకు, జనాకర్షణకు సమర్థురాలు వేశ్యస్త్రీ. అదికాదు నేర్పరితనం. కామినీ కాంచన భ్రమలకు ఆకర్షితుడుగాక భగవంతునివైపే ఉన్ముఖుడై జీవించగల్గుట దక్షత.

ఇట్లాంటి లక్షణాలుగల భగవద్భక్తుని సేవచేస్తే భగవంతుని సేవ చేసినట్లే. రాముని దేవాలయంలేని ఊరు వుంటే వుండవచ్చుకాని, అంజనేయ స్వామి విగ్రహంలేని ఊరు వుండదు.

పండిత మదనమోహన మాలవీయాకు ఒక పైసా చేతిలోలేదు. కాశీ విశ్వవిద్యాలయాన్ని స్థాపించగలిగాడు.

వైష్ణవ ఆళ్వార్లలో తిరుమంగై ఆళ్వారు అత్యంత సమర్థుడు. శ్రీరంగేశునికి ఏడు ప్రాకారాలు నిర్మించాలని నిశ్చయించినాడు. ఆ కాలంలో కోట్ల కొలది ధనరాసులను ప్రోగుచేసి కార్యాన్ని సాధించగలిగినాడు. భిక్షచేసి జీవించేవాడు. ఇది సమర్థతాలక్షణం.

## *20 భక్తుడు - ఉదాసీనుడు*

ఉదాసీనుడు అంటే సామాన్యార్థంలో నిరుత్సాహంగా వుండేవాడు అని అంటారు. కాని ఈ పదానికి వ్యుత్పత్త్యర్థం ఇలా ఉంటుంది. ఉత్ = పైన, ఆసీన = కూర్చున్నవాడు. అనగా దేన్ని లెక్కచేయని ఉన్నతస్థితిలో ఉండే వాడు అని అర్థం చెప్పుకోవచ్చు. "Dont care" అనే పద్ధతిలో ఉండేవాడు ఏమిరానీ ఏమిపోనీ లెక్కచేయడు, దేన్ని పట్టించుకోడు. సాక్షిమాత్రంగా వుంటాడు.

ఒకప్పుడు జనకచక్రవర్తి వశిష్ఠులవారితో సంభాషిస్తూ ఉన్నారట. ఇంతలో ఒకరువచ్చి "నగరం కాలిపోతూంది" అని చెప్పాడట. దాన్ని ఆర్పండి అన్నాడు. తన సంభాషణ కొనసాగించాడు. మరొకసారి ఎవరో వచ్చి "మీ ఆస్తి కాలిపోతూంది" అన్నారట అందుకు సమాధానం నా ఆస్తి కాలిపోయేదికాదు. "అచ్ఛేద్యం, అదాహ్యం, అక్లేద్యం, అశోష్యం" అని జవాబిచ్చాడు ఆ రాజర్షి. జరిగేది జరుగుతుంది, చేయాల్సిందా? చేస్తాం! ఎందుకు అనవసరమైన అందోళన.

ఆది శంకరులు అంటారు ఉదాసీనత ఉండాల్సిందే. దానితోపాటు లోకుల దయాదాక్షిణ్యాలకు, పొగడ్తలకు ఉబ్బిపోరాదు.

"ఔదాసీన్య మభీప్స్యతాం జనకృపానైష్ఠుర్య ముత్సృజ్యతాం"

అలెగ్జాండరు చక్రవర్తి సింధుతీరంలోకి సైన్యాలతో వచ్చాడు. ఇంకా భారతదేశాన్ని జయించాలనుకున్నాడు. ఆ తీరంలో గొప్ప సాధువు తపస్సు చేస్తూన్నాడని తెలిసింది. అతన్ని ఏ ఉపాయంతోనైనా తనవెంట తీసుకు పోవాలనే కోరిక కల్గింది. చిన్నచిన్న అధికారులను ఆయనదగ్గరకు పంపాడు. అతను వారివైపుకూడా చూడలేదు స్వయంగా తానే బయలుదేరాడు. ఆ

తపస్వి తేజస్సుకు చకితుడైనాడు. తపస్వి కన్నులు తెరచినాడు "నేను ప్రపంచాన్ని జయించిన చక్రవర్తిని. నీకేమైనా కావాలా?" అని అడిగాడు. సాధువు అన్నాడు "చలిగావుంది సూర్యరశ్మికి అడ్డంగా నిలుచున్నావు ప్రక్కకు జరుగు" అని సమాధానం. ప్రపంచాన్ని జయించినవాడైతేనేమి? ముల్లోకాలను జయించినవాడైతేనేమి? అతనికొక లెక్కా.

ఈ లక్షణం భక్తునిలోను, జ్ఞానిలోను అగుపిస్తుంది. రమణమహర్షి పాద సన్నిధిలో ఒక భక్తుడు ఒకరోజు పువ్వును వుంచినాడు. మహర్షి దానిని ఒక ప్రసన్న దృష్టితో చూచాడు. ప్రక్కకు నెట్టాడు. వాసనైనా చూడలేదు. అతనికి కర్తృత్వంలేదు, భోక్తృత్వంలేదు. ఇదే ఉదాసీనతకు తార్కాణం.

## 21 భక్తుడు - గతవ్యథుడు

వ్యథ అంటే బాధ· చీకుచింత అని అర్థం. గతవ్యథుడు అంటే ఎట్లాంటి బాధ, చీకు చింత లేనివాడు. దిగులు, చింత అనేవి మానసిక దౌర్బల్యాలు· నేనే ఆత్మను అనే జ్ఞానికి, భగవంతుడే నాకు రక్ష అనే పరమవిశ్వాసంకల భక్తునికి దిగులెందుకు? స్వార్థం వుంటే, ఆసక్తి వుంటే భయము, దిగులు వుంటాయి. స్వార్థచింత లేనివానికి దిగులు దూరమవుతుంది.

ఒక నిస్వార్థ సంఘసేవకుడుండేవాడు. చందాలకు వెళ్లుతూవుండేవాడు· కొందరు చందాలు ఇస్తారు, కొందరు ఇవ్వరు. ఇస్తే ఆనందం, ఇవ్వకుంటే. బ్రహ్మానందం అనుకుంటూ తనపని చేసుకొని పోతూవుండేవాడు.

ఆత్మవిశ్వాసము లేదా భగవద్విశ్వాసమున్నవారికి వ్యథ అంటూవుండదు "సత్యాన్నాస్తి పరోధర్మః" అనే సూత్రాన్ని జీవిత ధ్యేయంగా తీసుకొని జీవించేది అనీబిసెంటు. నాకు క్రైస్తవమతంపై విశ్వాసంలేదు అని చెప్పడంతో భర్తనుండి వేరుపడాల్సి వచ్చింది. బిడ్డలుమాత్రం ఆమె పోషణలో వుండేవారు· తల్లి వృద్ధురాలు. వారికై ఆమె చిల్లరపనులుచేస్తూ, ఉపవాసాలు చేస్తూ జీవిస్తూ వుండేది. విషం తీసికొని ఆత్మహత్య చేసుకోవలెనను ప్రయత్నంలో ఆమెకు ఒక అశరీరవాణి వినిపించింది. "ఈ మాత్రం కష్టాలను సహించలేనిదానవు సత్యవ్రతాన్ని ఎట్లా ఆచరించగలవు?" విషమునీసా అవతల పారవేసింది. తల్లి చనిపోయింది - ఒక బంధం తెగిపోయిందని భావించింది. "నాస్తికురాలి దగ్గర తన సంతానం ఉండరాదు" అని భర్త న్యాయస్థానంలో

అభియోగం తెస్తే అమ్మాయిలనుకూడా వదలుకొంది ఉన్న ఒక బంధంకూడా తొలగిపోయిందని భావించింది. అనాటినుండి నిర్భిబద్దంగా మానవసేవకు అంకితమైంది.

జిడ్డు కృష్ణమూర్తిగారు లోకగురువని భావించారు పలువురు దివ్యజ్ఞాన సమాజీయులు. కోట్లకొలది విలువజేసే ఆస్తి అతని స్వాధీనంలో వుంది. 1922లో ఒక సమావేశంలో నేను గురువునుకాదు, మీరు శిష్యులు కారు అని తన ఆధీనంలోనున్న యావదాస్తిని దాతలకు వాపసుచేసి కట్టుగుడ్డలతో ఏకాకియై వుండిపోయాడు. కించిత్తు చలించలేదు. అన్నిబంధాలు తెగిపోయి నాయి అని భావించాడు. ఇది జ్ఞాని వైఖరి.

నేను కర్తను గాదు, భగవంతుడే కర్త, నేను కేవలం నిమిత్తమాత్రుడనే అని భావించి ఎటువంటి వెతచెందడు భక్తుడు.

భక్తుడుకాని, జ్ఞానికాని దేనికి చింతించరు. బాధపరచే ఎంతటి గడ్డు పరిస్థితులనైనను చిరునవ్వుతో ఎదుర్కొంటారు. ఇందుకే వీరు భగవంతునికి అత్యంత ప్రియులు.

## 22 సర్వారంభ పరిత్యాగి

(సర్వకర్మలయందు కర్తృత్వబుద్ధిలేనివాడు)

ఆరంభము అంటే ఇహపరలోకఫలవాంఛలతో కూడిన పనులు అని శంకరాచార్యులవారి నిర్వచనము. వైష్ణవకార్యములకు అన్యములైన పనులు అని రామానుజాచార్యులవారి నిర్వచనము. "బండి నడిపేవాడు భగవంతుడు. కొండ మోసేవాడు గోపాలుడు" అంటూ సర్వకర్మలకు సాక్షీభూతుడై వుంటాడు భక్తుడు. చేసేవాడు భగవంతుడు. అతని ఉపకరణములు నా త్రికరణములు అనే భావంలో వుంటాడు భక్తుడు. ఏదో ఒకతూరి రమణ మహర్షిని సంతకము చేయమన్నారు. నాకు పేరంటూ వుంటేకదా! సంతకము చేసేది? అన్నాడట మహర్షి. సర్వారంభ పరిత్యాగమునకు ఇది చక్కటి ఉదాహరణ.

ప్రియభక్తుని అవసరాలు నేను చూచుకుంటానని భగవంతుని హామీ. "యోగక్షేమం వహామ్యహం" అట్లాంటప్పుడు భక్తునికి కావలసినది యేమి?

భగవంతుని సంసారంలో భక్తుడు అతిథిదేవుడు. అతిథుల అవసరాలు గృహస్థు చూచుకుంటాడు. అతిథికేమి తక్కువ? "తక్కువేమి మనకు రాముడొక్క-డుండు వరకు!" అంటాడు రామదాసు.

వివేకానందుడు రైలులో ప్రయాణము చేస్తూవుండినాడు. మూడు దినములు ప్రయాణము వేయవలసి వుండినది. ఎదుటి సీటులో ఒక షావుకారు కుటుంబముతో ప్రయాణముచేస్తూ వుండినాడు. తడువ తడువకు తింటున్నాడు, కూజాలోనీరు తాగుచున్నారు. ఎదుట కూర్చున్న సన్యాసికి ఏమీ ఇవ్వలేదు. స్వామి వారిని అడుగలేదు. మూడు రోజులతర్వాత స్వామి దిగు స్టేషను వచ్చింది. నెమ్మదిగాదిగాడు. స్టేషను బయటవుండే చెట్టుక్రింద కూర్చున్నాడు. కొంత సేపటికి ఒకడు బుట్ట భుజానికి తగిలించుకొని మరొకచేత్తో కూజాలో నీరు తీసుకొనివచ్చి స్వామిముందుపెట్టి నమస్కరించాడు. "నీవెవరో నాకు తెలియదు. నాకెందుకు యివన్నీ మోసుకొనివచ్చావు? బహుశ నీవు పొరబడుతున్నావేమో?" అన్నాడు వివేకానందుడు.

"కాదు స్వామీ! నేను పొరబడలేదు. రాత్రి కలలో ఒక మహానుభావుడు కనిపించి, నా భక్తుడు ఫలానారైలులో వస్తున్నాడు. మూడుదినాలుగా ఉపవాసము. వెంటనే వారికి ఆహారము, పానీయము తీసుకొనిపో అని చెప్పి ఒక ఫోటో చూపించినాడు. ఏదో స్వప్నమనుకొని మరల నిద్రిస్తే మరల ఆ మహాత్ముడు నన్ను తొందరచేసి వెళ్ళమన్నాడు. కనుక ఆ ఫోటోలో చూచిన వ్యక్తి మీరే. దయచేసి ఈ పదార్థములను స్వీకరించండి" అని ఆ వ్యక్తి ప్రార్థించాడు. కనుక తనకు ఆత్మీయులైనవారి అవసరాలను భగవంతుడే చూచుకొంటాడు.

భక్త రామదాసు తహస్సిల్దారు. వసూలుచేసిన పన్నుడబ్బులు ఆరు లక్షల రూపాయలతో భద్రాద్రి రఘురామునికి ఆలయము నిర్మించినాడు. సీతా రామలక్ష్మణుల విగ్రహాలకు ఆభరణములు చేయించినాడు. జైలుపాలైనాడు. జైలులో దెబ్బలు తిన్నాడు. పడరానిపాట్లు పడినాడు. దుష్కర్మ క్షీణమైంది. రామలక్ష్మణులు మారువేషంలోవచ్చి, నవాబుకు ఆరు లక్షలు చెల్లించి, రశీదుపొంది రామదాసును జైలునుండి విముక్తిగావించారు.

సర్వసమర్పణ భావంతో మెలిగే భక్తుల యోగక్షేమాలు భగవంతుడే చూచుకొంటాడు. ప్రతిఫలాపేక్షరహితంగా భగవత్ కైంకర్యముచేసే భక్తుడే సర్వారంభ పరిత్యాగి.

కురు సంస్థానాధిపతి కురేశుడు రామానుజుల ఆదేశంమేరకు సర్వ స్వాన్ని వదలి శ్రీరంగానికి భార్యాసమేతుడై వచ్చి గురుసేవ చేస్తూండేవాడు. భైక్షుకవృత్తి నవలంబించి జీవిస్తూ వుండేవాడు. మూడు నాలుగు దినాలు జడివాన కురిసింది. బయటకు వెళ్ళేదానికి సాధ్యముకాలేదు. దంపతులు పస్తున్నారు. వాన వెలసింది. కురేశుడు భిక్షకు వెళ్ళాడు. అతడు అట్లా వెళ్ళాడో లేదో దేవాలయములోని పూజారి వేషంతో స్వామివచ్చి రంగనాధుని నైవేద్యాన్ని అమ్మగారికి సమర్పించాడు. ఇక్కడికి ఎవరు పంపారంటే "అయ్యగారు పంపారు" అనిచెప్పి ఆ వచ్చినవ్యక్తి వెళ్ళిపోయాడు. కొంత సేపటికి కురేశుడు తిరిగివచ్చాడు. భిక్ష లభించలేదు. స్వామి నైవేద్యాన్ని చూచి ఆశ్చర్యము పొందాడు. భార్యనుండి సమాచారము విన్నాడు. స్వామీ ఏమి నీ దయ అని ఆనందాశ్రువులు విడిచాడు. ఇంతలోనే అతను కొంచెము కోపంతో "నీవేమైనా స్వామిని కోరినావా" అని భార్యను ప్రశ్నించాడు. అవును స్వామీ! మీరు నాల్గునాళ్లు పస్తు వుండడము చూచి సహించలేక రంగనాధుని ప్రార్థించాను అని సమాధానము చెప్పింది భార్య లక్ష్మమ్మ. వెంటనే గురువు దగ్గరకు ఆ నివేదన చేసిన పదార్థాలను తీసుకొనివెళ్లి భార్య చేసిన పనికి బాధపడ్డాడు. రామానుజులు అతన్ని ప్రియంగా కౌగలించుకొని "కురేశా! నీవెంత పుణ్యాత్ముడవు. నీకంటే నీ భార్య ఇంకా పుణ్యాత్మురాలు. స్వయంగా స్వామిని దర్శనం చేసుకుంది. ఇందులో తప్పేమిలేదు. భగవంతుని ప్రీతి పాత్రులైన మీ దంపతులు ధన్యాత్ములు. స్వామి తెచ్చిన నైవేద్యాన్ని స్వీకరించు" అని చెప్పిన తర్వాతనే కురేశుడు ఆ నివేదనను ఇతరులకు పంచి తాను భుజించాడట.

కనుక సర్వ సమర్పణ భావంతో భగవంతుని నమ్మిన భక్తుల కేమి కొదువ ?

బహుకార్యాలు భారీ కార్యాల వ్యాసంగం భక్తునికి పనికిరాదు. మోయ లేనంత పనులు పెట్టుకొని తల పగులగొట్టుకునే దుర్గతికి భక్తుడు పోరాదు.

## 23 భక్తుడు హర్షించడు

హర్షము అన ఇంద్రియ సుఖము. ఇంద్రియసుఖాలు లభిస్తే ఉబ్బిపోడు. హర్షము బాహ్య విషయానందాన్ని తెల్పుతుంది. ఆనందము ఆత్మలక్షణము. ఎప్పుడూ ఆత్మానందములో మునిగి తేలుతూ వుండే భక్తునికి లేక జ్ఞానికి

అల్పసుఖాలు రుచించవు. "అంబుజోదర దివ్య పాదారవింద చింతనామృత స్నాన విశేషమత్త చిత్తము" కల భక్తుడు ఇతర బాహ్యసుఖాలు కలిగితే ఉబ్బిపోడు. సముద్రంలో నది కలసిందని సముద్రుడు ఉప్పొంగనట్లు, భక్తుడు తాత్కాలిక సుఖాలు లభిస్తే తనకేమి కానట్టుంటాడు. కంచి కామకోటి పరమాచార్యులకు శతజయంతి సందర్భంగా వారిని సింహాసనంపై కూర్చొనబెట్టి కేయూర కిరీటాలతో అలంకరిస్తే వారు కన్నుమూసుకున్నారు. వారి ముఖ కవళికలలో యేమాత్రం మార్పు కనబడలేదు.

బెంగుళూరులో గణ్యమానవ్యక్తి శ్రీ డి. వి. గుండప్పగారు రచయిత, కవి, విమర్శకుడు. బెంగుళూరులో వారు నివసించే వీధికి ఆయన పేరు పెట్టాలని ముఖ్యమంత్రి శ్రీ కె. హనుమంతయ్య వెళ్ళి వారి అంగీకారాన్ని తెల్పమని ప్రార్థించాడు. అందుకు సమాధానంగా గుండప్పగారు "నేను గుట్టుగా 90 సంవత్సరాలు గడిపాను. ఇప్పుడు నాపేరు వీధిపాలు చేస్తారా?" అన్నాడట. ముఖ్యమంత్రి మాటలాడలేకపోయారు.

## 24 భక్తుడు ద్వేషించడు

భక్తుని మొదటి లక్షణము "అద్వేష్టా సర్వభూతానాం అని మరల నిక్కడ 'నద్వేష్టి' అనే గుణాన్ని ప్రసాదించాడు గీతాచార్యుడు. ఆధ్యాత్మిక విషయాల్లో పునరుక్తి దోషము ఉండదు. మరీమరీ చెప్పితే భావం మరింత హృదయానికి హత్తుకొని పోతుంది.

1883లో దయానందస్వామిగారికి విషప్రయోగం జరిగింది. ఆయన అంతిమ గడియల్లో వున్నాడు. నేరస్తుడు పట్టుబడ్డాడు. దీనికి ఏమి శిక్ష విధించాలి? అని శిష్యులు అడిగారు. ఆదర్శ మానవతావాదియైన స్వామి ఇట్లా అన్నారు. "నేను మానవజన్మ ఎత్తింది మానవులను బంధవిముక్తులుగా జేయుటకేగాని బంధాలలో పడవేసేందుకు కాదు. కనుక ఆ వ్యక్తికి ఏదైనా బహుమానాన్నిచ్చి పంపండి.

"అపకారికి ఉపకారము నెపమెన్నక చేయువాడు నేర్పరి సుమతీ!" అందుకే ఇట్లాంటి మహనీయులు భగవంతునికి ప్రీతిపాత్రులు.

## 25 భక్తుడు శోచించడు (నశోచతి)

'నశోచతి' అనేది భక్తుని మరొక లక్షణము. ఎంత ప్రమాదముకాని అతడు శోచించడు. కష్టాలు కర్మతో వస్తాయి, శోకం అజ్ఞానంతో వస్తుంది.

భక్తుడు, జ్ఞాని శోకాలు వచ్చిన శోకించడు. కష్టసుఖాలు భగవంతుని వర ప్రసాదములు–పూర్వజన్మకర్మల ఫలమువలన కష్ట సుఖాలు వస్తూంటాయి. కనుక విజ్ఞులు కష్టాలువస్తే శోకించరు. శోకిస్తే క్రొత్త కర్మ వస్తుంది. పురాకృతకర్మ, సంతోషంగా అనుభవిస్తే తగ్గిపోతుంది. శోకంతో అనుభవిస్తే అధికమవుతుంది. ఆస్తి పోయింది. భార్యాబిడ్డలు పోయారు. ఒక భక్తునికి కర్మ సంబంధాలు తొలగిపోయాయి. ఇక నిర్నిబంధంగా భగవంతుని సేవించ వచ్చునని తృప్తి చెందాడు. "రాకన్ మానవు హానివృద్ధులు మహారణ్యాబుంసన్ డాగినన్" అన్నాడు భాగవతకారుడు. పాలకుండ పగిలిపోయింది. నేలపాలైన పాలకొరకు విచారిస్తే లాభం లేదు. (Face events boldly) పరిస్థితులను ధైర్యంతో ఎదుర్కో అని ఉద్బోధించింది అనీబిసెంటు. ఇంతకన్నా విపత్కరమైన ఆపద రాలేదు కదా! అని భగవంతునికి అంజలి ఘటిస్తారు విజ్ఞులైన భక్తులు, జ్ఞానులు.

## 26 భక్తులు ఏమీ కాంక్షించరు

"న కాంక్షతి" అనేది భక్తునియొక్క మరొక లక్షణము. భగవంతునికి సర్వమూ సమర్పించినవాడు భక్తుడు–తనకు యేమి కావలెనో స్వామికి బాగుగా తెలుసు. నరసింహస్వామి ప్రహ్లాదుని తనకేమి కావలెనో కోరుకోమన్నాడు. "స్వామీ! నీ మాటను కాదనలేను. వరమిచ్చేతీరాలని నీ అభిప్రాయమైతే నా హృదయంలో యేకోరిక లేకుండేటట్లు వరాన్ని ప్రసాదించమన్నాడు" భక్త ప్రహ్లాదుడు.

"యది దాస్యసి మే కామాన్ వరాం స్త్వం వరదర్షభ ।
కామానాం హృద్య సంరోహం భవతస్తు వరం వృణే॥"

"కోరికలు సింహాన్ని గ్రామసింహము చేస్తాయి అన్నారు స్వామి రామతీర్థ. ఒక ఫకీరు రాజప్రసాదంవైపు పోతూన్నాడు. నవాబు అతనిని చూచి తన దర్బారుకు రమ్మని ఆహ్వానించాడు. ఫకీరు అతనిని అనుసరించాడు. దర్బారులో ప్రవేశించిన నవాబు "మక్కా" వైపు తిరిగి అల్లాను ఏమో కోరుతూండడం గమనించాడు ఫకీరు. అది చూచి ఫకీరు వెనుకకు మళ్లాడు. నవాబు అతనిని చూచి నీకేమైనా కావాలా? అని ప్రశ్నించాడు "ప్రభూ మీరు దేవుణ్ణి కోరికలు తీర్చమని ప్రార్థిస్తూన్నారు, కోరికలు కోరేవాణ్ని నేనేమి

కోరేది? వంగినవాని క్రింద వంగడం నా కలవాటు కాదు. ఏమైనా కోర దలిస్తే ఆ భగవంతుడ్నే కోరుతాను" అని వెళ్ళిపోయాడు ఫకీరు.

కోరికలు కోరడంలో వివేకము వుండాలి – ఉపనిషత్తు చెప్తుంది. 'సహేంద్రో మేధయా స్ప్రుణోతు తతోమే శ్రియ మావహ' ఈ మంత్రంయొక్క భావం యేమంటే "భగవాన్ నాకు మొట్టమొదట మేధాశక్తిని, ప్రజ్ఞను ప్రసాదించు తర్వాత సంపదను ప్రసాదించు తెలివిలేని సంపద నిష్ప్ర యోజనము. విజ్ఞానికి సంపద ఉంటే అది సత్ప్రయోజనమవుతుంది–నాసంపద జ్ఞానార్తులకు దుఃఖార్తులకు ఉపయోగపడును గాక! అని ఉపనిషత్తులో ఒక మంత్రం ఉంది. "అమాయంతు బ్రహ్మచారిణి స్వాహా ప్రమాయంతు బ్రహ్మచారిణః స్వాహా."

సుఖాలు పెరుగకముందే వివేకం పెంచుకోవాలి. ఒక సన్యాసి అన్నాడు "నాకు గడ్డం పెరిగిందే కాని తెలివి పెరుగలేదు." అని

కనుక ప్రజ్ఞానిధియైన సంసారి కోరికలు కోరవలసివస్తే రంతిదేవుని మాదిరి కోరికలు కోరాలి.

"నీ పాద కమల సేవయు నీ పాదార్చకుల తోడి నెయ్యము నితాంతా పార భూత దయయును తాపసమందార నాకు దయసేయగదే"

కోరికలు కోరవలసివస్తె అన్నిటికన్న ఉత్తమమైన కోరిక, కోరికలు లేకుండాచేయుమని ప్రహ్లాదునివలె కోరడమే చక్కని కోరిక.

## 27 భక్తుడు శుభాశుభములను పరిత్యజించినవాడు

"వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః" సర్వము వాసుదేవ మయం అనే భావన వుండేవారు అరుదు. భక్తుడు సర్వం వాసుదేవమయం అని భావిస్తాడు. జ్ఞాని "సర్వం ఖల్విదం బ్రహ్మ" అని తలపోస్తాడు. ఇట్లాంటి వారికి శుభము లేదు. అశుభము లేదు. అంతా శుభమే. అతని దృష్టిలో శుభంకరుడైన వేంకటేశ్వరస్వామి సన్నిధిలో వలె అన్నీ శుభముహూర్తాలే. ఆయనకు నిత్యకళ్యాణం పచ్చతోరణం.

విశ్వమే విష్ణుమయమైనపుడు విష్ణువుకాని విషయమే లేదు. అట్లాంట ప్పుడు శుభాశుభముల ప్రసక్తే లేదు. ఎడమచేయి పాకిపని చేస్తుంది. కుడి

చేయి భోజనం పని చేస్తుంది. ఈ రెండు చేతులే కదా! కనుక శుభాశుభాలు భగవంతుని రెండు చేతులు. అద్వైతంలో శుభాశుభాలకు చలామణి లేదు.

## 28 భక్తుడు శత్రువులందు మిత్రులందు సమభావన కలవారు

భక్తుడు ద్వంద్వములకు అతీతుడు. సర్వాత్మభావంతో పుష్టినొందిన వారికి శత్రువులెవరు? మిత్రులెవరు? అందరు అతనికి హితులే. "నాకు శత్రువులు లేరు. మిత్రులు లేరు. అందరు నాకు గురువులే" అన్నాడొక మహాత్ముడు.

ఒకవేళ శత్రువులున్నా వారిని తమ ప్రేమశక్తిచే మిత్రులను గావించుకోవచ్చు. కామక్రోధాదులు అరిషడ్వర్గాలుగా పేరొందినాయి. కాని వాటిని మిత్రులుగా చేసికొనవచ్చు. కామక్రోధాదులకు మూలము స్వార్థము. కామాన్ని ధర్మయుక్తం చేస్తే అది ప్రేమగా మారుతుంది. ధర్మమునకు విరుద్ధముకాని కామాన్ని నేనే అంటారు కృష్ణపరమాత్మ (ధర్మావిరుద్ధోభూతేషు కామోస్మి భరతవర్షభ). అట్లాగే క్రోధమును సత్యంతో జోడిస్తే అది సత్యాగ్రహమవు తుంది. సత్యాగ్రహంతో భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందింది. అట్లాగే లోభములోని, స్వార్థాన్ని మినహాయిస్తే అది పొదుపరితనంగా మారుతుంది. మోహంలోని స్వార్థాన్ని అజ్ఞానాన్ని తీసివేస్తే అది పవిత్రప్రేమగా మారుతుంది. మదం లోని స్వార్థాన్ని, కామాన్ని రాగాన్ని తీసివేస్తే అది అత్యంత శక్తివంత మైన సాధనంగా మారుతుంది. ఆంజనేయులులోని బలం ఇందుకు తార్కాణం. అతని బలం రామసేవలో అత్యంత ఉపయుక్తంగా మారింది. బలం బలవతాం చాహాం కామ రాగ వివర్జితం)మాత్సర్యం అసూయలోని స్వార్థాన్ని తీసివేస్తె. అది స్పర్థ (Healthy Competetion) గా మారుతుంది, ఇతరులు బాగుపడుతారు. కామక్రోధాదులు అతి శక్తివంతములు. వాటిని మిత్రులుగా చేసుకోవాలి. "అహం బ్రహ్మాస్మి" అనే భావం కలవారికి శత్రువులెవరు? అందరు ఆత్మీయులే.

మిత్రులు మనలోని మంచినే చూస్తారు-శత్రువులు మనలోని లోపాలనే చూస్తారు. శత్రువులు మనలోని లోపాలను ఎత్తిచూపించి మన లోపాలను సంస్కరింప జేసికొనేందుకు సహకరిస్తారు– కనుక "శత్రవేనమః"

భక్తి భావాల్లో వైరభక్తి ఒకటి. కంసాదులు వైరభక్తితో త్వరితముగా మోక్షాన్ని పొందగల్గినారు.

శత్రుత్వం మిత్రుత్వం మన మనస్సులో ఉండి. మనసును స్వాధీన పరచుకొన్న మహానుభావులకు శత్రువులూ లేరు— మిత్రులూ లేరు— అందరూ హితులే

## 29 భక్తుడు మానావమానాలను సమానంగా చూస్తాడు

మానావమానములను సమబుద్ధితో చూపగల్గుతాడు జ్ఞాని, భక్తుడు.

సన్మానాలు మానవుని అహంకారాన్ని అభివృద్ధి చేస్తాయి. ఒక మహా కవికి ఎపుడు సన్మానాలు జరుగుతూ వుండేవి. చాలా విలువైన దుశ్శాలు వలతో సత్కరిస్తూ ఉండేవారు. ఒకతూరి ఒక సన్మానంలో సామాన్యమైన శాలువ బహూకరిస్తే అతనన్నాడు "చాలా బాగుంది. నా భార్య వడియాలు పెట్టేందుకు మంచి వస్త్రము లేదనింది. ఇది అందుకు ఉపయోగిస్తాను" అన్నాడట ఆ మహాకవి. "గ్రంథాలు వ్రాయవచ్చు. ఉపన్యాసాలు దంచవచ్చు కాని అహంకారాన్ని తగ్గించుకోలేరు" దురహంకారులు. మానాన్ని హననం చేశాడు కాబట్టి అతను "హనుమ' అయ్యాడు. పట్టాభిషేక కాలంలో సీతా మహామాత ఒక అమూల్యమైన రత్నహారాన్ని బహూకరిస్తే దాని పటపట కొరికాడట! "హనుమా" నీకోతిబుద్ధి మానలేదే" అని అమ్మ అంటే లేదు తల్లీ! ఈ రత్నాలలో రామనామం ఉందా? లేదా అని చూచాను. రామనామం లేని రత్నం నాకు గాజుపెంకుతో సమానం. ఇది నిజమైన మానావమానముల యెడగల సమభావం.

Foot Ball లో గాలి ఉన్నంతవరకు దానికి కాలి తన్నులు తప్పవు, "అవమానాత్ తపో వృద్ధిః" "సన్మానాత్ తపక్షయః" అని మనుస్మృతి వాక్యము. సన్మానములతో తపస్సు క్షీణిస్తుంది. అహంకారం అధికమవు చుంది, అవమానాలతో తపస్సు వర్ధిల్లుతుంది. అహంకారం క్షీణిస్తుంది.

అవమానాన్ని వివేకి ఆత్మోన్నతికి ఉపయోగిస్తాడు. ధ్రువుడు అవ మానపడి విష్ణుపదాన్ని పొందాడు. యామునాచార్యులు తాను పొందిన అవమానాన్ని బహుమానంగా భావించాడు. చెప్పుల హారంతో ఆచార్యుల

మార్గాన్ని అడ్డుకట్టి ఆచార్యులను అవమానపదలిచారు శత్రువులు. ఆచార్యుల వారు వాటికి నమస్కరించి, నావంటి అసమర్థులకు భక్తుల పాదరక్షలే రక్ష అంటూ అవమానించదలచినవారిని అవమానితులుగా చేశాడు.

ఒక తూరి బుద్ధ భగవానుడు దారివెంట పోతూన్నాడు. గుమ్మందగ్గర నిలబడి ఒక బ్రాహ్మణుడు వారిని నోరు నొచ్చేవరకు తిట్టినాడు. బుద్ధుడు కిమ్మనలేదు. "ఏమితిట్టినా ఏమీ పలుకవే" యేమి నీ సంగతి అన్నాడు బౌద్ధమత ద్వేషియైన ఆ బ్రాహ్మణుడు.

"నీదంతా ముగిసిందా? ఇక విను. మీ ఇంటికి ఎవరైనా అతిథి వచ్చినపుడు నీవెన్నో రుచికరమైన పదార్థాలు తినేదానికి ఇస్తావు. అతను ససేమిరా తినను అంటే నీవు ఏమి చేస్తావు?" "నేను తింటాను" అన్నాడు బ్రాహ్మణుడు.

"ఇది కూడా అంతే. నీవు రుచికరమైన 'తిట్లు' అనే ఫలహారాన్ని నాకు ఇచ్చావు. నేను తినలేను. ఇక వాటిని నీవే ఆరగించు" అన్నాడట బుద్ధుడు.

పోస్టువాడు ఒక మనియార్డరు యిచ్చాడు. అది వాపసుచేస్తే ఏమవుతుంది? పంపినవానికే చేరుతుంది.

మనలను ఎవరో నిందించారని తెలిసింది. ఆ నింద నా దేహానికి సంబంధించిదైతే మరీ ఆనందం. ఎందుకంటే ఈ మలమూత్రములతో కూడిన దేహాన్ని నిందించితే తప్పేమి? లేదు నా ఆత్మను నిందించాడా వాని ఆత్మ నా ఆత్మ ఒకటే. కనుక వాడు తననే నిందించుకున్న వాడవుతాడు.

విజ్ఞుడైన భక్తుడు లేక జ్ఞాని మానావమానాల్లో స్థిమితాన్ని కోల్పోడు. తబ్బిబ్బులు కాడు. మానాన్ని అనుకూల భావంలో అవమానాన్ని ప్రతికూల భావంతో చూచి సమబుద్ధితో వ్యవహరించి శాంతుడై స్వస్థుడై వుంటాడు.

## 30 శీతోష్ణ సుఖదుఃఖములయెడ సమ భావము కల్గియుంటాడు

మానావమానాలు శత్రుత్వ మిత్రత్వాలు మనసుకు సంబంధించినవి. శీతోష్ణ సుఖదుఃఖాలు శరీరానికి సంబంధించినవి. "సృష్టిని మార్చలేము

దృష్టిని మార్చుకో" అన్నది పెద్దల మాట. ఎండకాలములో చల్లని నీటిని కోరుతాము. చలికాలంలో వేడి వేడి కాఫీనో, టీనో కోరుతాము. ఎండ కాలంలో ఎండగా వుండుట ప్రకృతి స్వభావం. ఎండలో పోవాల్సివస్తే గొడుగు పట్టుకొని ఎండను సహించాలి. వానాకాలంలో గొడుగు సహాయంతో వానలో వెళ్లవచ్చు. మార్చలేని ప్రకృతి ధర్మాలను విజ్ఞతతో సహించవచ్చు. భరించ వచ్చు త్రోవలో ముండ్లు ఉంటాయి. వాటినన్నిటిని ఏరిపారవేయ లేము కదా! కనుక గట్టి చెప్పులు వేసుకుంటే ముండ్ల బాధ వుండదు.

సుఖదుఃఖాలు కావడి కుండలవంటివి. అవి వస్తూంటాయి. పోతుంటాయి. "ఆగమాపాయినః అనిత్యాః తాంతి తిక్షస్వ భారత" అనిత్యాలు వచ్చి పోతూంటే ఈ సుఖదుఃఖాలను సమదృష్టితో చూడడం నేర్చుకోవాలి. "రాకన్ మాసపు హానివృద్ధులు మహారణ్యంబులో డాగినన్" కనుక పూర్వ జన్మ సుకృత దుష్కృతాల ఫలితంగా ఈ సుఖదుఃఖాలు వస్తుంటాయి. వాటిని వివేకంతో భరించాలి. సుఖాలు మనలను భగవంతుని మీది దృష్టినుండి మరిపిస్తాయి. దుఃఖాలు భగవంతుని జ్ఞాపకం చేస్తూవుంటాయి. సంకట బందరే వెంకటరమణ" అనే నానుడి వుంది. సంకటాలు వస్తే వెంకటరమణుడు జ్ఞాపకం వస్తాడు. ఒక విధంగా దుఃఖాలు మానవునికి ఎంతో మేలుచేస్తాయి. కష్టాలు భరించే శక్తి లభిస్తుంది. భగవంతుని మరచిపోము. అందుకే కుంతీదేవి, "స్వామీ? నాకు కష్టాలే యిస్తూండు. ఎందుకంటే కష్టాల్లో నిన్ను మరచిపోను. కష్టాలు వచ్చినప్పుడు ఇంతకన్నా అధికమైన కష్టాలు రాలేదని తృప్తి చెందాలి. ఈ కష్టంకూడా ఎంతో కాలం ఉండదు" అని భావించి కష్టాలను ఎదుర్కోవాలి

"సుఖదుఃఖాలను తేలికగానే భరించగల్గెడి బలంబునిమ్ము" అని భగవంతుని ప్రార్థించాడు రవీంద్రుడు. కార్యసాధకుడు సుఖదుఃఖాలను గణించడు. "Sweet are the uses of Adversity" అన్నాడు షేక్స్పియర్ మహాకవి "కష్టసుఖాలు అతి మధురమైనవి"

కుచేలుడు కష్టాలతో సతమతమవుతున్నాడు. కాని ఏనాడు కృష్ణుని మరువలేదు. కృష్ణుని సన్మానించినపుడు పొంగలేదు. ఏమి యివ్వక రిక్త హస్తాలతో వాపసు పోతూ దుఃఖించలేదు. దరిద్రుడు సంపదంధుడై తనను మరచునేమోనని తనకు సంపదలివ్వలేదని తృప్తిగా యింటికి వెళ్లేడు.

కాబట్టి మనసును సమాధానపరచి విజ్ఞతతో వివేకంతో కష్టసుఖాలను ఎదుర్కోవాలి.

దుఃఖేష్వను ద్విగ్నమనాః సుఖేషు విగత స్పృహః
వీత రాగ భయక్రోధః స్థితధీ ర్ముని రుచ్యతే॥

అని స్థితప్రజ్ఞుని ప్రస్తుతిస్తుంది భగవద్గీత.

## 31. నిందాస్తుతులను సమభావంతో చూచుట

ఇతరుల లోపాలను ప్రచారం చేసి సంతోషిస్తాడు సామాన్య మానవుడు. నింద అంటే వున్న దోషాల ప్రచారం. అపనింద అంటే లేని దోషాలను ఇతరులలో ఆరోపించుట. ఈ రెండు విధానాలు నాగరికుడు చేయకూడనివి. ఈ దుష్ప్రచారం వలన మూడు దోషాలు సంభవిస్తాయి. ప్రచారం చేసేవాని మనసు కలుషితమవుతుంది. నిందితునిలో నిజంగా దోషం వుంటే అది బలపడుతుంది. మూడవది వాతావరణం కలుషితమవుతుంది. అపనిందల వలన కలిగే దుష్ఫలితాలను గురించిన కథ ఒకటుంది.

ఒకప్పుడు ఒక సద్బ్రాహ్మణుడుండేవాడు. అతను తెలిసి ఏపాపం చేయలేదు. అతను మరణించినాడు. నరకంలోకి వెళ్ళాడు. అక్కడ కొండంత పెంటకుప్ప కనబడింది. ఇది ఏమి అని ప్రశ్నిస్తే "అది తాను తెలియక చేసిన పాపాలు. ఈ పెంటను నీవుతినక తప్పదు" అని అక్కడి యమభటులు చెప్పారు. "అట్లాగైతే ఈ పాపాలనుండి విముక్తి ఎట్లా కల్గుతుంది?" అని ప్రశ్నించాడు. ఈ పాపం దుష్ప్రచారము చేసినవాళ్ళు పంచుకుంటారు అని అక్కడివారు చెప్పారు.

మరుజన్మలో అతను సంపన్న గృహస్థుగా జన్మించాడు. విధివశాత్తు అతని కుమార్తె చిన్నతనంలోనే భర్తను కోల్పోయింది. అమ్మాయిని ఇంటికి తెచ్చుకున్నాడు. ఆమెకు ప్రత్యేకంగా ఒక యిల్లు ఏర్పాటు చేశాడు. కొంత కాలానికి అతని భార్య చనిపోయింది. ప్రతిరోజు సాయంత్రం చీకటిపడిన తర్వాత భోజనంచేసి తాంబూలం రంగరించి, ముస్తాబై విధవరాలైన బిడ్డ యింటికి వెళ్లి పండుకొనేవాడు. కొంత కాలానికి గ్రామస్థులు అతనిపై దుష్ప్రచారం ప్రారంభించారు. బిడ్డకు తండ్రికి అక్రమ సంబంధం కల్గించి

ప్రచారం చేశారు. కొన్నాళ్లకు ఈతను చనిపోయాడు. నరకంలోకి వెళ్ళి చూస్తే, తాను అనుభవించవలసిన పెంటకుప్ప తగ్గిపోయింది. ఇందుకు కారణం అపనిందలు ప్రచారం చేసిన వ్యక్తులకు ఆ పెంటకుప్ప పంచిపెట్టడం జరిగింది. కనుక అపనిందవలన ఇతరులు తెలియక చేసిన పాపఫలితాలను నిందించేవారు అనుభవించవలసి వస్తుంది.

నిందలను సమదృష్టితో చూస్తే, విజ్ఞుడైనవాడు ఆత్మపరిశీలన చేసికొని తన లోపాలను సవరించుకుంటాడు. తన్ను అపనిందలపాలు చేసినవారిపై ప్రతీకారభావంతో మెలగక, వారు అజ్ఞానంతో చేసిన తప్పును క్షమించి, వారిలో సుజ్ఞానం కలుగుగాక అని వారికి సద్భావపరంపరలను పంపితే ఇరుపక్షాలవారు మేలు పొందుతారు.

కనుక నిందాపనిందలు చేసేవారిని ఉదాసీన భావంతో చూచుట విజ్ఞుని లక్షణం. భక్తుడు, జ్ఞాని నిందాపనిందలను సమభావంతో చూస్తారు.

అట్లాగే ఇతరులు తన్ను పొగిడితే నిర్లిప్తతతో వ్యవహరిస్తారు విజ్ఞులు.

ఆంజనేయుని బలాన్ని చూచి లంకలోని రాక్షసులు ఆశ్చర్యపడగ, అతనంటాడు "వానర సేనలో నేనత్యంత నికృష్టుడను. నన్నుమించిన వారెందరో కలరు."

ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీను యొక్క మేధావిత్వాన్ని పొగిడితే ఆయన అన్నాడట "నా కన్నా జ్ఞానవంతులు ఎందరో ఉన్నారు. నాకు తెలిసింది సముద్రతీరంలోని ఇసుకదిబ్బలోని ఒక రేణువు మాత్రమే" అన్నాడట.

కనుక విజ్ఞులు నిందాస్తుతులను సమభావంతో చూస్తారు.

## 32 ముని - మౌనము

భక్తుడు ముని ప్రవృత్తి కలవాడు. అతడు మౌనాన్ని అభ్యసిస్తాడు

మిత భాషిత్వం మిక్కిలి మేలు
మౌనాభ్యాసం అంతకు మేలు
మాటలాడగ వలసినపుడు।
సత్యదయా సహకారం పూర్వకముగ
మాటలాడుటే యోగాభ్యాసం।

అని పరమగురు చరణ సన్నిధి ప్రబోధిస్తుంది. మౌనం రెండు విధాలు. బాహ్యమౌనం, అంతర్మౌనం. నోరు మాట్లాడకున్నా, లోన మనసు గందరగోళంగా మాట్లాడుతూంటుంది. నోరు మాట్లాడకూడదు, మనసులో ఆలోచనలుండరాదు. ఇది అభ్యాసంవలన లభిస్తుంది. "ఊరకుండువాడు ఉత్తముండు" అంటాడు వేమన. 'Speech is Silver, Silence is Gold' అనే నానుడి వుంది. మాటలాడుట వెండి అయితే, మౌనము బంగారము.

కొందరు అభ్యాసకులు మౌనంగా వుండేటప్పుడు ఇతరులకు తన భావాలు చెప్పాలంటే పలక మీదనో, కాగితం మీదనో వ్రాస్తారు. ఇది మౌనం కాదు. డాంబికాచారం.

"మౌనం చైవాస్మిగుహ్యానాం" రహస్యములో నేను మౌనాన్ని అని భగవంతుడు గీతలో మౌనానికి దివ్యత్వాన్ని ఆపాదించాడు. మౌనము భగవంతుని విభూతి.

మౌనంతో ధ్యానం చేస్తూ, సద్భావాలను ప్రసారం చేయవచ్చు. ఉపన్యాసాలు ఇచ్చేదానికంటే, మౌనంతో సద్భావాలను ఇతరులకు పొందచేయుట ఎంతో శ్రేష్ఠము; అందుకే దక్షిణామూర్తి మౌన వ్యాఖ్యతో శిష్యుల సందేహాలు తీర్చేవాడని ప్రసిద్ధి.

మహాభారత రచన పూర్తి అయింది. వేదవ్యాసుడు హాయిగా గాలి పీల్చుకున్నాడు. గణపతి ఘంటం క్రింద పెట్టాడు. "రచన ప్రారంభించినప్పటినుండి. నీవు మాట్లాడలేదు. నేను ఎన్ని శ్లోకాలు చెప్పినానో నీవు నోరు మెదప లేదు. నాతో చక్కగా సహకరించినావు. ఇంతటి మౌనం నీకెట్లు సాధ్యమయింది?" అని వ్యాసుడు ప్రశ్నించాడు.

గణపతి చెప్పిన సమాధానం "మహర్షీ, ప్రాణశక్తి అందరిలోను వుంది. ఆ ప్రాణశక్తిని పూర్తిగా వుపయోగించాలంటే చాలా సంయమం అవసరం. ఇందులో మొదటిది వాఙ్మయం. ఈ నియమం లేకుంటే నాలుక వూరికే మాట్లాడుతూవుంటుంది. తద్వారా ప్రాణశక్తి క్షీణిస్తుంది. ప్రాణశక్తిని వ్యర్థంకాకుండా నేను సంయమాన్ని పాటించి, మౌనంగా మీరు చెప్పినది వ్రాస్తూపోయినాను.

మనసు మౌనంగా వుండడమంటే ఏ ఆలోచనా రాకుండా, మనసు

ఏకాగ్రంగా ఉండాలి. అట్టి మనసును బుద్ధితో లయంచేసి, అబుద్ధిని ఆత్మతో లయం చేయగల్గితే సమాధి స్థితి లభిస్తుంది.

సత్యంగా, హితంగా, ప్రియంగా మాటలాడుట మౌనముతో సమానమని విజ్ఞులు భావించినారు. "మౌనేన మనీషి" మౌనంచేత మనిషి, మనీషిగా మారగల్గుతాడు. మాటల గందరగోళం, మనసుకు అశాంతి కలుగజేస్తుంది. నోటి మాటలు మానాలి. మనసు ఆలోచనలు మానాలి. అపుడే ఏకాగ్రత లభిస్తుంది.

మౌనం గాంభీర్యతను సూచిస్తుంది. నిండుతనాన్ని సూచిస్తుంది. నిండు కుండ తొణకదు.

గాంధీగారి గదిలో మూడు కోతి బొమ్మలు వుండేవి. ఒకటి చెవులు మూసుకున్నది. రెండవది కన్నులు మూసుకున్నది. మూడవది నోరు మూసుకున్నది. చెడును వినవద్దు, చెడును చూపవద్దు, చెడును మాట్లాడ వద్దు. అని మూడు బొమ్మల రహస్యం.

కర్మేంద్రియాలను సంయమం చేయు సాధనలో మౌనం ప్రధానమైంది. రమణ మహర్షి మౌనంలో ఎందరికో సందేహాలు తీర్చగల్గినాడు.

కనుక విజ్ఞులైన జ్ఞానులు మౌనాన్ని పాటిస్తారు.

## 33 భక్తుడు - లభించిన దానితో తృప్తి చెందును.

"సంతుష్టో యేనకేనచిత్" అనేది భక్తుని లక్షణము. అనగా లభించిన దానితో తృప్తి చెందువాడు. తుష్టి అంటే సంతోషము. ఏది లభిస్తే దానితో తృప్తి చెందు స్వభావము కల్గియుండుట ఉత్తమ భక్తుని లక్షణము. కృష్ణుడు కుచేలుని సహాధ్యాయి. కుచేలుడు అగర్భ దరిద్రుడు. కాని కృష్ణుడు అంటే అత్యంత భక్తి. 27 గురు సంతానము. తినడానికి కష్టంగా ఉంది. "కృష్ణుడు మీసహాధ్యాయి కదా! అతని దగ్గరికి వెళ్ళితే మన కష్టాలు గట్టెక్కు తాయి అని భార్య జ్ఞాపకం చేసింది." మహారాజు! అతని దగ్గరికి రిక్తహస్తాలతో పోవడమెట్లాగా?" అని ఆలోచింబాడు. భార్య అతని జీర్ణవస్త్రము అంచులో కొన్ని అటుకులు కట్టింది. కృష్ణసందర్శనోత్సాహియై కుచేలుడు ద్వారకకు బయలుదేరినాడు. ధరించిన పంచ, కట్టుకున్న అంగవస్త్రము రెండు

విరిగినాయి ఇట్లాంటి జీర్ణవస్త్రానికి ద్వారకా నగరంలోని కృష్ణమందిరములో ప్రవేశం ఏట్లా లభిస్తుంది? ద్వార పాలకులు ఏమైన పరిధానమిమ్మంటే ఏమి ఇవ్వగలను? సరే! నా భాగ్యమెట్లున్నదో" అని ద్వారకా నగరము చేరినాడు. కృష్ణ మందిరం సమీపించాడు. దూరం నుండే భగవంతుడు అతన్ని గమనించి సింహాసనం దిగి పరుగుపరుగున కుచేలుని ఎదుర్కొని, అక్కున జేర్చి, కుశల ప్రశ్నలడిగి, తనతో అర్ధాసనంపై కూర్చుండబెట్టి, కాళ్లు కడిగి తన వస్త్రంతో తుడిచినాడు. అంతఃపుర వాసులందరికి ఆశ్చర్యం కలిగింది. రుక్మిణీదేవి చామరంతో విసిరి సేదదీర్చింది. చిన్ననాటి ముచ్చట్లు మాట్లాడుకున్నారు. "కుచేలా! నాకు యేమి తెచ్చినావు?" అని అడిగితే కుచేలుడు కుంచించుకుపోయినాడు. కృష్ణుడే అతని వస్త్రాన్ని వెదికి, మూట విప్పి పిడికెడు అటుకులను తింటూ ఎంత బాగున్నని అని మరియొక పిడికెడు తీసికోబోగా రుక్మిణి ఇక చాలు అని వారించింది. తన రాకకు కారణమేమని కృష్ణుడు అడుగలేదు. కుచేలుడు చెప్పలేదు. చూస్తూనే తెలిసింది. స్వామికి కుచేలుని పరిస్థితి. ఆ దినమంతా భక్ష్య భోజ్యాదులతో విందారగించి, హంసతూలికా తల్పంపై నిద్రించినాడు కుచేలుడు. మరుదినం ఇంటికి బయలుదేరగా ద్వారం వరకు వచ్చి వీడ్కోలు చెప్పాడు పరమాత్మ. కొంతదూరం వెళ్ళిన తర్వాత కుచేలునికి ఆలోచన కలిగింది. ఏమి కృష్ణుడు! ఎందుకొచ్చినావని అడుగలేదు. ఇవ్వదలచుకుంటే ఆయన ఏమైన ఇవ్వ గలడు. నా అదృష్టాన్ని ఎవరు మార్చగలరు? బహుశా ఆ కృష్ణుడు తనకు ఏమి ఇవ్వనందుకు కారణము దరిద్రుడు సంపద మదాంధుడై తన్ను మరచు నేమో! యని కాబోలు!" అని తృప్తిగా తన యిల్లు చేరినాడు అతని పూరిగుడిసె రాజభవనంగా మారింది. ఎనలేని ద్రవ్య సంపదలతో నిండియున్నది. ఇంక అతని ఆనందానికి పట్టపగ్గాలు లేవు. కృష్ణుని భక్తితో మనసులో నమస్కరించినాడు. "వ్యాప్తిం జెందక వగవక ప్రాప్తించిన లేశమైన పది వేలనుచున్ తృప్తిం జెందని మనుజుడు సప్తద్వీపములందు చక్కంబడునే "సంతుష్టు డీమూడు జగముల పూజ్యుండు సంతుష్టుకెపుడు కల్గు సుఖము" అని భాగవతము సంతుష్టుని కీర్తించింది.

బ్రాహ్మణుడంటే ఎవరు? అని ప్రశ్నిస్తాడు? అజగర రూపంలోనున్న నహుషుడు. అందుకు ధర్మరాజుపలికిన సమాధానము.

"యేనకేన చిదాచ్ఛన్నో, ఏనకే నవిదాశితః
యత్రక్వచిన్, శాయీస్యాత్, తందేవా బ్రాహ్మణో విదుః"

ఇట్టిది, అట్టిది అని అనుకోరు. ఏ వస్త్రం దొరికితే దాన్ని ధరిస్తాడు. ఏ తిండి దొరికినా రుచిని తలంచక కడుపార భోంచేస్తాడు, ఈ విధంగా అతను ప్రాణాన్ని కాపాడుకుంటాడు. అతడే నిత్యమైన బ్రాహ్మణుడు.

రజియా సూఫీ పంథాలో ఉత్తమకోవకు చెందిన భక్తురాలు, ఒక గుడిసెలో జీవిస్తూంది. భక్తులకు, భగవన్నామ స్మరణ చేసేవారికి ఆమె యింటి తలుపులు తెరిచేవుంటాయి.

ఒక దినము సాధువు ఆమె కుటీరానికి వచ్చాడు. ఆ రాత్రి అక్కడే పడుకున్నాడు. రజియాకు ఉన్న ఒక గోనె సంచి అతనికిచ్చి ఆమె కటిక నేలపై పరుండి హాయిగా నిద్రపోయింది, ఉదయము లేచి ఆ సాధువు రజియాతో "అమ్మా! ఎందుకు ఈ దరిద్రాన్ని అనుభవిస్తున్నావు? అని అన్నాడు. నాకు తెలిసిన ధనవంతులెందరో కలరు. నీవు కోరితే ఎంత సహాయమైనా పొందజేస్తాను" అన్నాడు సాధువు.

రజియా అన్నది "మీ సానుభూతికి వేయి దండాలు. నీకు నాకు ఆ ధనవంతులకు సాయం చేసేవాడు భగవంతుడొక్కడే కదా! బహుశా ఆయనకు ఆ ధనవంతులే జ్ఞాపకం వస్తారేమో? బహుశా ఆయనకు నేను ఇట్లా ఉండడమే ఆయనకిష్టమేమో! ఆయన యిచ్ఛయే జరుగుగాక!

"హరి పదాంభోజ చింతనామృతమున అంతరంగంబు నిండినట్టైన నతడు నిత్య సంపూర్ణుడు" అని భాగవతం ప్రహ్లాదుని ప్రస్తుతిస్తుంది. నాలుక ఆరోగ్యంగా ఉంటే ఏది తిన్నా అది రుచిగా ఉంటుంది. మనసు ఆరోగ్యంగా ఉంటే ఏది ఉన్నా దాంతో తృప్తి లభిస్తుంది. కనుక విజ్ఞులైన భక్తులు, జ్ఞానులు అల్ప సంతోషులు. నిత్య సంతోషులు ఏమీ కోరరు, ఏది లభిస్తే అది భగవంతుని ప్రసాదంగా భావిస్తారు.

## *34 భక్తుడు అనికేతుడు*

'అనికేతుడు' ఇల్లు లేనివాడు సత్రాభోజనం, మఠానిద్ర అనే బాపతు కాదు. భక్తులందరికి యిండ్లు ఉండినాయి, కనుక భావార్థమేమంటే యింటియందు

నివాసమందు మమకారము లేనివాడు. నాల్గవ అధ్యాయములో జ్ఞాని "నిత్య తృప్తుడు, నిరాశ్రయుడు" అని వర్ణించబడినాడు. అతడు దేన్ని ఆశ్రయించడు. అతని ఆశ్రయము పరమాత్మయే. "మన్మనామాముపాశ్రితః" అని జ్ఞానిని వర్ణించింది గీత.

జిడ్డు కృష్ణమూర్తి కొన్ని కోట్ల విలువగల ఆస్తికి అధికారి. అతన్ని లోకగురుడగు మైత్రేయ మహర్షి అవతారం అని భావించారు దివ్యజ్ఞాన సమాజీయులు. అతను అవతారమూర్తియని, ఏనిమిషమైనా ప్రకటించుతాడని అందరు కొండంత ఆశతో వున్నారు. 1929లో జరిగిన మహాసభలో ఈ ప్రకటన జరుగుతుందని భావించారు. కాని వారికి ఆశ్చర్యం కలిగించేటట్లుగా, "నేను అవతారపురుషుడను కాను. మీ వలెనే సామాన్యుణ్ని. నేను గురువును కాదు. మీరు శిష్యులు కారు. మనమందరము సహాధ్యాయులమే" అని ప్రకటించి తనకున్న యావదాస్తిని దాతలకు వాపసు చేసి కట్టుగుడ్డలతో ఏకాకియై నిలిచిపోయాడు. నిజమైన బోధకుడుగా ప్రపంచఖ్యాతి నొందినాడు. నేను World Citizen అని చెప్పగా వసుధయే అతని కుటుంబముగా తలంచిన, భయంలేని జ్ఞానిగా ఖ్యాతి నొందినాడు.

ఒక సన్యాసి ఇట్లా అట్లా తిరుగుచు రాజప్రసాదంలోకి ఎట్లాగో ప్రవేశించి సింహాసనంపై కూర్చొన్నాడు.

రాజు వచ్చి "ఇదేమి సత్రమనుకున్నావా? ఎందుకు ఇక్కడ సింహాసనంపై బైఠాయించినావు?

రాజా! సత్రమంటే యేమి? అని ప్రశ్నించాడు సన్యాసి "వచ్చేవాండ్లు వస్తూంటారు. పోయేవాండ్లు పోతూంటారు. సత్రంలో ఎవరూ ఎంతోకాలం ఉండరు.

మీరు ఎంతకాలం నుండి యిక్కడ ఉన్నారు?
40 సంవత్సరాలు.
మీకంటె ముందు ఎవరు ఉన్నారు?
నా తండ్రి.
అంతకు ముందు....?
మా తాత.
మీ తర్వాత—?
నా కొడుకు.

కనుక మహారాజా! వచ్చేవాండ్లు వస్తుంటారు. పోయే వాండ్లు పోతూవుంటారు, ఈ రాజభవనం సత్రంకాక మరేమి? నేను వెళ్ళుతాను" అని సన్యాసి వెళ్ళి పోయాడు.

"నీ యింటిలో నీవు అతిథిగా వుండు. యజమానిగా వుండు. పూజారిగా వుండు" అన్నాడు రామకృష్ణపరమహంస.

ఇది మూన్నాళ్ళ ముచ్చట. ఎందుకు నీకీ అహంభావం?

కనుక భక్తుడు నిరాశ్రయభావం కలవాడు.

నారదుడు అనికేతుడు ఒక చోట వుండరు. లోకసంచారి. నారాయణ స్మరణచేస్తూ ఎప్పుడూ తిరుగుతూ వుంటారు.

## 35 స్థిరమతి

భక్తుడు స్థిరమతి, లేక స్థిత ప్రజ్ఞుడు. భక్తునికి, జ్ఞానికి ఉండే లక్షణా లన్నీ ఒకటే.

ఇంతకుముందు "అనికేతః" అని వర్ణించినాడు. ఇప్పుడు స్థిరమతి అంటున్నాడు, కృష్ణదేవుడు ఇల్లు లేనివాడు. కాని అతని మతి మాత్రం స్థిరంగా ఉంది. ఇది పరస్పర విరుద్ధం కాదా?

ఒక నాట్యరాణి నెత్తిన బిందెలు పెట్టుకొని వుంది. చేతిలో దీపాలు పెట్టుకుంది. గిరగిర తిరుగుతూ వుంది. కాళ్లు తట్టుతూ నాట్యం చేస్తూంది. దేహేంద్రియాలు పనులు చేస్తూన్నా, తాను గిర్రున తిరుగుతూ వున్నా, మనసు మాత్రం భావంపై, తాళంపై ఏకాగ్రంగా వుంది.

అట్లాగా దేహేంద్రియాలు పని చేస్తూన్నా, సంసారంలో సతమతమవు తున్నా, ద్వంద్వాల తాకిడి తింటున్నా, స్థిత ప్రజ్ఞుడు తన మతిని కోల్పోలేదు. మతి స్థిరంగా వుంది. తిరుగలి పై రాయి తిరుగున్నా, క్రింద రాయి స్థిరగాం వుంది. మహాత్మాగాంధీ ఎందరితో మాట్లాడుతూ వుండినా రాట్నంపైన నూలు వడుకుతూనే వుండేవారు.

"గానంబుల్ నటనంబు తాళగతులన్ గావించుచున్ వి
ద్యానైపుణ్యము చూపుచున్, శిరము మీదన్ గల్గు పెందొంతరన్

బూనికు గై కొను నాట్యశీలుని గతిన్ పుంఖాను పుంఖంబుగన్
నానార్థానుభవజ్ఞుడయ్యు బుధు డానం దాత్మ గాంచున్ మదిన్"

భక్తుడు కూడ ఎట్లాగే స్థిత ప్రజ్ఞుడై వ్యవహరిస్తాడు. గోరా కుంభార్ మట్టిని త్రొక్కుచూ, 'విఠలా విఠలా' అని గానం చేస్తూ మైమరచి విఠ్ఠలుని భజిస్తూన్నారు. అతని కొడుకు జోగాడుకుంటూ ఆ మట్టిలోకి వెళ్లాడు. సమాధ్యవ్యస్థలో నున్నారు గోరా. అతన్ని కూడ మట్టిలో త్రొక్కివేశాడు. తుదకు భగవంతుడే ఆ బాలునికి ప్రాణం పోశాడు.

అట్లాంటి పరిస్థితులల్లో వుంటాడు భగవంతునికి ప్రియతముడైన భక్త శిఖామణి.

గతి ఎట్లున్నా, మతి స్థిరంగా ఉంటుంది భగవంతుని వలగొన్న భక్తునికి.

ఇట్లాంటి లక్షణాలు గల భక్తుడే భగవంతునికి ప్రియాతి ప్రియుడు.

★

# ఫలశ్రుతి

సాధకుడు భక్తుడుగాని, జ్ఞానిగాని, కర్మయోగికాని కొన్ని గుణాలను పొందియుంటాడు.

2వ అధ్యాయంలో స్థితప్రజ్ఞుని లక్షణాలు వర్ణించబడినాయి.

దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।
వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥ 56

యః సర్వత్రానభిస్నేహః తత్తత్ ప్రాప్య శుభాశుభమ్ ।
నాభినందతి న ద్వేష్టి, తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 57

తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।
వశే హి యస్యేన్ద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 61

రాగాద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్ ।
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి ॥ 64

తస్మాద్యస్య మహాబాహో । నిగృహీతాని సర్వశః ।
ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 68

విహాయ కామాన్ యస్సర్వాన్ పుమాంశ్చరతి నిస్స్పృహః ।
నిర్మమో నిరహంకారః స శాంతిమధిగచ్ఛతి ॥ 71

3వ అధ్యాయం, కర్మయోగం.

నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః ।
శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః ॥ 8

యస్త్వాత్మరతి రేవ స్యాత్ ఆత్మతృప్తశ్చ మానవః ।
ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే ॥ 17

తస్మాదసక్తస్సతతం కార్యం కర్మ సమాచర ।
అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః 19

మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా
నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః ॥ 30

తస్మాత్త్వమింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ ।
పాప్మానం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాన నాశనమ్ ॥ 41

4వ అధ్యాయం, జ్ఞానయోగం.

వీతరాగ భయక్రోధాః మన్మయా మాముపాశ్రితాః ।
బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః ॥ 10

త్యక్త్వా కర్మఫలాసఙ్గం నిత్యతృప్తో నిరాశ్రయః
కర్మణ్యభిప్రవృత్తోఽపి నైవ కిఞ్చిత్కరోతి సః 20

నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః ।
శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥ 21

యదృచ్ఛాలాభసన్తుష్టో ద్వన్ద్వాతీతో విమత్సరః ।
సమసిద్ధావసిద్ధౌ చ కృత్వాఽపి న నిబధ్యతే ॥ 22

గతసఙ్గస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతసః ।
యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥ 23

శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరస్సంయతేన్ద్రియః ।
జ్ఞానం లబ్ధ్వా పరాం శాన్తిమ్ అచిరేణాధిగచ్ఛతి ॥ 39

5వ అధ్యాయం:—

జ్ఞేయస్స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి ।
నిర్ద్వన్ద్వో హి మహాబాహో । సుఖం బన్ధాత్ప్రముచ్యతే ॥ 3

యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేన్ద్రియః ।
సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥ 7

బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।
లిప్యతె న స పాపేన పద్మపత్రమివామ్భసా ॥ 10

సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।
నవద్వారే పురే దేహీ నైవ కుర్వన్నకారయన్ ॥ 13

తద్బుద్ధయస్తదాత్మానః తన్నిష్ఠాస్తత్పరాయణాః ।
గచ్ఛన్త్య పునరావృత్తిం జ్ఞాన నిర్ధూతకల్మషాః ॥ 17

విద్యావినయసమ్పన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ పణ్డితాస్సమదర్శినః ॥ 18

న ప్రహృష్యేత్ప్రియం ప్రాప్య నోద్విజేత్ప్రాప్య చాప్రియమ్ ।
స్థిరబుద్ధిరసమ్మూఢో బ్రహ్మవిద్బ్రహ్మణి స్థితః ॥ 20

కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్ ।
అభితో బ్రహ్మ నిర్వాణం వర్తతే విదితాత్మనామ్ ॥ 26

యతేంద్రియమనోబుద్ధిః మునిర్మోక్షపరాయణః ।
విగతేచ్ఛాభయక్రోధో యస్సదా ముక్త ఏవ సః ॥ 28

6వ అధ్యాయము:

జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా కూటస్థో విజితేన్ద్రియః ।
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాఞ్చనః ॥ 8

యోగీ యుంజీత సతతం ఆత్మానం రహసి స్థితః ।
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః ॥ 10

ప్రశాన్తమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్ ।
ఉపైతి శాన్తరజసం బ్రహ్మభూతమకల్మషమ్ ॥ 27

సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్రసమదర్శనః ॥ 29

ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।
సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥ 32

యోగినామపి సర్వేషాం మద్గతే నాన్తరాత్మనా ।
శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః ॥ 47

7వ అధ్యాయము:

మయ్యాసక్తమనాః పార్థ । యోగం యుఞ్జన్మదాశ్రయః ।
అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ॥ 1

9వ అధ్యాయము:

సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః ।
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥ 29

మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి యుక్త్వైవమ్ ఆత్మానం మత్పరాయణః ॥ 34

14వ అధ్యాయము:

ఉదాసీనవదాసీనో గుణైర్యో న విచాల్యతే ।
గుణా వర్తన్త ఇత్యేవ యోఽవతిష్ఠతి నేఙ్గతే ॥ 23

సమదుఃఖసుఖస్స్వస్థః సమలోష్టాశ్మకాంచనః ।
తుల్యప్రియాప్రియో ధీరః తుల్యనిందాత్మసంస్తుతిః ॥ 24

మానావమానయోస్తుల్యః తుల్యో మిత్రారిపక్షయోః ।
సర్వారంభ పరిత్యాగీ గుణాతీతస్స ఉచ్యతే ॥ 25

కర్మయోగి, జ్ఞానయోగి, సన్యాసి. రాజయోగి, గుణాతీతులుగ నున్నగు వారందరు పొందవలసిన లక్షణాలన్నీ, భక్తియోగంలో ఆఖరు 8 శ్లోకాల్లో సంక్షిప్త పరచబడినాయి. అధ్యాయాల్లో చిన్నదేకాని, అభ్యాసంలో గొప్పది.

ఇందులో "ధర్మ్యామృతం" పూర్ణంగా వుంది. అమృతం పానం చేసి దేవతలు అమర్త్యులైనారా? వారికి సుఖభోగాలన్నీ కలవు. కాని వారిలో కాని వారిలో శాంతి లేదు. కాని జరామరణం లేని ధర్మ్యామృతం ఈ భక్తియోగంలో లభిస్తుంది, అమృతమనే ఔషధం, ధర్మమనే అనుపానంతో స్వీకరిస్తే భవరోగం తొలుగుతుంది. ఈ ధర్మామృతం భవరోగ నివారిణి. మనోచయాన్ని పొందజేస్తుంది. శ్రద్ధను వృద్ధిచేస్తుంది. ఇట్లాంటి దివ్యౌషధాన్ని, సంజీవిని, సేవించిన భక్తుడు భగవంతునికి ప్రియతముడు కాగలడనుటలో సందేహం లేదు. ప్రేమించడంకన్నా ప్రేమించబడటం గొప్పది. ప్రేమించే వాడు భక్తుడు, ప్రేమించబడే వ్యక్తి భగవంతుడు. వారి సంబంధం భక్తి. ఒక స్థితిలో భక్తుడు, భగవంతుడు, భక్తి ఈ మూడు ఒక్కటి అవుతాయి. అదే సాయుజ్యం.

ఇట్లాంటి భక్తి అనే అమృతాన్ని ఆస్వాదించిన భక్తుడు భగవచ్చరణ సన్నిధిని చేరగలుగుట సత్యం, తథ్యం. ఇంతేకాక భగవంతునిని ప్రియాతి ప్రియుడై యుండగలడు. ఇంతకంటే మానవజన్మకు కావలసిందేముంది.

॥ ఓం తత్సత్ ॥

# ఇతర రచనలు

★

1. పరమగురువుల చరణ సన్నిధి .... 4-00
2. దివ్యజ్ఞానము – దివ్యజ్ఞాన సమాజము .... 10-00
3. రామానుజులవారి జీవితచరిత్ర .... 12-00
4. శోధన – సాధన (వ్యాససంపుటి) .... 12-00
5. తైత్తిరీయోపనిషత్తు (విస్మయానందుల వారి ఉపన్యాసములకు స్వేచ్ఛానువాదము)
6. మనశ్శక్తి (అనువాదం-అనిబిసెంట్ రచించిన Thought Power Cultural & Control) 12-00
7. తత్త్వశాస్త్ర మూలవిషయాలు .... 15-00 (అనువాదం హెచ్. పి. బ్లావట్స్కి)
8. యోగదర్శనము (పతంజలి–భాగం 1 .... 15-00 యోగసూత్రములపై భాష్యము)
9. —do— .... 25-00
10. యాజ్ఞవల్క్యుడు .... 15-00 (ఆధ్యాత్మిక కథాలహరి)

కరపత్రములు :—

1. థియసఫీ ఏమి బోధించును .... 4-00
2. హరిత పత్రాలు
3. సహకారము - అభ్యున్నతి

ఇంకా ఎన్నో........

SRI VENKATESWARA CENTRAL LIBRARY & RESEARCH CENTRE